ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 07.02.2026 | సంపుటి :12 సంచిక : 199 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv JANAMSAKSHI

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## మే 13, 14 తేదీల్లో
# ఐసెట్

### పరీక్ష నోటిఫికేషన్ విడుదల..

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో 2026-27 విద్యా సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఐసెట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 12 నుంచి మార్చి 16వరకు (ఆలస్య రుసుం లేకుండా) ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 13, 14 తేదీల్లో ఈ పరీక్ష జరగనుంది. మే 13న ఉదయం

మిగతా 2లో..

### రేవంత్‌పై ఎన్నికల పిటిషన్ ..
## కొట్టివేతకు హైకోర్టు
# తిరస్కరణ

హైదరాబాద్(జనంసాక్షి):హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. 2023లో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ

మిగతా 2లో..




## కాళేశ్వరం అవినీతిపై
# సీబీఐ కేసు ఏమైంది?



"నిధులు విడుదల చేసి మున్సిపాల్టీలను అభివృద్ధి చేయాలనుకున్నాం. 90 శాతం మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ సభ్యులే ఉన్నారు. నిధులు ఇచ్చినా అభివృద్ధి చేస్తారనే నమ్మకం లేదు. మన వారిని గెలిపించుకుంటేనే మున్సిపాల్టీల్లో అభివృద్ధి. మహేశ్‌గౌడ్ సూచనలతో నిజామాబాద్‌లో అభివృద్ధి పనులు చేస్తున్నాం" - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

## కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను కాపాడుతున్నారు
## నిజామాబాద్ రైతుల పోరాటం ఆదర్శం



- ధర్మపురి అర్వింద్‌తో జిల్లాకు ఒరిగింది శూన్యం
- బీజేపీ, బీఆర్ఎస్‌లను నమ్ముకుంటే నట్టేట ముంచుతారు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి
- నిజామాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

నిజామాబాద్ బ్యూరో(జనంసాక్షి): నిజామాబాద్ రైతుల పోరా టం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమన్నారు. నిజామాబాద్ జిల్లా లోని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నిజామా బాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శం కుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తు న్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవే యబోతున్నాం. మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నేను అందరివాడి ని. నాకు కులం, మతం లేదు. ఈ జిల్లా గొప్ప నాయ కులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన

మిగతా 2లో..

## ఎన్నికల మంతనాలు

### సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

హైదరాబాద్(జనంసాక్షి): సీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికలు, ఇతర అంశాలపై వారిద్దరూ చర్చిస్తున్నారు. త్వరలో జరగనున్న

మిగతా 2లో..



## మూడు వారాల్లో ప్రక్రియ
# పూర్తిచేయండి

### ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో తాజాగా జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం

మిగతా 2లో..

## యువ భారత్ సూపర్ సిక్సర్

### అండర్-19 వన్డే ప్రపంచ కప్ మనదే..

ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 100 పరుగుల తేడాతో ఘన విజయం





2లో

## ఇంటర్నెట్‌తో కాలక్షేపనం చేస్తూ
# సమయం వృథా చేసుకోకండి

### పరీక్షాపే చర్చా కార్యక్రమంలో విద్యార్థులతో మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):పరీక్షల ముందు ఒత్తిడిలో ఉండే విద్యార్థుల్లో సరికొత్త ఉత్సహాన్ని నింపేలా పరీక్షాపే చర్చా కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారితో మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. ఆ సందర్భంగా వారు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను శుక్రవారం మోదీ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "పరీక్షలను సానుకూలంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడం గురించి విద్యార్థులతో అద్భుతమైన చర్చ జరిగింది" అని రాసుకొచ్చారు. అలాగే ఈ వీడియోను అందరూ చూడాలని సూచించారు. ఈ వీడియోలో మోదీ విద్యార్థులతో మాట్లాడుతూ.. "నేను ప్రధానిని అయ్యాను.

మిగతా 2లో..





# గడ్చిరోలిలో మళ్లీ ఎదురు కాల్పులు

### ముగ్గురు మావోయిస్టుల మృతి

రాయపూర్(జనంసాక్షి):మహారాష్ట్ర - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పులు జరిగాయి. గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో భారీ నష్టం వాటిల్లింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో.. పోలీసులు, భద్రతా బలగాలు గురువారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. ప్రతిగా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ హోరాహోరీ పోరులో కమాండో దీపక్ ప్రాణాలు కోల్పోగా, గాయపడిన మరో అధికారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో ఏకే-47, ఓూఒఖీ స్వాధీనం చేసుకున్నాయి భద్రతా బలగాలు. ఘటనా స్థలంలో పోలీసులు.. ఆయుధాలు, విప్లవ సాహిత్యం,

మిగతా 2లో..

## ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్‌గా
# హైదరాబాద్




### గద్దర్ ఆలోచనలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుంది

### గద్దర్ ఫిలిం అవార్డుల సినిమా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్(జనంసాక్షి):వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని న భూతో న భవిష్యత్తు అన్న విధంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించాలని ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్ లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినిమాల స్క్రీనింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం కలలను ఉపయోగించి, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రారంభించింది ఇది రెండవ సంవత్సరం అని వివరించారు. వచ్చే ఉగాది పర్వదినం రోజు ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గద్దర్ చివరి రోజుల్లో వారితో తాను ఎక్కువ కాలం గడిపానని, వారి స్టూడియోలో అనేక ప్రయోగాత్మక పాటలు పాడారని, చివరి రోజుల్లో గద్దర్ రికార్డింగ్ స్టూడియోలో ఎక్కువ రోజులు గడిపారని డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు.తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను

మిగతా 2లో..



### మున్సిపల్ ఎన్నికలు
## భాజపా మేనిఫెస్టో
# విడుదల

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే

మిగతా 2లో..

## హెచ్-1బీ వీసాదారులు నగరాన్ని
# ఆక్రమించారు




### టెక్సాస్‌లో భారతీయులపై వివక్ష

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలో జరిగిన ఓ సమావేశంలో అక్కడి భారతీయులు వివక్షకు గురయినట్లు తెలుస్తోంది. హెచ్-1బీ వీసా దారులు తమ నగరాన్ని ఆక్రమించారంటూ ఫ్రిస్కో నగరంలోని కౌన్సిల్ సమావేశంలో అక్కడి సంప్రదాయ నేతలు జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. అయితే, దీనికి హాజరైన భారతీయులు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 3న జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. వాటి ప్రకారం.. ఫ్రిస్కో నగరంలో భారతీయుల సంఖ్య పెరిగిపోవడంపై కౌన్సిల్ సమావేశంలో మాట్లాడేందుకు రావాలని సోషల్ మీడియా కన్జర్వేటివ్ ఇన్‌ఫ్లూయెన్సర్లు కైలీ కాంబెల్, మార్క్ పలాసియానోలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొందరు వ్యక్తులు యూఎస్‌కు మద్దతుగా ఉండే టోపీలు, మాస్క్‌లతో పాల్గొన్నారు. వారు హెచ్-1బీ వీసాకు, ఇక్కడి భారతీయులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మార్క్ పలాసియానో మాట్లాడుతూ.. ఇక్కడ భారతీయుల జనాభా పెరగడం యాదృచ్ఛికం కాదన్నారు. ఇక్కడ వీసాల జారీలో మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. త్వరలో ఈ ప్రాంతం మొత్తం భారతీయులతో నిండిపోతుందని.. ఇప్పటికైనా అమెరికన్లు మేలుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన అమెరికన్ల ఉద్యోగాలను లాక్కొనే వీసా విధానానికి తాను, తన మద్దతుదారులు ఎప్పటికీ వ్యతిరేకమేనని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ వివక్షపూరిత వ్యాఖ్యలను సమావేశంలో పాల్గొన్న అనేకమంది ఇండో- అమెరికన్లు తీవ్రంగా ఖండించారు. హెచ్-1బీ వీసాల జారీలో జరుగుతున్న మోసాలను

మిగతా 2లో..



## చర్చలు విఫలమైతే..
# బలప్రయోగానికి వెనుకాడం

- ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక
- వెంటనే ఇరాన్ వీడండి
- తన పౌరులకు అగ్రరాజ్యం అడ్వైజరీ

న్యూయార్క్(జనంసాక్షి):మస్ వేదికగా ఇరాన్-అమెరికాల మధ్య అణు చర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల్లో ఇరుదేశాలు ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నాయా అని అంతా ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే బలప్రయోగానికి కూడా తమ దేశ అధ్యక్షుడు ట్రంప్ వెనుకాడబోరన్నారు. గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) విలేకరులతో మాట్లాడుతూ లీవిట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమన్ చర్చల్లో ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకోవడం కోసం ట్రంప్ ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అణురహిత ఇరాన్ డిమాండ్‌కు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ క్రమంలో దౌత్యం సాధ్యం కాకపోతే.. ట్రంప్‌నకు మరిన్ని ఎంపికలు ఉన్నాయని

మిగతా 2లో..

## ఇరాన్‌లో పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం

- భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్

## మిత్ర దేశాలు పరస్పరం గౌరవించుకోవాలి

- అంతేగానీ ఇలా మాకు పాఠాలు చెప్పే ప్రయత్నం చేయొద్దు
- అమెరికాకు పోలాండ్ హితవు

2లో..

## నేడు క్యాబ్ డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

కనీస వేతనాల అమలుకు డిమాండ్

## అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే కేసీఆర్‌పై తిట్లదండకం

కార్యకర్తలు సీఎం రేవంత్ ట్రాప్‌లో పడొద్దు: కేటీఆర్

## ప్రజలే మిమ్మల్ని వద్దనుకున్నారు

- ఇప్పుడు న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటారా!
- ప్రశాంత్ కిశోర్‌కు చీఫ్ జస్టిస్ చురకలు

## రెపోరేట్‌లో మార్పులులేవు

- యథాతథంగా ద్రవ్యపరపతి విధానం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

వివరాలు 2వ పేజీలో..

## అండర్-19 వన్డే ప్రపంచ కప్ మనదే..

హరారె: అండర్-19 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో టీమ్ఇండియా అదరగొట్టింది. వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన యువ భారత్.. తుది పోరులోనూ అదే దూకుడును ప్రదర్శించింది. ఇంగ్లాండ్‌పై 100 పరుగుల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది. దీంతో అండర్-19 వన్డే ప్రపంచ కప్ టైటిల్‌ను ఆరోసారి చేజిక్కించుకుంది. భారత్ నిర్దేశించిన 412 పరుగుల భారీ లక్ష్యం ముందు ఇంగ్లాండ్ తేలిపోయింది. 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఫాల్కనర్ సెంచరీ (115) పోరాటం సరిపోలేదు. బెన్ డాకిన్స్ 66, బెన్ మేయెస్ 45, థామస్ రేవ్ 31 పరుగులు చేశారు. భారత బౌలర్లలో అంబరీష్ 3, దీపేశ్ 2, కనిష్క్ 2 వికెట్లు తీయగా.. ఖిలాన్ పటేల్, ఆయుష్ మాత్రే తలో వికెట్ తీశారు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన యువ భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. వైభవ్ సూర్యవంశీ (175) మెరుపు ఇన్నింగ్స్‌తో ప్రత్యర్థి ముందు యంగ్ఇండియా భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్(9) స్వల్ప స్కోరుకే వెనుదిరగ్గా.. మరో ఓపెనర్ సూర్యవంశీ మాత్రం అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే అర్ధ శతకం(53)తో రాణించగా.. అభిజ్ఞాన్ కుందు(40), వేదాంత్ త్రివేది (32) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3, మోర్గాన్ 2, అలెక్స్ గ్రీన్ 2, మానీ ఒక వికెట్ తీశారు.

వైభవ్ వీరవిహారం..

ఫైనల్‌లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. సిక్సర్లు, ఫోర్లతో వీరవిహారం చేశాడు. 55 బంతుల్లో 8 ఫోర్లు, ఆరు సిక్సర్లతో శతకం పూర్తి చేసుకున్న అతడు.. ఆ తర్వాత మరింత చెలరేగి ఆడాడు. మరో 75 పరుగులను కేవలం 25 బంతుల్లోనే సాధించాడు. ఆ తర్వాత మానీ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. 218 స్ట్రైక్ రేట్‌తో.. 15 సిక్స్‌లు, 15 ఫోర్లను బాదాడంటే.. బౌలర్లను ఏ విధంగా ఊచకోత కోశాడో అర్థం చేసుకోవచ్చు.

## ఇంటర్నెట్‌తో కాలక్షేపనం చేస్తూ సమయం వృథా చేసుకోకండి

కానీ పనితీరు గురించి ప్రజలు ఎన్నో విషయాలు చెప్తుంటారు. ఆ సలహాలు అన్నీ తీసుకోవాలి. కానీ అందులో మనకు సరిపోయేది ఎంచుకోవాలి. నేను కూడా కొన్ని సూచనలు తీసుకొని, పనిలో మార్పులు చేసుకున్నాను. నా విలువలను మాత్రం వదులుకోలేదు. చదువు, విశ్రాంతి, అలవాట్లు, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంలో ఒక బ్యాలెన్స్ ఉండేలా చూసుకోవాలి. అదే ఎదుగుదలకు కీలకంగా మారుతుంది. ఆటలు ఆడటం అనేది ఒక నైపుణ్యం. వాటిని ఒక సరదాగా మాత్రమే చూడకండి. జూదం జోలికి వెళ్లకండి. బెట్టింగ్‌ల వంటి వాటికి వ్యతిరేకంగా మన దేశంలో చట్టాలు ఉన్నాయి. అలాగే గతం దగ్గరే ఆగిపోకుండా.. మీ ముందున్న దాన్ని చూసేందుకు ప్రయత్నించండి. ఇంకా చేయాల్సిన వాటి గురించి ఆలోచించండి. ఇంటర్నెట్ తక్కువ ధరకే లభిస్తుందని సమయం వృథా చేసుకోకండి. పరీక్షలను పండుగలా చేసుకోవాలి.. మీతో మీరు పోటీపడాలి" అంటూ పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరి ఆలోచనా విధానానికి తేడా ఉంటుందని గుజరాత్ విద్యార్థి సాన్య అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఈసారి పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు 4.5 కోట్ల మంది నమోదయ్యారు.

## చర్చలు విఫలమైతే.. బలప్రయోగానికీ వెనుకాడం

హెచ్చరించారు. చర్చల నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు. 'ఖమేనీ కలత చెందక తప్పదు' అని వ్యాఖ్యానించారు. ఇదిలాఉండగా.. రివల్యూషనరీ గార్డ్స్ స్థావరంలోని అండర్ గ్రౌండ్‌లో టెహ్రాన్ దీర్ఘశ్రేణి ఖొర్రామ్‌షహర్-4 క్షిపణులను మోహరించిందని స్థానిక మీడియా పేర్కొంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌకలు, యుద్ధనౌకలు, నిఘా విమానాలతో పాటు అనేకమంది అదనపు దళాలు ఈ ప్రాంతంలో ఇప్పటికే మోహరించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వేలాది మంది ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారు..

వెంటనే ఇరాన్ వీడండి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగశాఖ జారీ చేసిన అడ్వైజరీ ఆందోళన కలిగిస్తోంది 'వెంటనే ఇరాన్‌ను వీడండి' అంటూ యూఎస్ తన పౌరులను అప్రమత్తం చేసింది. "వెంటనే వీడటం వీలుకాకపోతే.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి" అంటూ అడ్వైజరీ జారీ అయింది. అయితే నెటిజన్లు కొందరు ఇది కొత్త అడ్వైజరీ కాదంటూ పోస్టులు పెడుతున్నారు. ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొంటున్న ఇరాన్.. స్వదేశంలో జరిగిన భారీ నిరసనల నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేదు. అడ్వైజరీకి ముందు ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ మరోసారి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. "ఖమేనీ చాలా కలత చెందక తప్పదు" అని పేర్కొన్నారు. దీంతో అమెరికా దాడులు చేస్తుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు దేశాల మధ్య అణు చర్చలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ ప్రకటనలు రావడం గమనార్హం.

## మిత్ర దేశాలు పరస్పరం గౌరవించుకోవాలి

**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికాకు మరో మిత్ర దేశం షాకిచ్చింది. అగ్రరాజ్య సూచనలను పట్టించుకోలేదు సరికదా.. తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదంటూ చురకలంటించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ బహుమతికి నామినేట్ చేయడానికి పోలండ్ నిరాకరించడం ఇరుదేశాల మధ్య దౌత్య వివాదానికి దారితీసింది. ఈ పరిణామాలను అగ్రరాజ్య దౌత్యవేత్త తీవ్రంగా ఖండించగా.. పోలండ్ ప్రధాని ఘాటుగా బదులిచ్చారు. అసలేం జరిగిందంటే..మధ్యప్రాచ్యంలో శాంతియుత పరిస్థితులు నెలకొల్పేలా చేసినందుకు గానూ.. వచ్చే ఏడాది నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును నామినేట్ చేయాలని అమెరికా, ఇజ్రాయెల్ నుంచి పోలండ్ పార్లమెంట్‌కు ప్రతిపాదనలు వచ్చాయి. దీన్ని పోలండ్ స్పీకర్ తిరస్కరించారు. "బలవంతపు రాజకీయాలు, విధానాలతో ట్రంప్ అంతర్జాతీయ సంస్థలను అస్థిరపరుస్తున్నారు. ఆయన నోబెల్‌కు అనర్హులు. ఈ ప్రతిపాదనను మేం తిరస్కరిస్తున్నాం" అని పోలండ్ స్పీకర్ ప్రకటించారు. ఈ చర్యను అమెరికా తీవ్రంగా పరిగణించింది. దీనిపై పోలండ్‌లోని అమెరికా దౌత్యవేత్త టామ్ రోజ్ స్పందిస్తూ.. "ఇది ట్రంప్‌ను అవమానించడమే. దీనివల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆయనను మా దేశంలోకి రానివ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేస్తాం" అని పేర్కొన్నారు. దీనిపై పోలండ్ ప్రధాని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. "మిత్ర దేశాలు పరస్పరం గౌరవించుకోవాలి. అంతేగానీ ఇలా మాకు పాఠాలు చెప్పే ప్రయత్నం చేయొద్దు. దౌత్య సంబంధాలు ఎలా నిర్వహించాలో మాకు తెలుసు" అని హితవు పలికారు.

## ఇరాన్‌లో పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇరాన్‌లో పరిస్థితులను నిశితంగా గమనిస్తు న్నామని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. భార తీయ విద్యార్థులకు ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తున్నామని, వారితో టచ్‌లో ఉన్నామని అన్నారు. ఈ మేరకు పార్లమెంట్‌కు ఆయన వివరాలు వెల్లడించారు. "టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఇరాన్‌లో ఉన్న మన విద్యార్థులు సహా పౌరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ.. ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తోంది. అవసరమైన సమయాల్లో సలహాలు ఇవ్వడంతోపాటు తగు సాయం అందిస్తోంది.

## కాళేశ్వరం అవినీతిపై సీబీఐ కేసు ఎమైంది?




తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందని మండిప డ్డారు. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండుసార్లు గెలిపించినా.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. మోదీ దగ్గర ఎంపీ అర్వింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించ లేదని ప్రశ్నించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నానని మరోమారు ప్రశ్నించారు. కెసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని సీఎం విమర్శించారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు. కాళేశ్వరం కేసు సీబీఐ కి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్ ను జైల్లో పెడతామన్న కిషన్ రెడ్డి.. కాళేశ్వరం కేసును బీజేపీ ఎందుకు ముందుకు సాగనీయడం లేదు.. సీబీఐ విచారణ చేయాలని కోరినా ఇప్పుడు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే ..నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ లను గెలిపిస్తే అభివృద్ధి జరగదని అన్నారు. బీజేపీనుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా.. నిధులు తెచ్చింది నిల్ అన్నారు. జిల్లా అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలవాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలన్నారు. అభివృద్దే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశాం.. ఒక కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలోవెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు సీఎం రేంత్ రెడ్డి.రూ.600కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌నిర్మిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి 100 శాతం సహకరిస్తా..నిధులిచ్చే బాధ్యత నాది.. నిజామాబాద్ ను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్,సలహాదారు సుదర్శన్ రెడ్డి, మంత్రులు,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే కేసీఆర్‌పై తిట్లదండకం

### కార్యకర్తలు సీఎం రేవంత్ ట్రాప్‌లో పడొద్దు: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల వేళ తమ ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్‌పై, ఆయన వ్యక్తిత్వం మీద రేవంత్ రెడ్డి విషం చిమ్ముతున్నాడని మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి అని తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద అని తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి మన స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్. ఒక తండ్రిలా ఈ రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పడావు పడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి కేసీఆర్. కానీ, నేడు అధికారం చేతిలో ఉందనే అహంకారంతో, తన వైఫల్యాలను, తన ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ మీద, ఆయన వ్యక్తిత్వం మీద విషం చిమ్ముతున్నాడు. ఇది కేవలం ఒక వ్యక్తి మీద దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అన్నారు. రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడకండి! మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద. కానీ రేవంత్ రెడ్డి తెలివిగా తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదోవ పట్టిస్తున్నాడు. ఈ విషపు వలలో మనం పడకూడదు. మన చర్చ, మన నిలదీత కేవలం ప్రజల కన్నీటి మీదనే ఉండాలి.ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాని గ్యారంటీల గురించి నిలదీయండన్నారు.

## నేడు క్యాబ్ డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

### కనీస వేతనాల అమలుకు డిమాండ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితులపై ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు శనివారందేశవ్యాప్త సమ్మెకు దిగనున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహిస్తున్నారు. కనీసం ఆరు గంటల పాటు డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొంటారని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. సమ్మెలో పాల్గొనే డ్రైవర్ల సంఖ్యను బట్టి ఆయా ప్రాంతాల్లో సేవల్లో సమ్మె తీవ్రత కనిపించనుంది. కనీస ఛార్జీలు, గిగ్ వర్కర్ల పని పరిస్థితులను నిరసిస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్ పేర్కొంది.క్యాబ్ సేవలను నియంత్రించేందుకు తీసుకొచ్చిన మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్, 2025 ఉన్నప్పటికీ ఆయా మాత్రం ఇష్టానుసారం ఛార్జీలు నిర్ణయిస్తున్నాయని కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. కాబట్టి ప్రభుత్వమే జోక్యం చేసుకుని కనీస ఛార్జీలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు వాహనాలను కమర్షియల్ అవసరాలకు వినియోగించడంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. డ్రైవర్ల ఆదాయానికి రక్షణ కల్పించడంతో పాటు, పని పరిస్థితుల మెరుగు కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ వర్కర్లు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం చొరవ తీసుకుని 10 నిమిషాల డెలివరీ హామీని తొలగించాలని ఆయా కంపెనీలకు సూచించింది. దీంతో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్‌టో 10 నిమిషాల హామీని తొలగించాయి.

## ఎన్నికల మంతనాలు

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, నేతల మధ్య సమన్వయం తదితర విషయాలపై రేవంత్, భట్టి చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇటీవల మంత్రులతో సీఎం నిర్వహించిన భేటీకి డిప్యూటీ సీఎం హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో సీఎంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

## మూడు వారాల్లో ప్రక్రియ పూర్తిచేయండి

కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేయ దానికి మరో మూడు వారాల సమయం కావా లని ఆయన కోరారు.అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్ప టికే తగినంత సమయం ఇచ్చామని గతం లోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా ఉండాలని స్పష్టం చేసిం ది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వే సింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణ యాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ప్రజలే మిమ్మల్ని వద్దనుకున్నారు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రశాంత్ కిశోర్ కు చెందిన జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గతేడాది బిహార్‌లో జరిగిన ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చురకలంటించారు. ఇప్పుడు ఈ న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీకి దిగిన ప్రశాంత్ కిశోర్ పార్టీ.. ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. ఇందులో ఎన్డీయే కూటమి ఘన విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, గెలిచిన కూటమి సభ్యులు ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి.. ఒక్కో మహిళకు రూ.10వేలు పంపిణీ చేశారని జన్ సురాజ్ పార్టీ పిటిషన్‌లో ఆరోపించింది. ఈ క్రమంలో కూటమి గెలుపు చెల్లదని ప్రకటించాలని ఆ పార్టీ కోరింది. అయితే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది.ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'మేము ఇలాంటి నోటీసులు జారీ చేయలేం" అని అన్నారు.

## మే 13, 14 తేదీల్లో ఐసెట్

10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో సెషన్, మే 14న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మూడో సెషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

## గడ్చిరోలిలో మళ్లీ ఎదురు కాల్పులు

ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఇంకా కొందరు మావోయిస్టులు దాగిఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో గడ్చిరోలి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు.. అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచనలు జారీ చేశారు. ఎన్‌కౌంటర్ పూర్తైన తర్వాత మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## హెచ్-1బీ వీసాదారులు నగరాన్ని ఆక్రమించారు..

తాము వ్యతిరేకిస్తామని.. అయితే, ఇందుకు ఇక్కడి భారతీయులపై ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. తాము ఇక్కడ జీవించడం వల్ల ఈ ప్రాంతానికి కూడా ప్రయోజనకరమని స్పష్టంచేశారు. నగరంలో నివసించే భారతీయులకు ఫ్రిస్కో మేయర్ జెఫ్ చెనీ మద్దతుగా నిలిచారు. కాగా, ఫ్రిస్కోలో భారతీయ మూలాలున్న జనాభా అధికం. ప్రభుత్వం నిర్వహించిన సర్వే ప్రకారం.. 2010లో 10 శాతంగా ఉన్న వీరి సంఖ్య ఇప్పుడు 33 శాతానికి పెరిగింది.

### ఆరు రోజులుగా హడలెత్తించిన పెద్దపులి..

## ఎట్టకేలకు చిక్కింది

**కడియం(జనంసాక్షి):**ఆరు రోజులుగా స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన పెద్దపులి ఎట్టకేలకు చిక్కింది. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలోని కుర్మాపురంలో అటవీ సిబ్బందికి పెద్ద పులి చుక్కలు చూపించింది. శుక్రవారం ఉదయం కుర్మాపురంలోని పాడుబడిన ఇంట్లో పులి గాండ్రింపులు వినిపిస్తున్నట్లు స్థానికులు చెప్పడంతో అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పులిని బంధించేందుకు నిపుణులు, అటవీశాఖ సిబ్బంది తుపాకీలో మత్తు ఇంజక్షన్ లోడ్ చేసి షూట్ చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో అది బెదిరిపోయి పాడుబడిన ఇంటి నుంచి సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. పెద్ద పులి సంచారం, గాండ్రింపులతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు సాయంత్రానికి కొత్త చెరువు వద్ద.. మత్తు ఇంజక్షన్‌తో షూట్ చేసి పులిని బంధించారు.తూర్పుగోదావరి జిల్లాలో రోజుకో ఊరు తిరిగిన పెద్ద పులి.. రఘునాథపురం, రాజానగరంలో, జి. యర్రంపాలెంలో మూడు ఆవులు, దూడను చంపింది. పులిని బంధించేందుకు ఆరు రోజులుగా అటవీశాఖ అధికారులు తీవ్రంగా శ్రమించారు. పుణె, ఢిల్లీ నుంచి నిపుణుల బృందం కూడా వచ్చింది. జాడ గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలు, థర్మల్ డ్రోన్లు, ఆధునిక పరికరాలను ఉపయోగించారు. హడలెత్తించిన పెద్దపులి ఎట్టకేలకు చిక్కడంతో జిల్లా వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీహబ్‌గా హైదరాబాద్

ఇవ్వబోతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీకే కాదు భారతదేశంలోని వివిధ భాషలకు హైదరాబాద్ కేంద్రంగా మారాలని ప్రజా ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉండే వాతావరణ పరిస్థితులు, నిపుణులు, శాంతి భద్రతలు దేశంలోని మరే ఇతర నగరాల్లో లేవని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. సినిమాల ద్వారా సామాజిక సందేశం ఇవ్వడంతో పాటు ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ ఆస్కార్ వంటి ప్రపంచ స్థాయి అవార్డులను సాధించడం గర్వించదగిన అంశం అటువంటి అంశాలను పునాదిగా చేసుకుని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలని ఆలోచనల తో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. సినిమా పరిశ్రమకు అవసరమైన ఆర్థిక, సామాజిక, శాంతిభద్రతలపరంగా ఇంకా ఎటువంటి అవసరం అయినా అర్ధరాత్రి తమ ప్రజా ప్రభుత్వం తలుపు తట్టవచ్చని మీకోసం సీఎం రేవంత్ రెడ్డి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోపాటు తాను అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు, శాఖ మంత్రి వెంకట్ రెడ్డి గారు అందుబాటులో లేరు మీ అందరిని ప్రోత్సహించాలనేది మా అందరి ఏకైక లక్ష్యం అనే సందేశాన్ని మీ అందరికీ తెలియజేయ వలసిందిగా తనకు తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. గద్దర్ ఫిలిం అవార్డుల కార్యక్రమాన్ని ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మనస్ఫూర్తిగా తీసుకొని బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తున్నారని డిప్యూటీ సీఎం అభినందించారు. సినీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, సినీ కార్మికుల కోసం, సినీ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేయాలని ఆలోచనలను సైతం దిల్ రాజు తమతో పంచుకుంటున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. జూరీ చైర్మన్ మణిశర్మ తెలియని వారు సినీ రంగంలో లేరని, తరతమ బేధాలు లేకుండా, పారదర్శకంగా సినిమాలు చూడడమే కాదు నిష్పక్షపాతంగా అవార్డుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలనీ చైర్మన్ తో పాటు జూరీ సభ్యులను కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్డిసి చైర్మన్ దిల్ రాజు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ, ఎఫ్డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల్లో కొత్త పార్టీ

చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు.ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నా న్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచారం యాక్టివ్‌గా లేదు: కవిత

బీసీల అంశంలో బీఆర్ఎస్ పార్టీ ఏనాడూ చిత్తశుద్ధితో వ్యవహరించలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయాలో.. వద్దో.. బీసీలు ఆలోచించుకోవాలన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో కవిత మాట్లాడారు. పెద్ద నాయకులు బీఆర్ఎస్ పార్టీని గాలికి వదిలేశారా? అని ప్రశ్నించారు. తమ రాజకీయ పార్టీ ఆవిర్భావానికి మంచి ముహూర్తం కోసం చూస్తున్నామని.. ఏర్పాటు ప్రక్రియ మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశముందని ఈ సందర్భంగా కవిత తెలిపారు."మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచారం అంత యాక్టివ్‌గా లేదు. ఆ పార్టీ నేతలెవరూ కిందిస్థాయిలో క్రియాశీలంగా లేరు. కృష్ణార్జునులు రాష్ట్రమంతా ఎందుకు పర్యటించడం లేదు? అలా ప్రచారం చేయడం లేదంటే.. వారు రాష్ట్రస్థాయి నేతలు కారా?. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ తన విధానాన్ని స్పష్టంగా చెప్పలేదు. ఆ సామాజిక వర్గానికి వారు అనుకూలమా?, లేదా? అనేది వెల్లడించాలి. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ వేసిన మాధవరెడ్డికి ఆ పార్టీ టికెట్ ఎలా కేటాయిస్తుంది? బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలి. సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించాలి. సీఎం రేవంత్ ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదు. నేను అసంబద్ధంగా మాట్లాడితే ప్రజలే ప్రశ్నిస్తారు. ఎవరు సమాధానాలు దాటవేస్తున్నారో వారు గమనిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదు" అని కవిత అన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు భాజపా మేనిఫెస్టో విడుదల

తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖా శర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడుతున్నాయని అని రామచందర్ రావు అన్నారు. కేంద్రం.. తెలంగాణకు ఏం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇచ్చిందో.. జిల్లాల వారీగా చెబుతామని, రేవంత్ రెడ్డి జిల్లాలకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. పోలీసులు భాజపా కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం, మంచిర్యాలలో పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను కార్యకర్తల్లా ఉపయోగించుకుంటుందని దుయ్యబట్టారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాజపా సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.

## రెపోరేట్‌లో మార్పులు లేవు

### యథాతథంగా ద్రవ్యపరపతి విధానం -ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబై(జనంసాక్షి):**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బ్జడెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. గత ఏడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టింది. ఆ తర్వాత డిసెంబర్‌లో మరో పావు శాతం తగ్గించింది. దాంతో గత ఏడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపింది. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీఐ అంచనా వేసింది. కాగా జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ.75 వేల కోట్లుగా ఉంది.

# సీఎం ప్రజావాణిలో 406 దరఖాస్తులు



హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 406 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 135, రెవెన్యూ శాఖకు సంబంధించి 38, ఇందిరమ్మ ఇండ్ల కోసం 147, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మోడీ హటావో దేశ్‌కు బచావో

- నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల బతుకులు బుగ్గిపాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- రద్దు చేసే వరకు ఉద్యమించాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు
- ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు



మొయినాబాద్ (జనంసాక్షి) : నరేంద్ర మోడీ ప్రభుత్వం అనసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలు దేశ కార్మిక వర్గంతో పాటు ప్రజలకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని మోడీ హటావో దేశ్ కు బచావో అనే నినాదంతో పోరాడకపోతే దేశ కార్మిక వర్గానికి ప్రజలకు మనుగడ ఉండదని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త జరుగుతున్న సార్వత్రిక కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ రాజేంద్రనగర్ మండల పరిధిలోని. హైదర్ గూడ ఏరియాలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు పాల్గొని గోడపత్రికలను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ. సుప్రీంకోర్టు గైడ్లెన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. మున్సిపల్ రంగంలో పేరుకుపోయిన సమస్యల పైన రాబోయే కాలంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె చందు యాదవ్, అత్తాపూర్ సర్కిల్ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్, చంద్రయ్య, వినయ్, శంకరయ్య, హరి, కృష్ణ, సురేష్, అశోక్, మరియు పారశుధ్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 75 శాతానికి పైగా స్థానాలు గెలుస్తుంది

- ప్రచారంలో మంత్రి దామోదర రాజనర్సింహ



రంగారెడ్డి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి ప్రధాన పార్టీలు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 75 శాతానికి పైగా స్థానాలు గెలుస్తుందని అన్నారు. ప్రచారంలో అమ్మా.. బాగున్నారా.. మా పాలన ఎలా ఉంది.. పథకాలు అందుతున్నాయా.. మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.. అంటూ... ఓటర్లను మంత్రి దామోదర రాజనర్సింహ పలకరించారు. 14వ వార్డు అభ్యర్థి అందెమోహన్ తరపున ఇంటింటి ప్రచారానికి వచ్చిన ఆయన స్థానిక భవాని మాత ఆలయం దగ్గర రచ్చబండ ఏర్పాటు చేసి మహిళలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పలువీధుల్లో తిరిగి కాంగ్రెస్ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తమ అభ్యర్థి అందెమోహన్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు దామోదర రాజనర్సింహ. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో 75శాతానికి పైగా గెలుస్తుందని అన్నారు. తమ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తుందన్నారు. సీఎం పని తీరుతో ప్రజలు సంతృప్తి గా ఉన్నారని అన్నారు.

# వాట్సాప్ మీ-సేవకు ఆదరణ

- 3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ మీ సేవ విధానానికి అత్యధిక ప్రజాదరణ లభించిందని సర్కార్ శుక్రవారం వెల్లడించింది. దీంతో ఇప్పటివరకూ 3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు అందినట్లు వివరించింది. ఈ వాట్సాప్‌లో 4.5 లక్షల మంది నమోదు చేసుకోగా.. 3.25 లక్షల మంది ఈ సేవలు పొందినట్లు గణాంకాలతో సహా విశదీకరించింది. కాగా, 24 గంటలపాటు 8096958096 వాట్సాప్ నంబర్ ద్వారా సేవలు అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. పది కంటే ఎక్కువ శాఖలకు చెందిన 581 రకాల సేవలను ఈ వాట్సాప్ నెంబర్ ద్వారా అందుబాటులో తీసుకువచ్చింది. క్యాస్ట్, ఆదాయం, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం ఈ వాట్సాప్ నెంబర్‌ను అత్యధికంగా వినియోగించినట్లు గుర్తించింది. మీ సేవా స్టేటస్, సర్టిఫికేట్ డౌన్‌లోడ్ అన్నీ వాట్సాప్‌లోనే పొందవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదే పదే మీ సేవా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారా ఈ సేవలు అందిస్తోందని వివరించింది. 2025 నవంబర్ 18వ తేదీన ఈ సేవలను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు. డిజిటల్ అవగాహన లేని వారికీ సులభంగా ఈ సేవలు అందిస్తోంది. అలాగే ఈ వాట్సాప్ మీ సేవ ద్వారా 31 దేవాలయ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేవుని దర్శనం, వసతితోపాటు సేవలన్నీ ఈ వాట్సాప్‌లోనే బుకింగ్ చేసుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక రానున్న రోజుల్లో 108, 101, 102 ఎమర్జెన్సీ సేవలను సైతం ఈ వాట్సాప్ నెంబర్‌కు అనుసంధానం చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 5వేలకు పైగా ఉన్న మీ సేవా కేంద్రాల్లో రోజుకు 80 వేల నుంచి లక్ష మంది వరకూ సేవలు పొందుతున్నారు. 2023 నవంబర్ 1 నుంచి 2026 జనవరి 31వ తేదీ వరకూ 5.98 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపింది. వాటి విలువ రూ.3,811 కోట్లు ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఈ-ఆఫీస్ ద్వారా ఫైళ్లకు సత్వర పరిష్కారం

- హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్





హైదరాబాద్ (జనంసాక్షి) : ఈ-ఆఫీస్ ద్వారా ఫైళ్లకు సత్వర పరిష్కారం లభిస్తుందని హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభాగాధిపతుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం హైదరాబాద్ లక్డీకాపుల్ లోని ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డైరెక్టరేట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన 'ఈ-ఆఫీస్' అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రంలో కాగిత రహిత (పేపర్‌లెస్) పాలనను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ-ఆఫీస్ విధానం ద్వారా ఫైళ్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, పరిపాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ విభాగంలో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేసిన డైరెక్టర్‌ను, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం, ప్రాసిక్యూషన్ విభాగం కోసం రూపొందించిన 'ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నిర్వహణ వ్యవస్థ'ను ఆయన ప్రారంభించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సిబ్బంది హాజరులో క్రమశిక్షణ, పారదర్శకత పెరుగుతుందని ఆయన తెలిపారు. ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సి.వి. ఆనంద్ కీలక సూచనలు చేశారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శ్రీ ఎస్. సాంబశివ రెడ్డి గారు విభాగం పనితీరు, సాధించిన విజయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శాఖాపరమైన కొన్ని పెండింగ్ అంశాలను ఆయన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. దేశంలో అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల గురించి సివి ఆనంద్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ చట్టాల అమలుకు సంబంధించి సర్క్యులర్లు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, ప్రభుత్వ ఉత్తర్వుల రూపకల్పనలో ప్రాసిక్యూటర్ల బృందం చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. కొత్త చట్టాల సమర్థవంతమైన అమలుకు తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన డైరెక్టరేట్ సిబ్బందితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడారు .ప్రభుత్వ ఉన్నతాధికారి తమ కార్యాలయాన్ని సందర్శించి, తమతో సమయం గడపడం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

# పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం సీఎం దృష్టికి..

- న్యాల్ కల్ లో త్వరలో 108 వాహన సౌకర్యం
- జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్



న్యాల్ కల్, ఫిబ్రవరి 06, (జనం సాక్షి) : న్యాల్ కల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పదోన్నతి కల్పిస్తూ, ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు త్వరలోనే న్యాల్ కల్ లో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు, సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాల్ కల్ లో ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్చించనున్నట్లు, అతి త్వరలోనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారికి జహీరాబాద్ ఎంపీ ఆదేశించారు. న్యాల్ కల్ లోని ఆర్టీసీ బస్టాండ్ పునర్నిర్మాణానికి ఈ పాటికే రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తో చర్చించినట్లు, అతి త్వరలోనే నిధులు మంజూరు అవ్వనున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. శుక్రవారం న్యాల్ కల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఐఈ ఇండియా సంస్థ పూనే, సిఎస్ఎం నిధులు రూ:16 లక్షలతో చేపట్టిన పలు పనులను ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, సంస్థ ప్రతినిధులతో కలిసి స్వచ్ఛంద సంస్థల నిధులతో నిర్మించిన సమావేశ మందిరం, మరుగుదొడ్లు, కుళాయిలు, ఏర్పాటు చేసిన తదితర పనులను ప్రారంభించారు. మారుమూల గ్రామాల్లో సామాన్య ప్రజానీకానికి విద్య, వైద్యం సమకూరాలనే లక్ష్యంతో సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎంపీ, మాజీ మంత్రి ప్రసంశించారు. మరో 5-6 సంవత్సరాల్లో జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధితో దూసుకుపోనుందని, ఈ వాటికే జాతీయ రహదారుల విస్తరణ పనులు శరవేకంగా కొనసాగుతున్నాయని, స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలో గర్భిణీలకు మెరుగైన సేవలందించిన ఏఎన్ఎం లకు సత్కరించి అభినందించారు. 108 వాహనం, 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎంపీ, జిల్లా వైద్యాధికారికి ప్రతి పత్రాన్ని అందజేశారు. మండల కేంద్రమైన న్యాల్ కల్ లో ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని స్థానిక బారాస నాయకుడు ప్రవీణ్ కుమార్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ డిప్యూటీ వైద్యాధికారి లక్ష్మీ శైలజ, స్థానిక వైద్యాధికారి డాక్టర్ జైన్ అమృత్ రాజ్, అధికార పార్టీ శ్రేణులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతారు?

- బీసీ ఇంటలెక్చువల్ ఫోరం డిమాండ్



హైదరాబాద్ (జనంసాక్షి) : అగ్రవర్ణ పార్టీ నాయకుల్లారా ఏ ముఖం పెట్టుకొని బీసీల ఓట్లు అడుగుతారు? అని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న నిరంతర అన్యాయాలపై బీసీ సంఘాలు, బీసీ మేధావులు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయని, రాష్ట్రంలో ఉన్న మూడు ప్రధాన రాజకీయ పార్టీలు-బీసీలకు అనుకూలంగా కాకుండా, స్పష్టంగా బీసీ వ్యతిరేక విధానాలతోనే వ్యవహరిస్తున్నాయని ఈ సందర్భంగా ఖండించారు. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వైఖరి పూర్తిగా బీసీ వ్యతిరేకమని మరోసారి రుజువైందన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంలో బీసీలకు వ్యతిరేకంగా జారీ చేసిన ప్రభుత్వ జీవోపై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న వ్యక్తికే కౌన్సిలర్‌గా బీ-ఫామ్ ఇచ్చారని, ఇది బీఆర్ఎస్ పార్టీకి ఉన్న అసలైన ఓబీసీ/బీసీ దృక్పథాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో బీసీలకు ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లు 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించబడ్డాయని, బడ్జెట్‌లో బీసీలకు నిధులు కేటాయించినట్లు చూపించి, వాటిని పూర్తిగా విడుదల చేయకుండా తీవ్రమైన అన్యాయం జరిగిందని, బీసీ రిజర్వేషన్ల కోసం ఒక్కరోజు కూడా నిజాయితీతో ఉద్యమం చేయని పార్టీగా బీఆర్ఎస్ నిలిచిందని తెలిపారు. కులగణన అంశంలో భాగస్వామ్యమై ఉన్నప్పటికీ, దాని ఫలితాలను అమలు చేయడంలో పూర్తి వైఫల్యం చూపిందని, నామినేటెడ్ పోస్టులన్నింటినీ అధికంగా అగ్రవర్ణాలతో నింపి, బీసీలను పక్కన పెట్టిందని తెలిపారు. అలాగే బీజేపీ పార్టీ ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీలకు 42%శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించే బిల్లు ప్రవేశపెట్టాలని 9 వ షెడ్యూల్ లో చేర్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అడగకుండానే జుఔ రిజర్వేషన్లు ఇస్తున్న కేంద్ర పాలకులు, బీసీలు కు మాత్రం మోకాలు అడ్డం పెట్టటం అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగింది. రాష్ట్ర స్థాయిలోనూ, జాతీయ స్థాయిలోనూ బీసీలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాల్సిందే అని డిమాండ్ చేసారు.ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని ప్రకటించి, గత రెండు సంవత్సరాల్లో కేటాయించాల్సిన నిధుల్లో కనీసం పది శాతం కూడా ఖర్చు చేయకపోవడం కాంగ్రెస్ పాలకుల బీసీ వ్యతిరేక ధోరణీ కి నిదర్శమన్నారు

యూనివర్సిటీల్లో ఈక్విటీ రూల్స్‌ను తక్షణమే అమలు చేయాలని, బీసీలకు సంబంధించిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని తెలిపారు. లేకపోతే రాబోయే కాలంలో బీసీలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో భారీ ఉద్యమాలకు సిద్ధమవుతారని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాము. అని తెలియ చేశారు .ఈ సభలో లిలిబీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు శ్రీ బాలగోని బాలరాజ్ గౌడు గారు ప్రసంగిస్తూ, మూడు ప్రధాన పార్టీల బీసీ వ్యతిరేక వైఖరిని తీవ్రంగా ఖండించారు.ఎన్నికల్లో బీసీల చేతిలో చావు దెబ్బ తినక తప్పదని హెచ్చరించారు. అలాగే ఈ కార్యక్రమంలో:బీసీ ఇంటెలెక్ట్యువల్ ఫోరం తరపున శ్రీకాంత్, లింగేశ్ యాదవ్, ఉస్మానియా యూనివర్సిటీ బీసీ జాక్ లీడర్ రమేష్ యాదవ్ పాల్గొని, యూనివర్సిటీ ఈక్విటీ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా వెంకన్న దుర్గయ్య గౌడు ఎలికంటి విజయ్ కుమార్ , అంబాల నారాయణ గౌడు గారు ,బైరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్‌లో కామారెడ్డి మావోయిస్ట్ మృతి



నాగపూర్, ఫిబ్రవరి6 (జనంసాక్షి) : మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. భమ్రాగఢ్ తాలూకా ఫడేవా అటవీప్రాంతంలో గురువారం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. నిన్న ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా, ఇవాళ మరో నలుగురి మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ ముఖ్య నేత ప్రభాకర్ ఉన్నట్టు గుర్తించారు. అతడి స్వస్థలం తెలంగాణలోని కామారెడ్డి. మావోయిస్టు ప్రభాకర్‌పై రూ.50లక్షల రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌తో సహా పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# పటాన్‌చెరులో పలువురు బిఆర్ఎస్‌లో చేరిక

సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీలు దేవానందం, యాదగిరి యాదవ్, వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ లతో పాటు 500 మంది కార్యకర్తలు మాజీ మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్ నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలను బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేస్తుందని ఆయన ఆశాభవం వ్యక్తం చేశారు.

# సామల సహదేవ్‌కు టీజీవో డైరీ అందజేత



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం కోశాధికారి సామల సహదేవ్‌కు 2026 హైదరాబాద్ జిల్లా డైరీని బహూరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ముందుకెళ్తున్న క్రమంలో ఎప్పుడు అందరం దండగా ఉంటానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంబి కృష్ణ యాదవ్. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ట్రెజరర్ ఎంవి రమణ. పవన్ కుమార్ పాల్గొన్నారు.

# మార్చిలో ప్రారంభానికి సిద్ధమైన సనత్‌నగర్ ఆస్పత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి6 (జనంసాక్షి) : సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను మార్చిలో ప్రారంభించేందుకు చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణాన్ని విస్తృతంగా పరిశీలించారు. ఇంజనీరింగ్ ప్రతినిధులతో కలిసి అన్ని అంతస్తులలో కొనసాగుతున్న పనులను సమీక్షించారు. ఎమర్జెన్సీ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ విభాగం సిద్ధతను ప్రత్యేకంగా పరిశీలించారు. ఫిబ్రవరి 28లోగా మిగిలిన అన్ని సివిల్, మౌలిక వసతుల పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి అంతటా సైన్‌బోర్డులు వంటి సహాయక వసతులను ఈ నెలాఖరులోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈపీసీ పరిధిలోని వైద్య పరికరాలన్నీ ఇప్పటికే అమర్చినట్లు కాంట్రాక్టర్ వెల్లడించగా, మొత్తం 540 వైద్య మరియు అనుబంధ పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఆసుపత్రి కార్యకలాపాల ప్రారంభానికి ముందుగా పరికరాల పరీక్షలు, ట్రయల్ రన్స్ నిర్వహించేందుకు వైద్య, సాంకేతిక సిబ్బందిని వెంటనే నియమించాలని వైద్య విద్యా డైరెక్టర్‌ను ఆదేశించారు. ఫిబ్రవరి 12 నుంచి 28 మధ్య తొలి దశలో 100 మంది వైద్య, పారా వైద్య మరియు హౌస్‌కీపింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. నెలాఖరుకు పూర్తి సిబ్బంది నియామకం పూర్తవుతుందని వెల్లడించారు.మార్చిలో సనత్‌నగర్ ప్రజలకు అందుబాటులోకి రానుండటంతో, హైదరాబాద్ నగరానికి మరో కీలక ప్రభుత్వ వైద్య సంస్థగా ఇది నిలవనుందని అధికారులు తెలిపారు.

# ‘ఎప్ స్టీన్ ఫైల్స్’

## ప్రపంచాన్ని కుదిపేసిన నిజాలు, భారత్ మీడియా మౌనం




ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక వర్గాలపై తీవ్ర ప్రభావం చూపిన అంశాల్లో ఇటీవలి కాలంలో ‘ఎప్ స్టీన్ ఫైల్స్’ ఒకటి. లైంగిక దోపిడీ, బాలల అక్రమ రవాణా, శక్తివంతుల రహస్య నెట్‌వర్కులు, న్యాయవ్యవస్థల వైఫల్యాలు ఇవన్నీ ఒకేచోట బయటపడటమే ఈ ఫైల్స్‌ను అంతర్జాతీయంగా సంచలనంగా మార్చాయి. అమెరికా నుంచి యూరప్ వరకూ మీడియా, పౌరసంఘాలు, మానవ హక్కుల సంస్థలు ఈ అంశాన్ని తీవ్రంగా చర్చిస్తున్నాయి. కానీ అదే సమయంలో, భారతీయ ప్రధాన మీడియా ఈ విషయంలో చూపుతున్న మౌనం అనేక ప్రశ్నలకు తావిస్తోంది.

అమెరికాలో జెఫ్రీ ఎప్ స్టీన్ అరెస్టు, ఆపై అతని అనుమానాస్పద మరణం జరిగినప్పటి నుంచే అనుమానాలు మొదలయ్యాయి. కానీ తాజాగా బయటకు వచ్చిన కోర్టు డాక్యుమెంట్లు, సాక్ష్యాలు, ఈమెయిల్స్, ప్రయాణ వివరాలు ‘ఎప్ స్టీన్’ ఒక వ్యక్తి మాత్రమే కాదని, అతడు కేంద్రంగా పనిచేసిన ఒక విస్తృతమైన శక్తివంతుల వలయం ఉందని ప్రపంచానికి స్పష్టంచేశాయి. రాజకీయ నాయకులు, బిలియనీర్లు, కార్పొరేట్ అధినేతలు, హాలీవుడ్ ప్రముఖులు ఇలా అనేక రంగాలలో ప్రముఖుల పేర్లు ఈ ఫైల్స్‌లో ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో ప్రస్తావనకు రావడం అమెరికా సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది.

అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ప్రధాన పత్రికలు దీనిపై లోతైన కథనాలు రాశాయి. ‘న్యూయార్క్ టైమ్స్’, ‘ది గార్డియన్’, ‘వాషింగ్టన్ పోస్ట్’ వంటి పత్రికలు ఈ ఫైల్స్‌ను న్యాయవ్యవస్థ పారదర్శకత, ధనిక--పేద మధ్య న్యాయ అసమానతకు ఉదాహరణగా విశ్లేషించాయి. పౌరహక్కుల కార్యకర్తలు “ఇది కేవలం లైంగిక నేరాల అంశం మాత్రమే కాదు; అధికారాన్ని దుర్వినియోగం చేసే గ్లోబల్ ఎలైట్ వ్యవస్థను బయటపెట్టే క్షణం”గా అభివర్ణించారు. సామాజిక మాధ్యమాల్లో బాధితులకు న్యాయం (‘జస్టిస్ ఫర్ విక్టిమ్స్’) అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా వినిపించింది.

యూరప్‌లోనూ ఇదే స్పందన కనిపించింది. ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో ఎప్ స్టీన్ వ్యవహారం మహిళల భద్రత, బాలల రక్షణపై ఉన్న చట్టాల ప్రభావాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు కూడా మానవ అక్రమ రవాణా వ్యతిరేక చర్యల్లో అంతర్జాతీయ సహకారం ఎంత కీలకమో ఈ ఉదంతం చూపించిందని వ్యాఖ్యానించాయి.

ఇంతటి ప్రపంచ చర్చ జరుగుతున్నప్పటికీ, భారతీయ ప్రధాన మీడియా మాత్రం ఈ అంశాన్ని పక్కన పెట్టినట్టే కనిపిస్తోంది. కొద్ది ఆన్‌లైన్ పోర్టల్స్ లేదా స్వతంత్ర జర్నలిస్టులు తప్ప, టెలివిజన్ చర్చలు గానీ, ప్రధాన పత్రికల ఫ్రంట్ పేజీలు గానీ ‘ఎప్ స్టీన్ ఫైల్స్’ను గంభీరంగా తీసుకున్న దాఖలాలు చాలా తక్కువ. దీనికి కారణం ఏమిటన్న ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. అంతర్జాతీయ శక్తివంతులతో సంబంధాలున్నాయన్న భయం? లేక దేశీయ రాజకీయ అజెండాలకు సరిపోని విషయం కావడమేనా?

భారతీయ మీడియా మౌనం మరింత ఆందోళన కలిగించేది మరో కోణంలో. ఈ ఫైల్స్‌లో భారతీయులకు సంబంధించిన పరోక్ష ప్రస్తావనలు, వ్యాపార సంబంధాలపై వచ్చిన వార్తలు కూడా పూర్తిస్థాయిలో చర్చకు రాలేదు. ప్రపంచీకరణ యుగంలో, గ్లోబల్ ఎలైట్ నెట్‌వర్కులు దేశ సరిహద్దులను లెక్కచేయవు. అటువంటి సందర్భంలో “ఇది మన విషయం కాదు” అన్న నిర్లక్ష్యం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

‘ఎప్ స్టీన్ ఫైల్స్’ ప్రపంచానికి ఒక కఠినమైన నిజాన్ని చెబుతున్నాయి ‘ధనం’, ‘అధికారం’ కలిసినప్పుడు ‘న్యాయం’ ఎంత సులభంగా అణచివేయబడుతుందో. ‘న్యాయవ్యవస్థలు’, ‘మీడియా’, ‘ప్రభుత్వాలు’ నిజంగా స్వతంత్రంగా పనిచేయకపోతే, బాధితుల గొంతులు ఎంత సులభంగా మూగబోయే అవకాశముందో ఈ ఉదంతం చూపించింది. అందుకే పాశ్చాత్య దేశాల్లో ఇది కేవలం స్కాండల్‌గా కాకుండా, ఒక వ్యవస్థాపక వైఫల్యంగా చర్చకు వచ్చింది.

145 కోట్ల జనాభా ఉన్న భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో మీడియా పాత్ర మరింత కీలకం. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా, మానవ హక్కులకు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు వేయడం, ప్రజలను అవగాహన కల్పించడం మీడియా బాధ్యత. ‘ఎప్ స్టీన్ ఫైల్స్’పై భారతీయ మీడియా మౌనం, నిజానికి మన మీడియా ప్రాధాన్యతలను, దాని స్వతంత్రతను, దాని ధైర్యాన్ని ప్రశ్నించే అంశంగా మారింది.

ఈ ఫైల్స్ మనకు ఒక హెచ్చరిక. న్యాయం ధనికుల ఇంటి ద్వారంలో ఆగిపోకూడదు. బాధితుల కథలు దేశాల సరిహద్దులు దాటినా, మన మనసుల్లో ప్రతిధ్వనించాలి. ప్రపంచం ఈ స్కాండల్‌ను ఒక మలుపుగా తీసుకుంటే, భారత సమాజం మాత్రం దానిని “చూసి కూడా చూడనట్టు” గా మౌనంగా ఉండటం భవిష్యత్తుకు మంచిది కాదు. ప్రజాస్వామ్యంలో విజ్ఞానం, వివేచన గల మేధావులు సైతం మౌనంగా ఉండటం కూడా ఒక రాజకీయ వైఖరే కావచ్చు.కానీ అది అతిపెద్ద ప్రజాస్వామిక దేశం అయిన భారత్ కు క్షేమకరం కాదు. మన దేశంలో మీడియా అది ఎవరికి అనుకూలంగా పనిచేస్తుందో మనం ఆలోచించాల్సిన సమయం ఇదే.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# రాజకీయ వ్యవస్థలో - మారుతున్న ముఖచిత్రం!

దేశంలో మారుతున్న రాజకీయ పరిణామాలు భారత రాజకీయ వ్యవస్థ స్వభావాన్ని పూర్తిగా మార్చిన అంశంగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన 1947 తర్వాత ఏర్పడిన రాజకీయ వ్యవస్థ ఒక నిర్దిష్ట విలువల ఆధారంగా కొనసాగింది. ప్రజాసేవ, నైతికత, త్యాగబుద్ధి, ప్రజలతో నేరుగా అనుసంధానం వంటి లక్షణాలు రాజకీయ నాయకత్వానికి ప్రధాన గుర్తింపులుగా ఉండేవి. మొదటి తరం రాజకీయ వ్యవస్థగా పేర్కొనదగిన ఈ దశ 1947 నుంచి 1967 వరకూ కొనసాగింది. ఈ కాలంలో రాజకీయాల్లో ప్రవేశించిన వ్యక్తుల్లో 70% వరకు స్వాతంత్ర్య పోరాట అనుభవం కలిగిన వారే ఉండటం విశేషం. రాజకీయాన్ని లాభసాధనంగా కాకుండా ప్రజాసేవ గా భావించిన దృక్పథం అప్పటి రాజకీయ సంస్కృతికి ప్రాణంగా నిలిచింది. మొదటి తరం రాజకీయ వ్యవస్థలో నీతి నిజాయితీ ఒక సామూహిక విలువగా కొనసాగింది. నాయకులు వ్యక్తిగత జీవితంలో సరళతను పాటించే వారు. ఎన్నికల ఖర్చులు చాలా తక్కువగా ఉండేవి. 1952 తొలి సార్వత్రిక ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో సగటు ఖర్చు 25000 రూపాయల లోపే ఉండేది. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉండటం నాయకుల సహజ లక్షణంగా భావించబడింది. రాజకీయ నిర్ణయాల్లో ప్రజాభిప్రాయానికి అధిక ప్రాధాన్యం ఉండేది. పార్టీ వ్యవస్థలు బలంగా ఉన్నా వ్యక్తిగత కీర్తికన్నా సిద్ధాంత ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది.

1967 తర్వాత దేశ రాజకీయాల్లో కీలక మలుపు మొదలైంది. ఇది మధ్యతరం రాజకీయ వ్యవస్థగా గుర్తించవచ్చు. ఈ దశ 1967 నుంచి 1990 వరకూ విస్తరించింది. ఈ కాలంలో ప్రాంతీయ రాజకీయ శక్తులు బలపడటం మొదలైంది. కేంద్ర రాజకీయాల్లో స్థిరత్వం తగ్గడం ప్రారంభమైంది. రాజకీయ వ్యవస్థలో సామాజిక వర్గాల ప్రాతినిధ్యం పెరిగింది. వెనుకబడిన వర్గాల రాజకీయ చైతన్యం పెరగడం ప్రజాస్వామ్యానికి ఒక ముఖ్యమైన దశగా నిలిచింది. ఇదే సమయంలో రాజకీయాల్లో అధికార కేంద్రిత ఆలోచనలు బలపడటం మొదలైంది.

మధ్యతరం రాజకీయ వ్యవస్థలో నీతి నిజాయితీ స్థాయి కొంత తగ్గినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రజాసేవ భావన స్థానంలో అధికార సాధన లక్ష్యం ప్రధానంగా మారింది. రాజకీయాల్లో కుటుంబ ఆధిపత్యం ప్రారంభమైంది. 1980 నాటికి దేశవ్యాప్తంగా శాసనసభల్లో సుమారు 20% వరకు రాజకీయ వారసత్వంతో వచ్చినవారే ఉన్నారు. ఇది రాజకీయ వ్యవస్థ స్వభావంలో మార్పును సూచిస్తుంది.

1990 తర్వాత ఆధునిక రాజకీయ వ్యవస్థ ప్రారంభమైంది. ఇది ఇప్పటికీ కొనసాగుతున్న దశ. ఈ కాలంలో ప్రపంచీకరణ ప్రభావం రాజకీయ వ్యవస్థ పై తీవ్రంగా పడింది. సమాచార విప్లవం ప్రజల రాజకీయ అవగాహనను పెంచింది. ఒకవైపు ప్రజలు ప్రశ్నించే స్థాయికి చేరితే మరోవైపు రాజకీయాలు మార్కెట్ ప్రభావానికి లోనయ్యాయి. రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమం కంటే ఎన్నికల విజయంపై అధిక దృష్టి పెట్టడం మొదలుపెట్టాయి. 2000 తర్వాత రాజకీయ ప్రచార ఖర్చులు అసాధారణంగా పెరిగాయి. 2019 ఎన్నికల నాటికి కొన్ని నియోజకవర్గాల్లో ఖర్చు 50000000 రూపాయలకు మించిందని అంచనాలు సూచిస్తున్నాయి.

రాజకీయాలు ప్రజాసేవ నుంచి వ్యాపార దృక్పథానికి మారుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మీడియా ప్రభావం రాజకీయ నిర్ణయాలపై అధికంగా కనిపిస్తోంది. ప్రజాబి ,ప్రాయం సృష్టించడంలో భావోద్వేగ అంశాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మొదటి తరం రాజకీయ వ్యవస్థతో పోలిస్తే ఆధునిక రాజకీయ వ్యవస్థలో నాయకత్వం ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని కొంత కోల్పోయింది. అప్పట్లో నాయకుడు గ్రామం నుంచి పార్లమెంట్ వరకూ నడుచుకుంటూ చేరే స్థాయి ఉండేది. ప్రస్తుతం నాయకత్వం భద్రతా వలయాల్లో పరిమితమవుతోంది. అప్పటి నాయకుల ఆస్తులు పదవిలోకి వెళ్లినప్పుడు స్వల్పంగా ఉండేవి. ప్రస్తుతం పదవిలోకి వెళ్లిన తర్వాత ఆస్తులు అనేక రెట్లు పెరుగుతున్న ఉదాహరణలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. మొత్తంగా చూస్తే దేశ రాజకీయ పరిణామాలు ఒక పరిణామక్రమంగా మారుతున్నాయి. మొదటి తరం రాజకీయ వ్యవస్థ విలువాధారితంగా సాగితే మధ్యతరం రాజకీయ వ్యవస్థ అధికార సమీకరణలపై ఆధారపడింది. ఆధునిక రాజకీయ వ్యవస్థ సాంకేతికత ధనబలం సమాచార ప్రభావంతో నడుస్తోంది. నీతి నిజాయితీ పరంగా చూస్తే గతంతో పోలిస్తే ప్రస్తుతం తీవ్రమైన సవాళ్లు ఎదురవుతున్నా యి.

ప్రజాస్వామ్య బలాన్ని నిలబెట్టాలంటే రాజకీయ వ్యవస్థలో విలువల పునరుద్ధరణ అత్యవసరం. ప్రజల చైతన్యం పెరిగిన ఈ కాలంలో రాజకీయ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజాసేవ మళ్లీ రాజకీయ కేంద్రంగా మారినప్పుడే దేశ రాజకీయ వ్యవస్థ ఆరోగ్యకర దిశలో సాగగలదని ఈ విశ్లేషణ స్పష్టంగా సూచిస్తోంది.

.మొత్తంగా పరిశీలిస్తే భారత దేశ రాజకీయ వ్యవస్థ ఒక నిరంతర మార్పు ప్రక్రియలో ఉన్న నిర్మాణంగా స్పష్టంగా అవగతమవుతుంది. 1947లో ప్రారంభమైన ప్రజాస్వామ్య ప్రయాణం కేవలం పాలన మార్పుకే పరిమితం కాకుండా సామాజిక దృక్పథం, ప్రజల ఆశలు, నాయకత్వ లక్షణాలు, రాజకీయ విలువలు అన్నింటినీ ప్రభావితం చేసింది. మొదటి తరం రాజకీయ వ్యవస్థ ప్రజాసేవను కేంద్రంగా తీసుకుని సాగితే, ప్రస్తుతం కొనసాగుతున్న ఆధునిక రాజకీయ వ్యవస్థ శక్తి సమీకరణాల ఆధారంగా ముందుకు సాగుతోంది. ఈ మార్పు సహజ పరిణామమే అయినా దాని ప్రభావాలు లోతైన విశ్లేషణకు అవసరం ఏర్పరిచాయి.

1950 నుంచి 1967 వరకూ ప్రజలు రాజకీయ నాయకుడిని నైతిక ప్రతీకగా భావించారు. ఓటు వేయడం ఒక బాధ్యతగా మాత్రమే కాదు ఒక ధర్మంగా కూడా పరిగణించబడింది. అప్పట్లో ఓటింగ్ శాతం సగటున 60కి పైగా ఉండేది. రాజకీయ నాయకులపై నమ్మకం అధికంగా ఉండేది. పాలకుల నిర్ణయాలు ప్రజల సంక్షేమంతో నేరుగా ముడిపడి ఉన్నాయనే విశ్వాసం విస్తృతంగా కనిపించేది. ఈ దశలో రాజకీయ వ్యవస్థకు ప్రజల మద్దతు ఒక శక్తివంతమైన బలంగా నిలిచింది. 1970 తర్వాత రాజకీయ వ్యవస్థలో మెల్లగా మార్పులు చోటు చేసుకున్నాయి. సామాజిక వర్గాల రాజకీయ చైతన్యం పెరిగింది. ఇది ప్రజాస్వామ్యానికి ఒక విస్తరణ దశగా పరిగణించవచ్చు. అయితే ఈ విస్తరణతో పాటు రాజకీయ పోటీ తీవ్రత కూడా పెరిగింది. అధికార సాధన ఒక ప్రధాన లక్ష్యంగా మారింది. 1977 తర్వాత ఏర్పడిన రాజకీయ కూటములు స్థిరత్వాన్ని తగ్గించాయి. ప్రభుత్వాల ఆయుష్షు తగ్గింది. ప్రజల్లో రాజకీయ వ్యవస్థపై సందేహ భావన మొదలైంది. ఓటింగ్ శాతం కొన్ని ప్రాంతాల్లో 55 కంటే తక్కువకు పడిపోయింది.

ఆధునిక రాజకీయ వ్యవస్థలో ప్రజల పాత్ర కూడా మారింది. ప్రజలు కేవలం ఓటర్లు మాత్రమే కాకుండా అభిప్రాయ నిర్మాణకర్తలుగా మారారు. అయితే ఈ అభిప్రాయాలు చాలాసార్లు భావోద్వేగాల ఆధారంగా ప్రభావితమవుతున్నాయి. అభివృద్ధి, భద్రత, గుర్తింపు రాజకీయాలు ప్రధాన అంశాలుగా మారాయి. ఈ మార్పు ప్రజాస్వామ్యానికి ఒకవైపు చైతన్యం తీసుకువస్తే మరోవైపు విభజన భావనలకు దారి తీస్తోంది. 2000 తర్వాత ఎన్నికల ప్రచారాల్లో భావోద్వేగ అంశాల వినియోగం సుమారు 40% పెరిగినట్లు రాజకీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి.

నీతి నిజాయితీ అంశం ఆధునిక రాజకీయ వ్యవస్థలో అత్యంత సవాలుగా మారింది. 1950లో ప్రజాప్రతినిధులపై నేర ఆరోపణలు అరుదుగా కనిపించేవి. 1980 నాటికి ఈ సంఖ్య స్వల్పంగా పెరిగింది. 2004 నాటికి క్రిమినల్ కేసులు ఉన్న ప్రజాప్రతినిధుల శాతం 24గా నమోదైంది. 2019 నాటికి ఇది 43కు చేరింది. ఈ పెరుగుదల రాజకీయ వ్యవస్థలో నైతిక ప్రమాణాలు బలహీనపడుతున్నాయనే అభిప్రాయానికి బలం చేకూరుస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే నాయకత్వంలో నైతికత కీలకమనే అంశం మళ్లీ కేంద్రంగా రావాల్సిన అవసరం ఉంది.

ముగింపుగా చెప్పాలంటే భారత రాజకీయ వ్యవస్థ ఒక సజీవ వ్యవస్థ. ఇది ప్రజల ఆలోచనలతో రూపాంతరం చెందుతుంది. మొదటి తరం రాజకీయ వ్యవస్థ చూపిన విలువలు నేటి రాజకీయాలకు మార్గదర్శకంగా నిలవగలవు. ఆధునిక రాజకీయ వ్యవస్థ సాంకేతికతను ఉపయోగించుకుంటూనే నైతిక పునాదులను బలపరిచినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం సార్థకంగా నిలుస్తుంది. ప్రజలు ప్రశ్నించే స్థాయికి చేరిన ఈ కాలంలో రాజకీయ వ్యవస్థ ప్రజల నమ్మకాన్ని తిరిగి సంపాదించుకోవాల్సిన అవసరం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. అదే దేశ రాజకీయ భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



### మతం మాయ!

ప్రపంచమంతా
ఏదో మాయ!
మాంత్రికుల
అట్టహాసాలు!
వ్యూహకర్తలు
ప్రపంచ నాయకులు!
అధ్యక్షస్థానంలో
ట్రంపా? మోడీయా?
భూతమాంత్రికుడు
కొరడా చేతబట్టి
వికటాట్టహాసాలు!
భయంతోప్రపంచం!
గాలినిండా
గుసగుసలు!
టారిఫ్ ల
మాయాజాలం!
కష్టజీవులకష్టం
అవిరైపోయి
భూతప్రేతాల
గుప్పెటిలోకి!
తెల్లారిలేస్తే జనం
ఆకలిపోరాటం!
భూతప్రేతాల
లాభల ఆరాటం!
ప్రపంచమార్కెట్
లాభలే లక్ష్యం!
నీతి నిజాయితీ
ఎలా సాధ్యం!
లాభాలకోసం
దెయ్యాలురెచ్చిపోతే
ప్రజలకుమతాలు
ధర్మాలుబోధిస్తాయి!
మతాల ముసుగులో
లాభలవేట!
దెయ్యాలు ఆడే
రాజకీయం ఆట!
మతం ఇప్పుడు
ప్రజలకోదార్పుకాదు!
నిరంతర దోపిడీకి
అనుకూల కూర్పు!
మతంమాయలోజనం
భజనలు ఆలాపనలు!
దేవుడే దిగివచ్చి
తమను రక్షిస్తాడని!
దేవుడికి ప్రజలు
దాసోహం!
మాంత్రికులు మాత్రం
అట్టహాసం!

-తమ్మినేని
అక్కిరాజు
హైదరాబాద్

## అనంత పార్శ్వాల ముదిర మధుర కావ్యం

జీవితం ఒక గొప్ప కావ్యం. అది ముదిరిన మధుర రసంతో నిండి ఉంటుంది. అనంతమైన పార్శ్వాలు - సంతోషం, దుఃఖం, ప్రేమ, విరహం, విజయం, ఓటమి - అన్నీ కలిసి ఒక అద్భుతమైన కథను నేస్తాయి. చిన్నప్పటి నిర్మలమైన నవ్వు నుంచి వృద్ధాప్యంలో ముదిరిన జ్ఞానం వరకు, ప్రతి దశలో జీవితం కొత్త రుచిని చూపిస్తుంది. ఈ మధురత్వం ఎక్కడ నుంచి వస్తుంది? అనుభవాల నుంచి, సంబంధాల నుంచి, సవాళ్ల నుంచి. మనం ఎంత ఎదిగామో, ఎంత ముదిరామో అంతగా జీవితం మధురమవుతుంది. పసితనం ఒక తియ్యని పండు లాంటిది. ఆహ్లాదం, ఆటపాటలు, నిర్మలమైన ఆనందం. యవ్వనం అగ్ని లాంటిది - ఉద్వేగాలు, కలలు, పోరాటాలు. మధ్యవయసు సమతూకం - బాధ్యతలు, సంబంధాలు, సాధనలు. వృద్ధాప్యం ముదిరిన మధురం - జ్ఞానం, శాంతి, స్మృతులు. ప్రతి దశలోనూ జీవితం కొత్త పార్శ్వాన్ని చూపిస్తుంది. చిన్నప్పుడు ఒక చాక్లెట్ సంతోషం ఇస్తే, పెద్దయ్యాక ఒక మంచి సంబంధం మధురానుభూతిని ఇస్తుంది. ముదిరిన వయసులో స్మృతులు మాత్రమే మిగిలినా, అవి అమూల్యమైన మధుర రసం లాంటివి. ఈ మార్పు సహజం. కాలం మనల్ని మలచి, మధురంగా మారుస్తుంది.

# ఆందోళన కలిగిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ



కేంద్ర ఎన్నికల కమీషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) వివాదాస్పదంగా మారింది. దేశంలో 12 రాష్ట్రాల్లో రెండు దశల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ..అనేక వివాదాలకు తెర లేపింది. తాజాగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జి ఏకంగా సుప్రిం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి ఎదుట స్వయంగా వాదించడం సర్వత్రా చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. బెంగాల్‌లో సుమారు 50 లక్షలకు పైగా ఓట్ల తొలగింపు, మరో కోటి మంది వరకు నోటీసులు జారీ చేయడాన్ని ఆమె తీవ్రంగా పరిగణించారు. త్రి సభ్య న్యాయమూర్తుల ఎదుట క్షేత్ర స్థాయిలో జరిగిన పరిణామాలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు కూడ. గతంలో బీహార్‌లో ఓట్ చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపనలు తెలిసినవే. తమిళనాడు లోనూ దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇక్కడ 15.2 శాతం ఓట్లను తొలగించారు అధికారులు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని, విపక్ష పార్టీలకు అనుకూలంగా ఉన్న ఓటర్లను ఎసఐఆర్ నెపంతో అకారణంగా తొలగిస్తూ..ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుట్ర చేస్తుందని ఆయా పార్టీలు ఆరోపిస్తున్నాయి.

త్వరలో తెలంగాణలోనూ ఎస్ఐఆర్ షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మార్చి-ఏప్రిల్‌లో ఇక్కడ ఓటర్ల జాబిత ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులకు ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలోని 33 జిల్లాల్లోని 76 రెవెన్యూ డివిజన్లు, 620 మండలాలు, 13 మున్సిపల్ కార్పోరేషన్లు, 129 మున్సిపాలిటీలు, 12, 769 పంచాయతీల్లో ప్రస్తుతం 3, 38, 76, 836 ఓటర్లున్నట్లు ఎన్నికల కమీషన్ లెక్కలు చెబుతున్నాయి. ఇందుకు ఇప్పటికే 35, 985 మంది బీఎల్‌వోలు, 3, 596 మంది పర్యవేక్షకులు పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఎసఐఆర్ ప్రక్రియ చేపడితే..గుర్తింపు పొందిన పార్టీలు బూత్ లేవల్‌లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలంగాణ ఎన్నికల సంఘం సూచించింది. బూత్ లేవల్‌లో ఆయా పార్టీల ఏజెంట్లకు ఎసఐఆర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంది.

గత ఉమ్మడి ఏపీలో 2002లో ఎసఐఆర్ చేపట్టగా, ఆ మ్యాప్ ఆధారంగా తాజాగా ఇంటింటి సర్వే చేపట్టనున్నారు అధికారులు. బిఎలఓలు ప్రతి పోలింగ్ ప్రాంతానికి మూడు నుంచి నాలుగుసార్లు సందర్శించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మొదటి సందర్శనలో లెక్కింపు ఫారాలు పంపిణీ చేసి, ఆ తరువాత ఎవరైనా ఓటర్లు మ్యాపింగ్‌లో మిగిలిపోతే వారు తమ వివరాలను నమోదు చేసుకునే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నా..క్షేత్ర స్థాలో ఏ మేరకు ఆ పరిస్థితులు ఉంటాయనేది అనుమానమే. బీఎల్‌వోలు ఓటర్ల వద్దకు వచ్చినప్పుడు 11 రకాల్లో ఏదో ధృవ పత్రాన్ని వారికి ఇవ్వ వలసి ఉంటుంది. పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్ తదితర పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలి. ఓటర్ల జాబితోఉండి మృతి చెందిన వారు, నివాసం మారిన వారు, ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు కలిగి ఉంటే..జాబితా లోనుండి తొలగిస్తారు. జూలై 1, 1987 కి ముందు పుట్టిన వారు సర్వే కొసం వచ్చిన వారికి నిర్ధారించే సర్టిఫికెట్ ఇవ్వాలి. డిసెంబర్ 2, 2004న, అంతకు ముందు జన్మించిన వారు తమ తల్లిదండ్రులను గుర్తించేలా సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన ఎసఐఆర్‌లో ఉంది. అయితే..ఎక్కువగా నిరక్ష రాస్యులు, అవగాహన లేని ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశాలున్నట్లు పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. వివిధ కారణాలతో తొలగించిన ఓటర్లను జాబితాల్లో చేర్పించే అంశంపై స్పష్టత లేదు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఈ ఆనుమానాన్ని రేకెత్తోంది.


ఎసఐఆర్ ప్రక్రియ కోసం వియోగిస్తున్న బీఎల్‌వోలు ఇతర ఉద్యోగాలు చేస్తూ ఉంటారు. వారికి ఈ ప్రక్రియ అదనపు భారంగా మారనుంది. మన దేశంలో ఆయా రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఎసఐఆర్ ప్రక్రియలో సందేహాలు, విమర్శలను నివృత్తి చేసి..ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి పలువురు సూచిస్తున్నారు.



చిలగాని జనార్దన్,
సీనియర్ జర్నలిస్టు, 8121938106

# అంతరాత్మ స్వరం

## బయటి శబ్దాల గందరగోళంలో లోపలి నిశ్శబ్దం



మానవ జీవితం ఎప్పుడూ రెండు ధ్వనుల మధ్య సాగుతుంది. ఒకటి బయటి ప్రపంచం నుంచి వచ్చే గట్టి, నిరంతరాయమైన శబ్దం - సమాజం చెప్పే మాటలు, బంధువుల అభిప్రాయాలు, స్నేహితుల సలహాలు, పోలికలు, ఆశయాలు, భయాలు. మరొకటి లోపలి నుంచి వచ్చే సూక్ష్మమైన, నిశ్శబ్ద స్వరం - అంతరాత్మ. చిన్నప్పటి నుంచి పెద్దవాళ్లవరకు మనం ఎక్కువగా వినేది మొదటిదే. “ఇలా చేయాలి”, “అలా ఉండాలి”, “సమాజం మాట్లాడుతుంది”, “ఇలా బ్రతికితేనే గౌరవం వస్తుంది” అనే మాటలు మన మనసులో లోతుగా పాతుకుపోతాయి. కాలం గడిచినా, అనుభవాలు పెరిగినా, చుట్టూ ఉన్న గోడలు మారినా ఆ బయటి శబ్దం మాత్రం మారదు. ఫలితంగా మన జీవిత నిర్ణయాలు, భావోద్వేగాలు, ఆలోచనలు, ఎంపికలు చాలావరకు బయటి ప్రభావాలే అవుతాయి. మనం నిజంగా మనమవుతామా? లేక సమాజం కోరుకున్న రూపంలో మారిపోతామా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికితే, చాలామంది జీవితాలు బయటి శబ్దాల ఆధీనంలోనే సాగుతున్నాయని తెలుస్తుంది.

**సమాజ శబ్దాల ఆధిపత్యం: బాల్యం నుంచి జీవితాంతం**

మనిషి జన్మించిన నాటి నుంచే సమాజ శబ్దాలు మొదలవుతాయి. తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు, స్నేహితులు - అందరూ ఒక్కొక్క మాట చెబుతారు. “మంచి మార్కులు తెచ్చుకో”, “డాక్టర్ లేదా ఇంజనీర్ అవు”, “ఇలా డ్రెస్ వేసుకుంటే సమాజం ఏమనుకుంటుంది?”, “పక్కింటి అబ్బాయి ఇలా చేశాడు, నువ్వు ఎందుకు చేయవు?” అనే పోలికలు, ఒత్తిడులు, భయాలు మనల్ని చుట్టుముట్టాయి. ఈ శబ్దాలు గట్టిగా వినిపిస్తాయి ఎందుకంటే అవి బయటి నుంచి వస్తాయి - ఒత్తిడిగా, ఆదేశంగా, ఆకాంక్షగా, కొన్నిసార్లు శిక్షగా కూడా. పిల్లవాడు ఆడుకోవాలనుకుంటే “చదువు” అంటారు. యువకుడు తన ఇష్టమైన రంగంలోకి వెళ్లాలనుకుంటే “సేఫ్ జాబ్” అంటారు. వివాహ వయసులో “మంచి ఇల్లు చూడు” అంటారు. ఈ మాటలు మనల్ని నడిపిస్తాయి. మన వ్యక్తిత్వం, ఆలోచనలు, నిర్ణయాలు సమాజం నిర్దేశించిన మార్గంలోనే సాగిపోతాయి.

ఆధునిక కాలంలో ఈ శబ్దాలు మరింత బలపడ్డాయి. సోషల్ మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్, ట్రెండ్స్ - అన్నీ కలిసి ఒక భారీ శబ్ద తరంగాన్ని సృష్టిస్తాయి. “ఇలా ఉంటేనే కూల్”, “ఇలా కొనుగోలు చేస్తేనే సక్సెస్‌ఫుల్” అనే సందేశాలు నిరంతరం మన మెదడులోకి చొచ్చుకుపోతాయి. ఫలితం? మనం మన ఇష్టాల్ని కాదు, సమాజం ఆమోదించే వాటినే ఎంచుకుంటాం. మన జీవితం మనది కాకుండా, వేరొకరి అభిరుచులు, నియమాలు, ప్రమాణా ల చేతుల్లో పడిపోతుంది. ఈ ఆధిపత్యం అంత సులభంగా తొలగిపోదు, ఎందుకంటే అది భయం, ఆమోదం, భద్రత అనే ఆకర్షణలతో మమ్మల్ని బంధిస్తుంది.

**అంతరాత్మ: నిశ్శబ్దంలో దాగిన జ్ఞానం**

అంతరాత్మ స్వరం మాత్రం పూర్తిగా భిన్నం. అది ఎప్పుడూ గట్టిగా అరవదు. ఒత్తిడి చేయదు. భయపెట్టదు. కోపపడదు. శిక్షించదు. అది కేవలం ఒకే సందేశం ఇస్తుంది: “నువ్వు ఎవరో మరచిపోకు.” ఈ స్వరం లోపల నుంచి వస్తుంది - శాంతిగా, సున్నితంగా, స్పష్టంగా. అది మనకు నిజంగా కావాల్సింది ఏమిటో చెబుతుంది. ఏ మార్గం మన స్వభావానికి సరిపడుతుందో సూచిస్తుంది. భయం లేకుండా జీవించడం నేర్పిస్తుంది. కానీ దాన్ని వినాలంటే మనం ఒక్క క్షణం ఆగాలి. ఆ ఆగడం చాలామందికి కష్టం. ఎందుకంటే ఆగితే లోపలి నిజాలు బయటపడతాయి. మనం దాచుకున్న అబద్ధాలు, సందిగ్ధాలు, భయాలు, పశ్చాత్తాపాలు కనిపిస్తాయి. ఆ నిజాన్ని ఎదుర్కోవడానికి ధైర్యం కావాలి. ఉపనిషత్తులు “ఆత్మానం విద్ధి” అంటాయి - తనను తాను తెలుసుకో. భగవద్గీతలో కృష్ణుడు అర్జునునికి స్వధర్మాన్ని గుర్తు చేస్తాడు. అదే అంతరాత్మ స్వరం. కానీ ఆధునిక మనిషి జీవితం అంత శబ్దమయం, అంత వేగవంతం - ఆగడానికి సమయం లేదు, ధైర్యం లేదు. ఫలితంగా అంతరాత్మ నిశ్శబ్దంగా మిగిలిపోతుంది. అది ఎప్పుడూ మనతోనే ఉంటుంది, కానీ మనం దాన్ని వినడానికి సిద్ధంగా లేము.

**నిర్ణయాల్లో బాహ్య ప్రభావం: మనమా, సమాజమా?**

మన జీవితంలోని నిర్ణయాలు ఎంతవరకు మనవి? ఈ ప్రశ్నకు లోతుగా ఆలోచిస్తే సమాధానం భయపెడుతుంది. చదువు ఏ కోర్సు? ఉద్యోగం ఏ రంగం? వివాహం ఎవరితో? జీవనశైలి ఎలా? - దాదాపు అన్నీ సమాజం చెప్పిన మార్గాల్లోనే సాగిపోతాయి. మనం మంచి అనుకున్నది సమాజం మంచి అన్నదే అవుతుంది. తప్పు అనుకున్నది సమాజం తప్పు అన్నదే. ఒక ఉదాహరణ చూడండి: చాలామంది యువకులు తమ ఇష్టమైన కళలు, సంగీతం, రచన వైపు వెళ్లకుండా “సేఫ్” అనే ఇంజనీరింగ్ లేదా మెడిసిన్ ఎంచుకుంటారు. కారణం? సమాజం “స్టేబుల్ జాబ్” అంటుంది కాబట్టి. మరో ఉదాహరణ: అమ్మాయిలు కెరీర్‌ను వదులుకుని కుటుంబాన్ని ఎంచుకుంటారు - కొందరు స్వచ్ఛందంగా, కానీ చాలామంది సమాజం “మంచి భార్య, తల్లి” అనే పాత్రను ఒత్తిడి చేస్తుంది కాబట్టి.

ఈ బాహ్య ప్రభావం వల్ల మన బ్రతుకు మనది కాకుండా పోతుంది. మనం జీవిస్తున్నాం కానీ ఆ జీవితం మన స్వప్నాలది కాదు. అంతరాత్మ మాత్రం వేరే దారి చూపిస్తుంది. అది భయం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం నేర్పిస్తుంది. దాన్ని విన్నవాడికి మనసుకు నిజమైన శాంతి లభిస్తుంది. స్పష్టత వస్తుంది. జీవితం అర్థవంతమవుతుంది. మహాత్మా గాంధీ, స్వామి వివేకానందులు ఇలాంటి అంతరాత్మ స్వరాన్నే విని సమాజానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. వాళ్లు ఒంటరిగా నడిచారు కానీ భయపడలేదు. ఎందుకంటే వాళ్లకు దిశ చూపింది బయటి గుంపు కాదు, లోపలి జ్ఞానం.

**ఆగి వినడం: జీవితాన్ని కొత్తగా మొదలుపెట్టే మార్గం**

అంతరాత్మను వినడం మొదలుపెట్టిన నాటి నుంచి జీవితం మారిపోతుంది. ఏం చేయాలి, ఏం చేయకూడదు అనేది స్పష్టంగా అర్థమవుతుంది. నిర్ణయాలు మనవి అవుతాయి. బ్రతుకు నిజంగా మనదవుతుంది. అలాంటి మనిషి ఒంటరిగా ఉన్నా భయపడడు. అతనికి ప్రశంసలు, గుంపు, ఆమోదం అవసరం లేదు. ఎందుకంటే అతని దిశానిర్దేశకం లోపలి జ్ఞానం. ధ్యానం, ఏకాంతం, స్వీయపరిశీలన - ఇవన్నీ అంతరాత్మ స్వరాన్ని వినిపించే మార్గాలు. రోజూ కొద్దిసేపు ఆగి, మనల్ని మనం ప్రశ్నించుకుంటే చాలు. “ఇది నాకు నిజంగా కావాలా?” “ఈ నిర్ణయం నా స్వభావానికి సరిపడుతుందా?” అని అడిగితే సమాధానాలు లోపలి నుంచే వస్తాయి.

మనలోని అంతరాత్మను మేల్కొల్పితే మనం మారిపోగలం. నిర్ణయాలు మార్చుకోగలం. గమ్యం మార్చుకోగలం. మానవ జీవితంలో గొప్ప యుద్ధం బయటి ప్రపంచంతో కాదు - తనలోని శబ్దాలతోనే. ఆ శబ్దాలు నిశ్శబ్దమయ్యే రోజు మనం నిజంగా మనమవుతాం. జీవితం చివరికి ఒక సత్యాన్ని నేర్పుతుంది: మనల్ని నడిపేది సమాజం కాదు, స్నేహితులు కాదు, భయం కాదు - లోపల వినిపించే చిన్న స్వరం, అంతరాత్మ. ఆ స్వరాన్ని వినాలంటే మనం ఒక్కసారి ఆగాలి. ఆ ఒక్క ఆగడంతో జీవితం కొత్తగా మొదలవుతుంది. ఆ ధైర్యం మనందరికీ కలగాలి.

(డా॥ సూర్యదేవర రామకృష్ణ)

# మున్సిపాలిటీల అభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యం

**• రాష్ట్ర ఐటీ శాఖ, జిల్లా ఇన్చార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**చేవెళ్ల, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీల అభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ, జిల్లా ఇన్చార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మున్సిపాలిటీల అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా 50 నుంచి 100 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పరంగా పెద్దపీటవేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీల అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా 50 నుంచి 100 కోట్లు నిధులు మంజూరు చేశారని అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఆరు మున్సిపాలిటిల్లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని చెప్పారు. మున్సిపాలిటీల అభివృద్దే లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రెండు సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని 70 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల్లో అభవృద్ధి పరంగా మార్పుకు శ్రీకారం చుట్టామన్నారు. భ్యవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రంగా రెడ్డి జిల్లా ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. మన్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకరికి ఒకరు రహస్య ఓటింగ్ పన్నాగం పన్నుతుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కులేదన్నారు. సంక్షేమపథకాలతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను లబ్ధిపొందిన అన్నివర్గాల ప్రజలు, మహిళలు, రైతులు, యువకులు, ఉద్యోగులు ఆలోంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత భిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల మూలంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 6వేలకు పైగా వడ్డీలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను విడతల వారీగా అమలు చేస్తూ పేద ప్రజల్లో అభివృద్ధి పరంగా మార్పుకు శ్రీకారం చుట్టామన్నారు. భ్యవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో చేవెళ్ల నియోజక ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కులేదన్నారు. సంక్షేమపథకాలతోపాటు ఇతర ప్రభుత్వ పథకాలను లబ్ధిపొందిన అన్నివర్గాల ప్రజలు, మహిళలు, రైతులు, యువకులు, ఉద్యోగులు ఆలోంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత భిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల మూలంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 6వేలకు పైగా వడ్డీలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థను గడిలో పెడుతునే ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ ఇన్చార్జీ బొంతు రాంమ్మోహన్, డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, గ్రంధాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ.రంజిత్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ తీగల అనితా రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జీ పామెన భీంభరత్, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి అగిరెడ్డి, మాజీ ఎంపీపీ బాల్ రాజ్, చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మంగలి యాదగిరి, టేకులపల్లి శ్రీనివాస్, మున్సిపల్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో మల్టీ డిసిప్లినరీ కేర్ సెంటర్ ప్రారంభం



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలుమరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. ఈ మేరకు గాంధీ ఆసుపత్రిలో మల్టీ డిసిప్లినరీ కేర్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్బంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ కొంత మంది స్త్రీలలో గర్భధారణ సమయంలో సాధారణంగా ప్రీఎక్లాంప్సియా అనే వ్యాధి వస్తుందన్నారు. అయితే ప్రీ-ఎక్లాంప్సియా అనేది గర్భధా రణ సమయంలో వచ్చే తాత్కాలిక సమస్య మాత్రమే కాదు. ఇది తల్లుల్లో భవిష్య త్తులో హృదయ సంబంధిత వ్యాధులు ,మూత్రపిండ వ్యాధులు వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుందని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని,ప్రీ--ఎక్లాంప్సియా వచ్చిన తల్లు లకు తక్షణం నుంచే దీర్ఘకాలం వరకు సమగ్ర సంరక్షణ అందించాలనే లక్ష్యంతో, ప్రసూతి, హృదయ, మూత్ర పిం డ,మెడిసిన్ విభాగాలబ మన్వయంతో ఒక మల్టీ డిసిప్లినరీ కేర్ కార్య క్రమాన్ని ప్రభుత్వ రంగ ఆసుపత్రిలో ప్రారం భించబడిందన్నారు. ప్రభుత్వ ఆసు పత్రిలో ఈ విధమైన సమన్వయ వైద్య సేవలు ప్రారంభించడం దేశం లోనే మొట్ట మొదటిసారి కావడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా మాతృ మరణాలు తగ్గడమే కాకుండా,భవి ష్యత్తులో వచ్చే తీవ్రమైన హృదయ, కిడ్నీ వ్యాధులను ముందుగానే గుర్తించినివారించే అవకాశం ఏర్పడు తుందన్నారు. ఇది మాతృ ఆరోగ్యాన్ని దీర్ఘ కాలం కాపాడే ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆమె పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**• ఎమ్మెల్యే శ్రీగణేష్**



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ మండల పరిధిలోని కంటోన్మెంట్ ప్రాంత 19 మంది లబ్ధిదారుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 1,00,116/- రూపాయల చొప్పున ప్రభుత్వం నుంచి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరు అయ్యాయి. శుక్రవారం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. పేదింటి ఆడబిడ్డల వివాహ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం సహాయం చేస్తుందని, వివాహం చేసి ఆడపిల్లల తల్లిదండ్రులు అప్పులు పాలు కావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చెక్కులను విడుదల చేసి పేదల పక్షపాతిగా నిలుస్తుందని అన్నారు. ఈ చెక్కులు సకాలంలో రాని వారు తనను సంప్రదిస్తే అధికారులతో మాట్లాడి త్వరితగతిన చెక్కులు మంజూరు అయ్యేలా చూస్తానని చెప్పారు.

# పావలా వడ్డీ ఇవ్వనోళ్లకు ఓటు అడిగే హక్కు లేదు

**• బిఆర్ఎస్, బిజెపిలు చీకటి ఒప్పందం**
**• అనంతగిరిని టూరిజం హబ్ గా అభివృద్ధి**
**• రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**




**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** మహిళ సాధికారత సాధిస్తామని మహిళ స్వయం సహకార సంఘాలకు పావలా వడ్డీ ఇవ్వలేని టిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ముందుగా ఆ పార్టీ నాయకులు మహిళలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేశామని అన్నారు. ఫలితంగా వారి ఆర్థిక అభివృద్ధి కొంత మేరకు మెరుగుపడిందని అన్నారు. మహిళ సాధికారత సాధించడానికి వారికి వడ్డీ లేని రుణాల కింద 27 వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలియజేశారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం అవసర వేగంగా జరుగుతుందని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హాయంలో పేదలకు పేదలకు ఇండ్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ , బిజెపి పార్టీలు లోపాయకారి ఒప్పందంతో నడుస్తున్నాయని వారిద్దరూ సీక్రెట్ దోస్తులు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. వికారాబాద్ పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయ, అభివృద్ధి సంక్షేమ అంశాలపై కీలక ప్రకటనలు చేశారు. వికారాబాద్ ప్రాంతానికి ఉన్న భౌగోళిక ప్రాధాన్యతను గుర్తించి, దీనిని రాష్ట్రంలోనే ప్రముఖ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకోసం వందల కోట్ల నిధులు వెచ్చించి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని, పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు యువతను విస్మరించిందని గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించకుండా కాలయాపన చేసిన కారణంగా యువత వయోపరిమితి పెరిగిపోయిన కారణంగా వారికి ఉద్యోగాలు రాక సర్వీస్ తగ్గిపోతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించి యువతకు ఎన్నో ఉద్యోగాలు కల్పించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మెజారిటీ మున్సిపల్ చైర్మన్ పదవులను కైవాసం చేసుకొని, పట్టణ ప్రాంతాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలే పార్టీకి శ్రీరామరక్ష అని శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూనే, ఆర్థిక ప్రణాళికలు అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ .భాస్కర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధారాసింగ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి అనన్య తో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీ ఫెడరేషన్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** బిసి ఫెడరేషన్‌లకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని పలువురు బిసి సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తెలంగాణ జనసమితి కార్యాలయంలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. గడిచిన 12 సంవత్సరాల నుండి ఫెడరేషన్లకు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వాలు నిర్లక్ష్యానికి గురిచేశాయని అయన దృష్టికి తెచ్చారు. జరిగిన అన్యాయాన్ని వినతిలో వివరించారు. రాబోయే బడ్జెట్లో 11 కులాల బిసి ఫెడరేషన్ లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే విధంగా పాలకమండళ్ళు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ ను వారు కోరారు. సంబంధిత బీసీ మంత్రివర్యుల,అధికారుల దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా రాబోయే అసెంబ్లీ బడ్జెట్లో నిధులు సమకూర్చే విధంగా పాలకమండళ్ళకు చైర్మన్, డైరెక్టర్ లను ఏర్పాటు చేసే విధంగా తన వంతు కృషి చేస్తానని అయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కులాల అధ్యక్షులు దుర్గారావు,కార్యదర్శి కీర్తి యుగంధర్,మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు తో పాటు మహిళా నాయకురాళ్లు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## పోరాటాల పురిటి గడ్డ చైతన్యానికి ప్రతీక చేర్యాల



**చేర్యాల, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** పోరాటాలకు పురిటి గడ్డ, చైతన్యానికి ప్రతీక చేర్యాల గడ్డ అని తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దినసరి అనసూయ అలియాస్ సీతక్క అన్నారు. శుక్రవారం జనగామ నియోజకవర్గ పరిధిలోని చేర్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేర్యాల ప్రాంతం చైతన్యానికి అడ్డగా, పోరాటాలకు పురిటి గడ్డగా చరిత్రలో నిలిచిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పావలా వడ్డీ పేరుతో మహిళల నుంచి రూ.3 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలోనే చేర్యాల అభివృద్ధికి రూ.36 కోట్ల నిధులు కేటాయించామని స్పష్టం చేశారు. మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని మంత్రి సూచించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు. మహిళా సంఘాల అభయహస్తం రుణాల పేరుతో రూ.200 కోట్లను కాజేసిన ఘనత కేసీఆర్కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. చేర్యాల పట్టణం అభివృద్ధి చెందాలంటే పన్నెండు మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చావుల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి, నియోజకవర్గ మండల నాయకులు, ప్రజాప్రతినిలు,అభ్యర్థులు, పట్టణ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**హయత్‌నగర్, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** హయత్ నగర్ కుంట్లూర్ రోడ్డులోని ఆటో యూనియన్ కార్మికులతో, ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు కీసర నర్సిరెడ్డి, ఏ బూసి నరసింహ, ట్రాన్స్ పోర్ట్ జిల్లా అధ్యక్షులు ముషం నరహరి, గౌరవ అధ్యక్షులు కడారి రాములు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హయత్ నగర్ నుండి ఎల్బీనగర్ వరకు సర్వీస్ రోడ్లు పూర్తి చేయకుండా, ఎదురు వస్తున్నారనే పేరుతో ఆటో కార్మికులపై, మోటార్ వాహనాలపై విచక్షణారహితంగా చాలాన్లు వేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. తక్షణమే సర్వీస్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి, చాలాన్లు వేస్తే అర్థం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పిఎఫ్ చట్టాన్ని సవరించి ఆటో కార్మికులకు పిఎఫ్ వర్తించే విధంగా చట్టాన్ని సవరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టోల్, పెట్రోల్, డీజిల్ చార్జీలను తగ్గించి ట్రాన్స్ పోర్ట్ కార్మికులను రక్షించాలని, ఫైవేటు ఫైనాన్స్ వేధింపుల నుండి రక్షించాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందుకు ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా మహాలక్ష్మి స్కీం ద్వారా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు 4,500 ఇవ్వాలని, 50 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్ కు పెన్షన్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు, కర్షకులు, మేధావులు, విద్యావంతులు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకుడు నక్క అశోక్ గౌడ్, యాదయ్య, గడ్డం కుమార్, వీరయ్య, కిన్నెర కుమార్ జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మరోసారి మోసపోవద్దు

**• మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి**



**తాండూరు, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి మరోసారి మోస పోవద్దని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రార్థనల సందర్భంగా తాండూరు మున్సిపల్ 7వ పరిధిలోని దర్గా మజీద్ మరియు నూర్ ఉలూమ్ మదర్సా మజీద్‌లలో ప్రార్థనల అనంతరం, పైలెట్ రోహిత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింలు మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్ తో కలిసి ముస్లిం సోదరులను కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ 7 వ వార్డు అభ్యర్థి ఇర్షాద్‌కు ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరుతూ, కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని అన్నారు. పాత తాండూరులోని మజీద్ వద్ద ముస్లిం సోదరులను బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఉండాలన్నారు . కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ముస్లిం సోదరులను కోరారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను వారికి వివరించారు. పట్లోళ్ల నర్సింలు చైర్మన్ అయితే తాండూరు పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని పేర్కొన్నారు.

# వికారాబాద్ జిల్లాలో నాలుగు చైర్మన్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం ఖాయం

**• ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**తాండూరు, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తాండూర్ మున్సిపల్ పరిధిలోని పాత తాండూర్, గాంధీ చౌక్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ధారసింగ్ నాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి విద్యవంతులకు, యువకులకు, పార్టీ కోసం కష్టపడ్డ వారికీ పార్టీ అభ్యర్థులుగా అవకాశం ఇచ్చారు. సామాజిక న్యాయం పాటిస్తూ బీసిలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో పాత తాండూర్ కొత్త తాండూర్ కాబోతుందన్నారు..రెండేళ్ళ పాలనలో ప్రతి కుటుంబంకు ప్రభుత్వం నుంచి ఏదో ఒక సంక్షేమ పథకం అందించడం జరిగిందని గుర్తు చేశారు..గతంలో కరెంటు చార్జీలు పెరిగితే రోడ్లపై ధర్నాలు చేస్తే మన ప్రభుత్వంలో ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ప్రజాప్రభుత్వంలో దాదాపు 50 వేల పైగ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. త్వరలో ప్రభుత్వ ఉద్యోగలకు నోటిఫికేషన్స్ విడుదల. నూతన రేషన్ కార్డులు ఇచ్చి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. బీజేపీ - బిఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నేను మాటలు చెప్పను, శిలాఫలకాలు వేయను, పని చేసి చూయిస్తా. తాండూర్ రాజకీయాలలో ఎన్నడూ లేని విధంగా సామాజిక న్యాయం పాటిస్తూ సీట్ల కేటాయింపు జరిగింది. సాంప్రదాయ రాజకీయాలకు చెక్ పెడుతూ కొత్తవారికి అవకాశం ఇచ్చాం. కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో ఉన్న అభ్యర్థులకు మీ ఇంటి బిడ్డగా భావించి ఓటేయ్యంటి. తాండూర్ మున్సిపల్ కు రెండేళ్ల పాలనలో దాదాపు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. చిలుక వాగు, గొల్లచెరువు, పాత తాండూర్ రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభించడం జరిగింది. పాత తాండూర్ బ్రిడ్జి గత పాలకుల నిర్లక్ష్యంతో నష్టం ఎక్కువ జరుగుతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తక్కువ మొత్తంలో నష్టం జరిగెట్లు డిజైన్ చేయడం జరిగింది. బ్రిడ్జి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ ప్రభుత్వపరంగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం. తాండూర్ పట్టణంలో త్రాగునీటి ఎద్దడి నివారణకు కాగ్నా నది నుంచి అందించడానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీఠ వేయడం జరిగిందని గుర్తు చేశారు. తాండూర్ పట్టణంలో మహిళలకు దాదాపు రూ.15 కోట్లు వడ్డీ లేని రుణాలు అందించామన్నారు. రెండేళ్ళ పాలనలో మున్సిపల్‌ను చక్కబెట్టడం జరిగింది. మళ్ళీ దొంగల చేతికి ఇస్తే మున్సిపల్‌ను సర్వనాశనం చేస్తారు. దయచేసి ఆలోచించి, అభివృద్ధికి, కాంగ్రెస్‌కి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, పట్టణ నాయకులు, ఇంచార్జి లు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** భారత దేశంలో బాల్య వివాహాలు జరుగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.శుక్రవారం ఐ.డి.ఒ.సి ప్రాంగణంలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆర్డీఎస్ (గ్రామీణ అభివృద్ధి సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలన ప్రచార వాహనానికి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ ప్రచార వాహనం ద్వారా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు వనపర్తి, మహబూబ్ నగర్, గద్వాల జిల్లాలలో ఒక్కో జిల్లాలో 10 రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలు, చట్ట ప్రకారం పడే శిక్షల పై విస్తృత ప్రచారం చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరిగే ప్రమాదాలు ఉంటాయన్నారు. పుట్టబోయే పిల్లలు శారీరక ఎదుగుదల లేకపోవడం, తల్లి బిడ్డలు అనేక రోగాల బారిన పడి జీవితాలు నాశనం అయిపోతాయని తెలిపారు. బాల్య వివాహాలు చేసే వారి పై ఎలాంటి జాలి లేకుండా చట్ట ప్రకారం కఠిన శిక్షలు వేయడం జరుగుతుందని ఈ విషయాలను గ్రామస్థాయిలో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 లేదా 100/112 నెంబరు కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహం చేసే తల్లిదండ్రులతో పాటు పెళ్లి తంతులో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని, పెళ్ళికి వెళ్ళే బంధు మిత్రుల పై సైతం



కేసులు పెట్టడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఎక్కడ బాల్య వివాహాలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని చెప్పారు.అనంతరం బాల్య వివాహాలు అరికట్టేందుకు రూపొందించిన ప్రతిజ్ఞ చేశారు. సంతకాల సేకరణలో భాగంగ ఫ్లెక్సీ పై సంతకాలు చేశారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్య నాయక్, ఆర్డీఎస్ కోఆర్డినేటర్ చిన్నమ్మ థామస్, ప్రోగ్రాం ఆఫీసర్ చూచేత, సహాయ ప్రోగ్రాం ఆఫీసర్ జూవెద్ ఖురేషి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, పి.డి. డి ఆర్ డి ఓ ఉమాదేవి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి డి సి పి ఓ రాంబాబు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### టెండర్ ఓట్లు పడకుండా జాగ్రత్త వహించాలి

మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి టెండర్ ఓట్లు పడకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ లో, కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పిహెచ్ఎస్ లో ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి టెండర్ ఓట్లు పడకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఓటు వేయడానికి వచ్చే వారి గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏవైనా అనుమానాలు ఉంటే మరో గుర్తింపు కార్డును అడిగి ధృవీకరించుకోవాలన్నారు. ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తులు ఎవరు బ్యాలెట్ పేపర్ ను బయటకి తీసుకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఓటు వేసిన తర్వాత ఓటరు వేలికి సిరా చుక్కను విధిగా, స్పష్టంగా పెట్టాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారులను అడిగి తెలుసుకోవాలని, పొరపాట్లకు తావివ్వకూడదని కలెక్టర్ సూచించారు.

### బ్యాలెట్ పేపర్లను పక్కాగా తనిఖీ చేయాలి

బ్యాలెట్ పేపర్ల తనిఖీ పక్కాగా చేయాలని కలెక్టర్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. పెబ్బేరు, కొత్తకోట మున్సిపల్ కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న బ్యాలెట్ పేపర్ల తనిఖీని కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లలోని వివరాలు ఫారం 7 లో ఉన్న విధంగా ఉన్నాయో లేదో పక్కా గా చెక్ చేసుకోవాలని సూచించారు. ఇలాంటి మిస్టేక్స్ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఒకే అభ్యర్థి పేరు రెండు వేర్వేరు వార్డుల్లో లేకుండా చూసుకోవాలని సూచించారు. అభ్యర్థులందరికీ కౌంటింగ్ నోటీసు కూడా ఇవ్వాలని తెలియజేశారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, ఆర్డిఓ సుబ్రమణ్యం ఆయా మున్సిపల్ కమిషనర్లు తహసిల్దార్లు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**ఝరాసంగం, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** కేతకీ ఆలయ చైర్మెన్, వీరశైవ లింగాయిత్ సమాజ్ నాయకునిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై వెంటానే ఆలయ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ఝరాసంగం మండల లింగాయిత్ సమాజ్ అధ్యక్షులు రవిపటేల్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగం లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల వద్ద రశీదు టిక్కెట్ లేకుండా పూజలు చేయించడమే కాకుండా ఇష్టారీతిగా మాట్లాడడం ఎంత వరకు సమంజసం అన్నారు.వీరశైవ లింగయత్ల పట్ల అసభ్యకరంగా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు.ఆలయంలో జరుగుతున్న పరిస్థితులపై అధికారులు వెంటానే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్త మల్లికార్జున్,నాయకులు రాజు,సంతోష్ పటేల్,బస్వరాజ్,రుద్రప్ప,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుకను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి



రాజాపూర్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : రాజాపూర్ మండలంలో మల్లెపల్లి శివారులో వాగు నుంచి కొందరు వ్యక్తులు మట్టిని తీసి తీసుకొని ఫిల్టర్ ఇసుకను తయారుచేసి ట్రాక్టర్, టిప్పర్ ద్వారా తరలి వారిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన రైతు విజయభాస్కర్ రెడ్డి కోరారు. పగలు, రాత్రి తేడా లేకుండా జెసిబిల ద్వారా మట్టిని తీసి ఫిల్టర్స్ ఇసుక తయారు చేస్తున్నారని ఆరోపించారు. వాగు పరిసరాల్లో ఇసుక నిల్వలు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో ట్రాక్టర్, టిప్పర్ల ద్వారా హైదరాబాద్ జడ్చర్ల తరలిస్తున్నారని తెలిపారు. పొలాలకు వెళ్లే దారి బురదమయంగా మారుతుందని అన్నారు. అదే విధంగా చేన్నవెల్లి గ్రామానికి చెందిన జంగయ్య తమ గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమ ఇసుకను తరలిస్తున్నారని మూడుసార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అన్నారు. కుచ్చర్కళ్ సమీపంలో వాగు నుంచి టిప్పర్ ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని సర్పంచ్ వెంకటయ్య గౌడ్ ఫిర్యాదు చేశారు. పలువురు రైతులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎవరూ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తహసిల్దార్ రాధాకృష్ణను వివరణ కోరగా దాడులు నిర్వహించి పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామని, జరిమానా విధిస్తున్నామని అన్నారు.

## జీఓ 25ను సవరణ చేసిన తరువాతనే రేషనలైజేషన్ ప్రకియను చేపట్టాలి

**రేవల్లి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** జి.ఓ.నం 25 ద్వారా రేషనలైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టేకంటే ముందు జి.ఓ 25 ను సవరించి విద్యార్థుల ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించిన తరువాతనే రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శ్రీ నవీన్ నికోలస్ కి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాకి వినతి పత్రంలో డిమాండ్లను ప్రస్తావించారు. 1 నుండి 20 వరకు విద్యార్థులు నమోదైన ప్రతి పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20 నుండి 40 వరకు విద్యార్థులు నమోదైన ప్రతి పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. 40 నుండి 60 వరకు విద్యార్థులు నమోదైన ప్రతి పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుడి చొప్పున నియమించాలన్నారు. 60 మంది విద్యార్థులకన్నా ఎక్కువమంది నమోదై ఉన్న పాఠశాలలకు తరగతికి ఒక ఉపాధ్యాయుడితో పాటు అట్టి పాఠశాలలకు అధనంగా ప్రధానోపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఏదైనా ఒక పాఠశాలలో ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సెలవులపై వెళ్ళినప్పుడు అట్టి ఉపాధ్యాయుల స్థానంలో తాత్కాలికంగా పనిచేయుటకు అధనపు ఉపాధ్యాయు కనీసం మండలానికి ఐదుగురు అధనంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్తుకు ముఖ్య భూమిక పోషిస్తాయని, కాబట్టి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా తగుజాగ్రత్తలు వహించి బంగారు భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదద్దే విధంగా ప్రాథమిక పాఠశాలలను రూపొందించుటకు అవసరమైన సూచనలను పరిగణలోనికి తీసుకొని జి.ఓ.యంస్ 25 లో తగిన మార్పులు చేయవల్సిందిగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం-తెలంగాణ, మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుచున్నామన్నారు. టెట్‌లో అందరి ఉపాధ్యాయులకు అర్హత మార్కులు సమానంగా తమిళనాడు, బీహార్ రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాన్ని 50% అమలుపరుచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీయూ వనపర్తి జిల్లా అధ్యక్షులు రామమూర్తి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి నరేందర్ రెడ్డి లు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధ్యం



**పాపన్నపేట, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మహిళలు స్వయం ఉపాధి పొందుతూ సమాజంలో గౌరవంగా జీవించాలని జిల్లా సంక్షేమ అధికారిణి హేమాభార్గవి పేర్కొన్నారు. ఎస్బీఐ ఆర్ -సెటీ ఆధ్వర్యంలో 30 రోజుల కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 34 మంది మహిళాలకు శుక్రవారం పాపన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్టిఫికేట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ .. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు అందివచ్చిన ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీడీపీఓ వెంకట రమణమ్మ,మహిళా సాధికారత సిబ్బంది నాగమణి,కవిత,అంగన్వాడీ సూపర్ వైజర్లు మంజుల,శ్రీదేవి,వివోఏ లు వెంకట లక్ష్మీ,జ్యోతి,రాణి,గ్రామ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,ఉపసర్పంచ్ సద్దామ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పి మహేందర్

**నర్సాపూర్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రాథమిక పాఠశాల శివాలయం స్ట్రీట్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు, బీవీఆర్ఐటీ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ మరియు కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, భద్రతా చర్యలు, సిబ్బంది ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. పోలింగ్ రోజున ఓటర్లు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల



నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, గుంపులుగా చేరడం, అనుమానాస్పద కదలికలు జరగకుండా నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అలాగే నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ గారి వెంట నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి ఉన్నారు.

## ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, ప్రజలు ఎలాంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించడానికి మెదక్ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించబడింది అని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. శనివారం, జిల్లా పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ఫ్లాగ్ మార్చ్ మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై, న్యూ బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, ఓల్డ్ బస్సు స్టాండ్, గర్ల్స్ హై స్కూల్, మార్కెట్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహం, చామన్ హనుమాన్ టెంపుల్, రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరుగేలా, ఎన్నికల సమయంలో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలు ఎలాంటి



ప్రలోభాలకు లోనుకాకుండా, భయభ్రాంతులకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజల్లో భద్రతా భావం, నమ్మకం పెరుగుతుందని, పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీయస్పి ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, రూరల్ సీఐ జర్జ్, మెదక్ డివిజన్ ఎసైలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్

**మెదక్, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం పరిధిలోని రాంపూర్ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించి 5గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాంపూర్ అటవీ ప్రాంతం లో పేకాట ఆడుతున్న వ్యక్తులపై దాడి చేశారు. ఈ దాడిలో 5గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.18,600 నగదు మరియు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారు బోలా శేఖర్, కత శ్రీనివాస్, మస్కరి



శ్రీశైలం,గుమ్మడి సురేష్, మ్యాకల యాదగిరి పోలీసులు గుర్తించారు. వారిని కొల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**వెల్దుర్తి, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం మెదక్ జిల్లాలోని నర్సాపూర్ నియోజకవర్గంలో అత్యధిక అభివృద్ధి పనులు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ కె దక్కిందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మాసాపేట మండల కేంద్రంలో సాయిబాబా దేవాలయ పరిసరాల ప్రాంతంలో అంగన్వాడి భవన నిర్మాణం కోసం స్థానిక సర్పంచి కృష్ణారెడ్డి తో కలిసి ముగ్గు పోసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి అభివృద్ధి పరుస్తుందన్నారు. స్థానిక సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం వీధిలైట్లు డ్రైనేజ్ సౌకర్యం సిసి రోడ్ నిర్మాణం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



**అల్లాదుర్గం, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** బాలల హక్కులను పరిరక్షించడం తో బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బహిరన్ దిబ్బ సర్పంచ్ పాంపాటి వీరప్ప ఐసీడిఎస్ సూపర్ వైజర్ నాగమణి అన్నారు. మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో అంగన్ వాడి లెవెల్ మానిటరింగ్ అండ్ సపోర్టింగ్ కమిటీ, విసిపిసి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరప్ప ,ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాగమణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహాలు చేయడంతో పలు సమస్యలు వస్తాయని ,బాలికల శారీరక మానసిక ఎదుగు దల లేక గర్భం దాల్చిన సమయంలో గర్భాశయంలో పిండం ఎదుగుదల లేక తక్కువ బరువుతో అంగవైకల్యం గల పిల్లలు జన్మిస్తారని వారన్నారు. చదువుకొని విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన సమయంలో వారికి బాల్య వివాహాలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరప్ప,ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఐసీడిఎస్ సూపర్ వైజర్ నాగమణి ,వార్డు సభ్యులు,పంచాయతీ సెక్రటరీ స్వరూప , పాఠశాల ఎస్ ,ఎం ,సీ ,చైర్మన్ ,స్వరూప,ఉపాధ్యాయుడు,అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్ , ఏ, ఎన్,ఎం ,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ రక్షణ కోసం దేశవ్యాప్త పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** ప్రభుత్వ రంగ రక్షణ కోసం దేశవ్యాప్త పోరాటాలు జరుగుతున్నాయని సిఐటి రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. శుక్రవారం నాడు పటాన్చెరు మండల పరిధిలోని బానూర్ బీడీఎల్ పరిశ్రమలో కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని మోడీ ప్రభుత్వం విచ్చినం చేస్తుందని, పూర్తిగా ప్రైవేటు చేస్తుందని, ప్రభుత్వ రంగం పరిరక్షణ కోసం కార్మికులు ఉద్యమాలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగం ఉంటేనే హక్కులు, సౌకర్యాలు ఉంటాయని ఆయన అన్నారు. మొదట ప్రభుత్వరంగములోనే బలమైన పోరాటాలు, ఉద్యమాలు జరిగాయని ఆయన అన్నారు. పోరాటాల ద్వారానే హక్కులు, చట్టాలు వచ్చాయని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం ప్రైవేటు అత్యంత వేగంగా అమలు చేస్తుందని, ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేటుకరిస్తుందని , ఆయన అన్నారు. మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు కోసం జాతీయ కార్మిక ఉద్యోగ సంఘాలు తెలంగాణ రాష్ట్రంలోని కార్మిక ఉద్యోగ సంఘాలు ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం స్వాతంత్రం కంటే పూర్వం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి బానిసలుగా మార్చేందుకు చూస్తుందని అన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, ఎనిమిది గంటల పని దినం హక్కు, ఉద్యోగ భద్రత వంటి హక్కులను కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. కార్మిక చట్టాలు ఉన్నప్పుడే వాటిని అమలు చేయకుండా కార్మికులను యాజమాన్యాలు శ్రమదోపిడికి పాల్పడ్డాయని అన్నారు. ఉన్న కార్మిక చట్టాలు రద్దయి లేబర్ కోడ్స్ తో యాజమాన్యాలు మరింత శ్రమదోపిడి చేసుకుంటాయని, కార్మికుల రక్త మాంసాలను పీల్చిపి చేసేందుకే అని అన్నారు. వీటిని కార్మిక వర్గం ఐక్యంగా తిప్పి కొట్టాలని



అన్నారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని ఈ సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, బీడీఎల్ యూనియన్ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్,వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలలను ఇటుక బట్టి పనుల్లో పెట్టుకోవద్దు

- పిల్లలను పనులలో పెట్టుకుంటే కఠిన చర్యలు
- జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ వసుధ



**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 06 (జనం సాక్షి) :** మానవ అక్రమ రవాణా (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ నేతృత్వంలోని బృందం నక్కలపల్లి, నల్లగుంట , గుంటూరు పల్లి ప్రాంతాలలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, బీహార్, చత్తీస్గడ్ రాష్ట్రాలకు చెందిన కార్మికుల పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించుటకు రెస్క్యూ నిర్వహించి, కార్మికులకు కౌన్సిలింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నల్లగుంట, నక్కలపల్లి, గుంటూరుపల్లి ప్రాంతాలలో ఇటుక బట్టీలు నిర్వహించే యజమానులకు గుంటూరు పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో వసుధ పాల్గొని మాట్లాడారు. విద్యాహక్కు చట్ట ప్రకారంగా బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా సమీప అంగన్వాడీలో గాని లేదా పాఠశాలలోకాని చేర్పించి వారికి విద్యను అందించవలసిన బాధ్యత ఇటుక బట్టీల యజమానులకు ఉందని చెప్పారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని, లేకుంటే బాల్యంలోనే వారి జీవితం ఛిద్రమవుతుందని చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఉమా మాట్లాడుతూ ఇటుక బట్టీలు నిర్వహించే ప్రాంతంలో బ్రిక్స్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని లేదా సమీప పాఠశాలలో చేర్పించవలసిన బాధ్యత ఇటుక బట్టి యజమానులపై ఉందని, బాలల హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్ ఆదేశాలతో త్వరలోనే ఇటుక బట్టే యజమానులతో, కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ బృందం నక్కలపల్లి నల్లగుంట, గుంటూరు పల్లి పాఠశాలలను సందర్శించి అక్షయపాత్ర ద్వారా ఇతర రాష్ట్రాల పిల్లలకు భోజనం అందుతుందా, యూనిఫామ్స్ అందయా లేదా, స్థానిక భాషలో విద్యాబోధన జరుగుతుందా , విద్యా వాలంటీర్స్ అందుబాటులో ఉన్నారా, పిల్లల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది, అందరికీ ఆధార్ కార్డులు ఉన్నాయా, అనే విషయాల గురించివివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకులపల్లి మధు, ఏ హెచ్ టి యు ఏ.ఎస్. ఐ. భాగ్యలక్ష్మి, గుంటూరుపల్లి ఇన్చార్జ్ హెడ్ మాస్టర్ అలీ, నల్లగుంట హెడ్మాస్టర్ లతా, ఇటుక బట్టీల యజమానుల సంఘం అధ్యక్షులు దగ్గుబాటి శ్రీనివాస్ నాయుడు, నరసింహులు, యాకూబ్ ఇతరులు పాల్గొన్నారు.

# సీఎం సభ హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సీఎం సభ హెలిపాడ్ ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ లు పరిశీలించారు. శుక్రవారం చెల్పూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిపాడ్ పరిసర ప్రాంతాల భద్రత, వాహనాల పార్కింగ్ సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర వైద్య కేంద్రం ఏర్పాటు, అగ్నిమాపక చర్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని, భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎస్పీ సంకీర్త్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి సీఎం సభకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**చిట్యాల, ఫిబ్రవరి 07( జనం సాక్షి):** చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ లో 8 మండలాల సీఎం కప్ నియోజకవర్గ స్థాయి క్రీడోత్సవాలు సీఎం కప్ చైర్మన్ ఆర్డిఓ హరికృష్ణ, క్రీడల కన్వీనర్ ఎంఈఓ కోడెపాక రఘుపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడారంగానికి ప్రజాపాలన ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు క్రీడాకారులు ఈ పోటీల్లో తమ ప్రతిభలను కనబరిచి రాణిస్తే జాతీయ రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపుతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి ముందుకు వెళ్లాలని కొనియాడారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి కొద్దిసేపు కాబడ్డీ ఆట ఆడి, క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయ శ్రీ, తాసిల్దార్ ఇమామ్ బాబా షేక్, చిర్రా రఘు ,వరద రాజేశ్వరరావు, పిడి సాంబమూర్తి, చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా మండల నాయకులు ముకిరాల మధు వంశీకృష్ణ, గూట్ల తిరుపతి, చిలకల రాయకుమురు, గడ్డం కొమురయ్య, కొక్కుల సదానందం, ఎండి రాజ్ మహమ్మద్,మాజీ ఎంపీటీసీలు కట్కూరి పద్మ నరేందర్ ,దెబ్బెట అనిల్ కుమార్, టౌన్ అధ్యక్షులు గంగాధర్ రవీందర్, శ్రీనివాస్, మార్కండేయ, సర్వ శరత్,అల్లం రాజు, ఆకుల ఆది రెడ్డి, వివిధ పాఠశాల పీఈటీలు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఫిబ్రవరి 6 (జనంసాక్షి):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్య లతో కలిసి 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3 ఓ.పి.ఓ. ల చొప్పున బెల్లంపల్లి మున్సిపాలిటీకి 68 బృందాలు, చెన్నూరు మున్సిపాలిటీకి 36 బృందాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీకి 45 బృందాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి 30 బృందాలు, మంచిర్యాల నగరపాలక సంస్థకు 265 బృందాలు రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన స్థానాలలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం బెల్లంపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, చెన్నూర్ లో మున్సిపల్ కార్యాలయంలో, లక్షెట్టిపేటలో మున్సిపల్ కార్యాలయంలో, క్యాతనపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 8, 9 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

# నాణ్యత చూసి నవ్వు'తారు'

- లక్షలాది రూపాయల సొమ్ము వృధా పాలు...
- మామూ'ళ్ళు'లుగా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు...





**మంగపేట ఫిబ్రవరి 06(జనంసాక్షి) :** తారు రోడ్డు మరమ్మత్తుల పనులలో గుత్తేదారు పూర్తిగా నాణ్యత లోపించి వేసిన రోడ్డును చూసి పలువురు వాహనదారులు నవ్వే దుస్థితి ఏర్పడిన తీరు మండలంలోని కోమటిపల్లి గ్రామం నుండి కొత్తూరు మోట్లగూడెం వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర మరమ్మ తూపా లను చూస్తే అర్థమవుతుందంటూ వాహనదా రులు నవ్వుకుంటున్నారు. ఈ మార్గం మధ్యలో తారు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఇటీవల తారు రోడ్డు మరమ్మతు నిర్మాణ పనులను చేపట్టారు. ఇట్టి మరమ్మత్తు పనులను చేపట్టిన గుత్తేదారు ఇష్టారాజ్యం పనులు చేపడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు చూసి పూర్తిగా నాణ్యత లోపించడంతో మరమ్మతులు చేపట్టిన తీరును చూసి నవ్వుకుంటున్నారు. ఇలా నాణ్యత లేకుండా ఇష్టానుసారంగా మరమ్మతులను చేపడుతుంటే పర్యవేక్షించాల్సిన సంబంధిత ఇంజనీర్ శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం దారుణమని వాహనదారులు ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయల సొమ్మును మరమ్మత్తుల పేరిట వృధా చేయడం తప్ప మరి ఏమి లేదంటూ రోడ్డు మరమ్మతు పనులు చూసి వాహనదా రులు ఆగ్రహిస్తున్నారు. ఇలా గుత్తేదారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటే సంబంధిత అధికారులు మామూ'ళ్ళు' లుగా చూసి చేసుకున్నట్టు వ్యవహరిస్తూ గుత్తేదా రులకు సహకరిస్తున్నారంటూ ప్రజలు బహిరం గంగానే చర్చించుకుంటున్నారు. ఇలా ఇష్టాను సారంగా మరమ్మతుల నిర్మాణ పనులు పేరిట నాణ్యత లేకుండా చేసిన పనులకు సంబంధిత శాఖ అధికారులు గుత్తేదారులకు బిల్లులను ఏ విధంగా కట్టబెడతారని ప్రజలు బహిర్గతంగా ప్రశ్నిస్తున్నారు. ఇలా నాసిరకంగా రోడ్డు నిర్మాణ పనులను చేసేటువంటి గుత్తేదా రులకు, వారికి సహకరిస్తున్న వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

# సరస్వతీ అంత్య పుష్కరాలకు 30 కోట్ల పనులు



**కాళేశ్వరం, ఫిబ్రవరి 07 (జనంసాక్షి) :** మే మొదటి వారం వరకు సరస్వతి అంత్య పుష్కరాలకు చేపట్టిన అన్ని పనులు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. శుక్రవారం కాళేశ్వరం వచ్చిన ఆమె జిల్లా కలెక్టర్, ఎస్పీ , సబ్ కలెక్టర్ , ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులతో కలిసి దేవాలయం, సరస్వతి ఘాట్, కాళేశ్వరం వంతెన, ముక్తి వనం తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పిఆర్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, దేవాదాయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలు నిర్వహణకు ప్రభుత్వం 30 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల పూర్తికి నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఇంకా మూడు నెలలు సమయం మాత్రమే ఉన్నందున ప్రాధాన్యత ను గమనించి పనులు పూర్తి చేయాలని తెలిపారు. సరస్వతి ఆది పుష్కరాలకు 40 లక్షల మంది భక్తులు వచ్చారని, అంత్య పుష్కరాలకు దాదాపు 60 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పనుల పురోగతి పై ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. కుదురుపల్లి - బీరసాగర్ రహదారి నిర్మాణానికి అంచనాలు ఇవ్వాలని తెలిపారు. సిరొంచ నుండి గోదావరి ఘాట్ వరకు తాత్కాలిక రహదారి, వాహన పార్కింగ్ ఏర్పాటు కు ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. టెంట్ సిటీ, పార్కింగ్, సరస్వతి ఘాట్, గోదావరి ఘాట్ లో జనరేటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. మ్యూజియం ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేయాలని ఈఓ ను ఆదేశించారు. స్వామి దర్శనానికి భక్తులు రద్దీ లేకుండా క్యూ లైన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పనులు పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అంచనా ప్రతిపాదనల్లో మార్పులు ఉంటే రెండు రోజుల్లో ప్రతిపాదనలు అందచేయాలని సూచించారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి సత్వరం పనులు ప్రారంభించాలని తెలిపారు. సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ సంకీర్త్, ధార్మిక సలహాదారుడు గోవింద హరి, జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ శాఖ ఈఈ దుర్గా ప్రసాద్, పిఆర్ ఇరిగేషన్, ఆర్ అండ్ బి, విద్యుత్ సమాచార శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు దేవాదాయశాఖ సంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో అభిషేకం చేసిన అనంతరం అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులు అధికారులు శేష వస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాబు ,కాళేశ్వరం ఉప సర్పంచ్ చెమ్మల సుధీర్ కుమార్ , స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై ములుగు ఎస్పీ పరిశీలన

- కొడవటంచ కార్యక్రమానికి పూర్తి బందోబస్త్ ఇంచార్జ్.....
- ముందస్తుగానే స్వయంగా వెళ్లి భద్రతా చర్యలను చేపట్టిన ఎస్పి...

**ములుగు బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపాలపల్లి పర్యటన లో భాగంగా రేగొండ మండలం కొడవటంచ గ్రామం లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సందర్శన సందర్భంగా ములుగు ఎస్పి కి బాధ్యతలు అప్పగించగా ఎస్పి ముందస్తుగానే స్వయంగా వెళ్లి బందోబస్తు చర్యలను చేపట్టారు.ఆలయ ప్రాంగణం, హెలీప్యాడ్, ఎన్‌రూట్ మార్గాలు, బైక్ పేట్రోలింగ్, ఆలయ యాక్సెస్ కంట్రోల్, ఆలయ గెస్ట్ హౌస్, పార్కింగ్ ప్రాంతాలు తదితర కీలక ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లపై స్థానిక అధికారులకు సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన సురక్షితంగా, సజావుగా జరిగేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్ విభాగం అప్రమత్తంగా విధులు నిర్వహించేలా బందోబస్త్ చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఘనపూర్ సిఐ కరుణాకర్,ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో జోరందుకున్న ప్రచారం

- ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తున్న అభ్యర్థులు
- ఈనెల 11న పోలింగ్ ..13న కౌంటింగ్




**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 06(జనం సాక్షి) :** మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ పూర్తయి ఉపసంహరణల అనంతరం గత రెండు మూడు రోజులుగా ఆయా పార్టీల అభ్యర్థులు తమ ప్రచార వేగాన్ని పెంచారు. ప్రధానంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉన్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బి ఆర్ ఎస్, బిజెపి ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ లో ఇతర పార్టీ వాళ్లు సుమారు 55 మంది పోటీలో ఉన్నారు. మొత్తం సుమారు 10 వేల 519 ఓటర్లు వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్నట్టు స్థానికులు తెలిపారు. వర్ధన్నపేట సిటీ తో పాటు డిసి తండా ఆ పక్కనే ఉన్నటువంటి మరో 10 తండాలు కూడా ఈ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. ఈనెల 11న పోలింగ్ 13న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ విషయంలో సంబంధిత పోలింగ్ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీలు, యాదవ, రెడ్డి, కాపు, వెలమ, గౌడ, కుమ్మరి, వడ్డెర, ఎస్టీ మొదలైన సామాజిక వర్గానికి చెందినవారు ఎక్కువగా ఉన్నారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నుండి స్థానిక ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, వరంగల్ డిసిసి అధ్యక్షులు అయూబ్ ఇతర నాయకులు, కొందరు కార్పొరేటర్లు కూడా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అదేవిధంగా బి ఆర్ ఎస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తో పాటు పలువురు నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. బిజెపి నుండి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ తో పాటు మరికొందరు నేతలు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు పార్టీల వాళ్లు ఎవరికివారు తగ్గకుండా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ తాము గెలిస్తే మున్సిపాలిటీని, వార్డులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామంటూ ఆయా వార్డులలో అభ్యర్థులుగా నిలబడిన వారు ప్రజలకు వాగ్దానాలు ఇస్తున్నారు. మొత్తం మీద వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రచారం ఇప్పుడిప్పుడే వేడివేడిగా సాగుతోంది. మరో రెండు రోజులైతే మరింత హీటెక్కి అవకాశం ఉంది.

# పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..?

**గూడూరు,ఫిబ్రవరి 07(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.శుక్రవారం ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా గూడూరు మండలంలోని విద్యార్థిని ప్రేమ కారణంతో పాయిజన్ తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం? ఆ విద్యార్థిని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిండు మనసుతో ఆశీర్వదించాలి

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్ పూర్, ఫిబ్రవరి 06 (జనంసాక్షి) :** 'నాకు రాజకీయ జన్మనిచ్చి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల ఋణం ఎన్ని జన్మలెత్తిన,ఎన్ని అభివృద్ధి పనులు చేసినా తీర్చుకోలేనని,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిండు మనసుతో ఆశీర్వదించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 12, 13, వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటింటిప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లా డుతూ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఈ నెల 11జరిగే మున్సిపల్ ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారు మీకు అందుబాటులో ఉండి మీకు సేవ చేసే విధంగా చూసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అందరూ ఒక్క తాటి ఉండి ఘనపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురావేయాలని పిలుపునిచ్చారు. ప్రజల కు ఇచ్చిన మాట ప్రకారం ఘనపూర్,చాగల్, శివు నిపల్లి గ్రామాలను కలిపి మున్సిపాలిటీ చేసానని, మున్సిపాలిటీ అభివృద్ధికి 50కోట్ల నిధులు మంజూరు తెచ్చానని, అందులో 25కోట్ల పనులు ప్రారంభించుకున్నామని25కోట్ల పనులు టెండర్లు పూర్తి అయ్యాయని ఎన్నికల తర్వాత ఆపనులు కూడా ప్రారంభం అవుతాయాని తెలిపారు. అభివృద్ధి చేసే పార్టీని కాదని ఇతర పార్టీలకు ఓటు చేస్తే మురికి కాలువలో వేసినట్లేనని అన్నారు. అధికా రంలో ఉన్న నాడు చేయని వాడు ఇప్పుడు ఎలా చేస్తాడో ప్రజలు ఆలోచించాలని తెలిపారు. ఏ అభివృద్ధి పనులు జరగాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా, ఎమ్మెల్యే ద్వారా, ఎంపీ ద్వారా మాత్రమే జరగాలని అన్నారు. ఘనపూర్లో చాలా సమస్య లు ఉన్నాయని వాటన్నంటిని పరిష్కరించుకోవా లంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవ సరం ఉందని పేర్కొన్నారు. నిజాయితీగా పని చేసే వారిని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. 15ఏళ్ళు ఎమ్మెల్యే గా ఉన్న ఎం అభివృద్ధి చేశాడో మనందరికీ తెలుసని అన్నారు. తెల్లారి లేస్తే నన్ను తిట్టడమే అయన పని అని, పని లేని వారికీ మాటలు ఎక్కువని విమర్శించారు. రాజయ్య ఉప ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా ఉండి ఘనపూర్ ఒరగేబెట్టింది ఏమి లేదని అన్నారు. సొంత చిన్నాన్న కొడుకు దగ్గరనే దళిత బందు ఇప్పిస్తానని రెండు లక్షలు తీసుకొని మోసం చేసిన ఘనుడుఅని ఆరోపించారు. ఘన పూర్ ను మున్సిపాలిటీ చేసింది నేను, మున్సిపా లిటీ అభివృద్ధికి 50కోట్లు తెచ్చింది నేను, మరో 50కోట్లు తెచ్చేది కూడా నేనే అని ఘనపూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి జరగాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. 15ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి చెందాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజా రిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో ఆయావార్డుల అభ్యర్థులు,వార్డు ఇంచార్జ్ లు, కో ఆర్డినేటర్లు, మున్సిపాలిటీ ముఖ్య నాయ కు లు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన పీవోబి రాహుల్



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** భద్రాద్ర కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రం-4ను భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందుతున్న పోషకాహారం, ప్రీస్కూల్ విద్య, కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు ఐటీసీ, ఎల్డీడీ, ఎనీవో, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పద్మ, సుమిత్ర, ఎల్డీడీ సిబ్బంది ప్రమీల, అభిషేక్ లు పాల్గొన్నారు.

# వెంకిర్యాల వాగు బ్రిడ్జికి మహర్దశ...

- నేడు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- రూ.4.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**కొందుర్గు, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** కొందుర్గు మండల ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. ఏళ్ల తరబడి వర్షాకాలంలో రాకపోకలకు నరకం చూపించిన వెంకిర్యాల వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ శుక్రవారం రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గు మండలం వెంకిర్యాల గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పనులకు అత్యంత వైభవంగా భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేసింది. బ్రిడ్జి నిర్మాణం రూ. 3.50 కోట్లు రోడ్డు విస్తరణ పనులు: రూ. 1.00 కోటి మొత్తం వ్యయం: రూ"4.50 కోట్లు. భూమి పూజ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఉద్వేగానికి లోనయ్యారు. "గతంలో వర్షం వస్తే చాలు వెంకిర్యాల వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు, రైతులు, విద్యార్థులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఆ కష్టాలను స్వయంగా చూసిన వ్యక్తిగా, నేడు ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని పేర్కొన్నారు.

### దూసుకుపోతున్న కొందుర్గు అభివృద్ధి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, కొందుర్గు మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళు_న్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ బ్రిడ్జి పూర్తయితే ఈ ప్రాంత రవాణా వ్యవస్థ పూర్తిగా మారిపోతుందని, ఆర్థికంగా కూడా ఈ ప్రాంతం పుంజుకుంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి,



పీఏసీఎస్ (పిఏసిఎస్) చైర్మన్ దామోదర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి జితేందర్ రెడ్డి.ప్రముఖ కాంగ్రెస్ నేతలు రాములు గౌడ్, గోవర్ధన్ గౌడ్ గారులతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. దశాబ్దాల చీకటి వీడి తమ మార్గానికి మోక్షం లభించిందని గ్రామస్తులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలకు గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, చింతకుంట్ల వెంకన్న

**తుంగతుర్తి, జనవరి 6 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని మహిళలందరికీ గౌరవ, భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు, శుక్రవారం మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో శాసనసభ్యులు మందుల సామేలు ఆదేశానుసారం శ్రీ శక్తి మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించి ముగ్గు పోశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సమాఖ్యల బలోపేతానికి గ్రామంలోని మహిళల ఆర్థిక సామాజిక సాధికారత సాధించేందుకు ప్రతి గ్రామంలో 10 లక్షల రూపాయలతో మహిళా సమాఖ్య భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు, ఇందుకోసం ప్రతి గ్రామంలో గరిష్ఠంగా 10 లక్షల



రూపాయల నిధులను వెచ్చించి వ్యయం చేయనున్నట్లు తెలిపారు, గ్రామీణ మహిళలు కేవలం పొదుపు సంఘాల కే పరిమితం కాకుండా స్వయం ఉపాధి నువ్వే అధికార కేంద్రాలుగా ఎదగాలి అని అన్నారు, ఇట్టి శాశ్వత భవనంలో మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చు అని అన్నారు, ఇవి మహిళలకు నిర్ణయాధికార కేంద్రాలుగా సురక్షితమైన స్థలంగా ఉంటాయని అన్నారు, దశలవారీగా అన్ని గ్రామాల్లో మహిళల కోసం స్వయం సహాయక సంఘాల శాశ్వత కార్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్నట్లు తెలిపారు, ఉపాధి హామీ విధులతో ఈ భవన నిర్మాణాలు నిర్మించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుకల మంజుల వెంకన్న గ్రామ ఉప సర్పంచ్ అన్నే బోయిన శ్రీకాంత్ సింగిల్ విండో డైరెక్టర్ కేతిరెడ్డి రవీందర్ రెడ్డి గారు మాజీ సర్పంచ్ చంద వెంకన్న మాజీ ఎంపిటిసి కేతిరెడ్డి లతా విజయ కుమార్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లి యాకన్న ఎన్ ఎస్ యు ఐ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్అందే పరశురాం మరియు తాపీ మేస్త్రిలు పాల్గొన్నారు.

## మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దు



**తాండూరు, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** ఆప్యాయతతో ఆదరించండి అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని 23వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని వాల్మీకి నగర్ 23వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్ ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ ఆప్యాయతతో పలకరించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు గతంలో మీ సేవలు గుర్తించామని మరోసారి మీ సేవలు వార్డు ప్రజలకు ఎంతో అవసరమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్ మాట్లాడుతూ అవకాశం ఇవ్వండి వార్డును అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆశీర్వదించండి అభివృద్ధి పరుగులు పెట్టిస్తామన్నారు. ఐదేళ్లలో వార్డు అభివృద్ధికి నోచుకోలేదని గుర్తుచేశారు. మాయమాటలకు నమ్మి మోసపోవద్దని వెల్లడించారు. టిఆర్ఎస్ పాలనలోని 23వ వార్డు అనేక విధులుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డల రవీందర్,దర్మిది రవి, కేశవరావు, నాయకులు యువ నాయకులు వార్డు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ లోకి భారీ చేరికలు



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో అప్పుడే ఫలితం తేలిపోయిందా..? అంటే అవుననే అంటున్నాయి 30వ వార్డు రాజకీయ పరిణామాలు. కాంగ్రెస్ అభ్యర్థిని కొట్టం శిరీషా రెడ్డి ప్రత్యర్థులకు ఊహించని విధంగా "షాక్" ఇచ్చారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్ష పార్టీలను ఖాళీ చేస్తూ, వార్డులో తన విజయకేతనాన్ని ఖాయం చేసుకుంటున్నారు.

### మంత్రి సమక్షంలో భారీ చేరికలు

శుక్రవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం కీలక రాజకీయ మార్పుకు వేదికైంది. బీఆర్ఎస్ కీలక నేత తప్పెట్ల గిడ్జన్ (మున్నా) ఆధ్వర్యంలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు, సుమారు 40 కుటుంబాలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయి. స్వయంగా మంత్రి పొంగులేటి వారికి కండువాలు కప్పి ఆహ్వానించడంతో వార్డులో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

### గెలుపు ముంగిట శిరీషా రెడ్డి

ఒకేసారి 40 కుటుంబాలు పార్టీలో చేరడంతో 30వ వార్డులో విపక్షాలు డీలా పడ్డాయి. అభ్యర్థిని శిరీషా రెడ్డి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుండటంతో ప్రత్యర్థులకు పాలుపోని పరిస్థితి నెలకొంది. "అభివృద్ధికి ఆకర్షితులయ్యే తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామని, శిరీషా రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని" ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొట్టం శిరీషా రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** ఎక్కడా చిన్న పొరపాట్లు జరగకుండా ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆర్డీఓ శేఖర్ రెడ్డి అధికారులను సూచించారు. పురపాలక సంఘం రెండో సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్స్ ఎం. నరేందర్ రెడ్డి, బి. దశరథలు అధికారులకు బ్యాలెట్ బాక్సుల సీలింగ్, ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ మరియు అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఆర్డీవో శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక




వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి , తహసీల్దార్ వీరబాబు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఎంఈఓ ఈ. గురువారావు, మున్సిపల్ ఆర్ఓ డి. అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



**హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మండల పరిధిలోని అమరవరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన జిట్టబోయిన చిన్న వెంకన్న కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైంది. కాగా ఇంట్లో సుమారు మూడు తులాల బంగారం,16 తులాల వెండి,లక్షన్నర నగదు కాలి బూడిద అయ్యాయని బాధితులు విలపిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించాయి. కాగా ఇంటికి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. కాగా వెంకన్నకు భార్య ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ఇల్లు కట్టెందుకు వడ్డీకి డబ్బులు తీసుకురావడంతో అవి కూడా కాలి బూడిద కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కర్నాటి శిరిష, ఉప సర్పంచ్ వీర నాగిరెడ్డి, నాయకులు ఉస్తెల గురవారెడ్డి, సైదిరెడ్డి, వెంకటరెడ్డి, ప్రకాష్ లు కోరారు.

## విద్యార్థులే రేపటి సమాజాన్ని మార్చగలరు

- నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**మర్రిగూడ, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** నల్లగొండ మండలంలోని దోమలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం పిఆర్ఆర్ ఫౌండేషన్ రూపొందించబడిన మెరిట్ మెటీరియల్ ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పుస్తకం చేతిలో ఉన్న విద్యార్థులే రేపటి సమాజాన్ని మార్చే శక్తి విద్యకే ఉందని అన్నారు. ప్రతిభకు గుర్తింపు లభించినప్పుడే విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదల దృఢ సంకల్పం తప్పనిసరి అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇష్టంతో చదివి పక్కతలతో మంచి ఫలితాలు సాధించాలని మన గమ్యం చేరాలంటే మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న




పిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు ను ఎస్పీ అభినందించారు. అదేవిధంగా చదువుపై తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్యపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శివరాం రెడ్డి, రూరల్ ఎస్సై సైదా బాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కొమ్ము శ్రీనివాస్ విద్యార్థులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పెదనెమిల ఉన్నత పాఠశాల, ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

**నూతనకల్, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** మండల పరిధిలోని పెదనేమిల గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో సునీత పర్యటించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మరియు ఉపాధి హామీ పనులను, పరిశీలించడం జరిగింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఎస్ఎస్సి బోర్డు ఎగ్జామ్స్ సమయం దగ్గర పడుతుండగా వారికి ప్రత్యేక క్లాసులు తీసుకోవాలని పిల్లలపై



ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మండలంలో మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు శివయ్య కు మరియు ఉపాధ్యాయులకు తగు సూచనలు చేయడం జరిగింది గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేయడం జరిగింది నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి అయినందున మిగతా నర్సరీ పనులను వేగవంతం చేయాలని ఫీల్డ్‌అసిస్టెంట్ ను ఆదేశించారు కూలీలు సమయపాలన పాటించాలని ఉపాధి పనులు సక్రమంగా చేసి మంచి వేతనం పొందాలని ఎంపీడీవో సునీత అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివయ్య, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 6 (జనం సాక్షి) :** గత పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే కనీస జ్ఞానం కూడా ఆనాటి 'దొర'కు లేకపోయింది. కానీ మా ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత నాది. మీరు అభ్యర్థులను గెలిపించండి.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటాను" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఏదులాపురం మున్సిపాలిటీలోని 1,21,19,18,31,32,17,14,16వ వార్డుల్లో ఆయన విస్తృతంగా రోడ్ షో నిర్వహించారు.

### మాయ మాటలు నమ్మొద్దు..

రెడ్డిపల్లి (1వ వార్డు) నుంచి ప్రారంభమైన ఈ రోడ్ షో ముత్తగూడెం, గొల్లగూడెం, బారుగూడెం మీదుగా ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలు రాగానే రంగు రంగుల కండువాలు వేసుకుని మాయ మాటలు చెప్పేందుకు వస్తారు. గతంలో 'వరి వేస్తే ఉరి' అని రైతులను భయపెట్టిన వారు నేడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటోందని గుర్తు చేశారు.

### సొంతింటి కల నెరవేరుస్తాం..

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీలో మొదటి విడత కింద ఇప్పటికే 587 ఇళ్లు మంజూరు చేశామని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రెండో విడత జాబితాను విడుదల చేస్తామని ప్రకటించారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు స్థలాలు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు.

### హోరెత్తిన రోడ్ షో..



మంత్రి పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలకగా, పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి, నినాదాలతో హోరెత్తించారు. ఆయా వార్డుల అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బిట్‌కాయిన్ భారీ పతనం..

- 12 శాతం కుప్పకూలి 65 వేల డాలర్ల దిగువకు
- ఒక్క రోజులో దాదాపు 12 శాతం పడిపోయిన బిట్‌కాయిన్
- ఏడాది అత్యల్ప స్థాయి.. ట్రంప్ అధికారంలో మొదటిసారి
- అమ్మకాల ఒత్తిడితో మార్కెట్‌లో భయాందోళనలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ ధర శుక్రవారం భారీగా పడిపోయింది. ఒక్క రోజులో దాదాపు 12 శాతం తగ్గి 65 వేల డాలర్ల దిగువకు చేరింది. ఏడాది కాలంలో ఇదే అత్యల్ప స్థాయి. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ఈ స్థాయిలో పతనమవడం ఇదే మొదటిసారి. క్రిప్టో మార్కెట్‌లో భయాందోళనల నేపథ్యంలో అమ్మకాల ఒత్తిడి మూలంగా బిట్‌కాయిన్ ధర కుప్పకూలినట్లు అంచనా వేస్తున్నారు. కొద్దిసేపటి క్రితం బిట్‌కాయిన్ ధర 64,352.40 డాలర్ల వద్ద నమోదైంది. ఏడాది పరంగా 33.82 శాతం తగ్గింది. 24 గంటల్లో 9.84 శాతం పడిపోయింది. దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్లను ఇన్వెస్టర్లు విక్రయించారు.
గత ఏడాది అక్టోబర్‌లో బిట్‌కాయిన్ ధర అత్యధికంగా 1,26,000 డాలర్లకు చేరింది. ప్రస్తుతం బిట్‌కాయిన్ మార్కెట్ మొత్తం విలువ 1.28 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. గడిచిన 24 గంటల్లో 143.98 బిలియన్ డాలర్ల నష్టం వచ్చింది. క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో బిట్‌కాయిన్ వాటా 58.2 శాతం కాగా, రెండో స్థానంలో ఎథేరియం 10.4 శాతం, మిగతా క్రిప్టోల వాటా 31.5 శాతంగా ఉంది.
టెథర్ ధర స్థిరంగా 0.9988 డాలర్ల వద్ద ఉండగా, బైనాన్స్ కాయిన్ 619 డాలర్ల వద్ద, ఎక్స్ఆర్‌పీ 1.27 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి. సోలానా 68 డాలర్ల దిగువకు, డాగ్‌కాయిన్ 0.09 డాలర్ల దిగువకు పడిపోయాయి. మొత్తం క్రిప్టో మార్కెట్ భారీ నష్టాల్లో ట్రేడవుతోంది. ట్రేడర్లు జాగ్రత్తగా ఉండాలని, సపోర్ట్ లెవల్స్‌ను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## మార్కెట్లు లాభాలతో ముగిశాయి

**ఐటీ షేర్లలో మరోరోజు నష్టాలు.. ఆంథ్రోపిక్ ప్రభావం**



**ముంబై, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల ప్రకటన నేపథ్యంలో ఉదయం నష్టాల నుంచి సూచీలు కోలుకుని కొద్దిమేర లాభపడ్డాయి. సెన్సెక్స్ 266 పాయింట్లు ఎగసి 83,580 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి 26,693 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 83,249 వద్ద ప్రారంభమై ఒక దశలో 83,612 వద్ద గరిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 36 పైసలు కోల్పోయి 90.70గా నమోదైంది. నిఫ్టీ సూచీలో ఐటీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్ షేర్లు రాణించాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటో షేర్లు నష్టాలను చవిచూశాయి. ఆంథ్రోపిక్ కొత్త ఏఐ టూల్స్ ప్రకటన ప్రభావంతో ఐటీ షేర్లలో నష్టాలు మరోరోజు కొనసాగాయి.

# ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారు

- ప్రశాంత్ కిషోర్‌పై సుప్రీం ఆగ్రహం
- బీహార్ ఎన్నికల ఫలితాలు రద్దు కోరిన పిటిషన్ తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** గత ఏడాది నవంబర్‌లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రద్దు చేయాలని కోరుతూ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టిపారేసింది. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారని, ఇప్పుడు పబ్లిసిటీ కోసం న్యాయ ప్రక్రియను వాడుకుంటున్నారని చీఫ్ జస్టిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు ఎన్ని ఓట్లు వచ్చాయో ఒకసారి చూడండి.. ప్రజలు తిరస్కరిస్తే రిలీఫ్ కోసం జ్యుడిషియల్ ఫోరమ్‌ను వాడుతున్నారని, ఆ సంక్షేమ స్కీమ్‌ను ఎవరో ఒకరు ముందుగానే ఛాలెంజ్ చేసి ఉండాల్సిందని ధర్మాసనం పేర్కొంది. ఎన్నికలకు ముందు ప్రభుత్వం సంక్షేమ పథకం పేరిట మహిళలకు డబ్బులు పంచి ఓటర్లను ప్రలోభపెట్టిందని జన్ సురాజ్ పార్టీ ఆరోపించింది. కుటుంబంలోని మహిళకు రూ.10 వేలు ఇవ్వడం అక్రమమని, సుమారు 36 లక్షల మంది మహిళలకు డబ్బులు రిలీజ్ చేసి అధికార పార్టీ అక్రమ విధానాలకు పాల్పడిందని పిటిషన్‌లో పేర్కొంది. ఆర్టికల్ 32 కింద దాఖలైన ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు బీహార్ హైకోర్టుకు పంపింది. ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ మొత్తం 238 సీట్లలో పోటీ చేసి ఒక్క సీటు కూడా గెలవలేదు. దారుణ పరాజయం తర్వాతే ఈ పిటిషన్ దాఖలైంది.


### కృత్రిమ మేధపై ఐరాస కమిటీలో

# ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్‌కు చోటు

**40 మంది అంతర్జాతీయ నిపుణులతో కమిటీ ఏర్పాటు**

**గుటెర్రెస్ స్వయంగా సిఫార్సు చేసిన జాబితా**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(జనంసాక్షి) : :** కృత్రిమ మేధ (ఏఐ)పై అంతర్జాతీయ స్థాయిలో స్వతంత్ర శాస్త్రీయ కమిటీని ఏర్పాటు చేయనున్న ఐక్యరాజ్యసమితి 40 మంది నిపుణులను ఎంపిక చేసింది. ఈ జాబితాలో భారత్ నుంచి ఐఐటీ-మద్రాస్ ప్రొఫెసర్ బలరామన్ రవీంద్రన్, అమెరికాలో పనిచేస్తున్న విపిన్ కుమార్ ఉన్నారు. ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ స్వయంగా ఈ నిపుణులను సిఫార్సు చేశారు. మూడేళ్ల పాటు కొనసాగనున్న ఈ కమిటీ.. శాస్త్ర విజ్ఞానాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి ఏఐని ఎలా ఉపయోగించాలో స్వతంత్రంగా సూచనలు చేస్తుంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఆమోదం తర్వాత ఈ కమిటీ మనుగడలోకి వస్తుంది. ఐఐటీ-మద్రాస్‌లో డేటా సైన్స్, కృత్రిమ మేధ విభాగం అధిపతిగా, 'సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ ఏఐ' డైరెక్టర్‌గా పనిచేస్తున్న బలరామన్ రవీంద్రన్ ఎంపిక భారత్‌కు గౌరవంగా నిలుస్తోంది. ఇదిలా ఉంటే.. ఈ నెల 19-20 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న అంతర్జాతీయ ఏఐ శిఖరాగ్ర సభను నిర్వహిస్తున్న భారత్‌ను గుటెర్రెస్ అభినందించారు. తానూ ఆ సభలో పాల్గొంటానని ప్రకటించారు. ఏఐపై అంతర్జాతీయ స్థాయిలో చర్చలు, సూచనలు రూపొందించడంలో భారత్ చొరవ కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.



## ఇరాన్ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం: జైశంకర్

- భారతీయ విద్యార్థులకు ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ
- టెహ్రాన్ ఎంబసీతో నిరంతర టచ్.. అవసరమైన సాయం
- ఇరాన్‌లో 9-10 వేల మంది భారతీయులు.. ఎక్కువగా విద్యార్థులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** ఇరాన్‌లోని పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. అక్కడున్న భారతీయ విద్యార్థులకు ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తున్నామని, వారితో నిరంతరం టచ్‌లో ఉన్నామని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో జైశంకర్ మాట్లాడుతూ.. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఇరాన్‌లో ఉన్న విద్యార్థులతోపాటు అన్ని పౌరులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తూ.. అవసరమైన సమయాల్లో సలహాలు, తగు సాయం అందిస్తోందని వివరించారు.
ఇరాన్ గగనతలం తెరిచి ఉండటం, ఇరు దేశాల మధ్య విమాన సర్వీసులు కొనసాగుతున్న నేపథ్యంలో అక్కడున్న భారతీయులను చిక్కుకుపోయినవారిగా పరిగణించడం లేదని జైశంకర్ స్పష్టం చేశారు. అందుకే ప్రత్యేక తరలింపు ప్రక్రియ చేపట్టడం అవసరం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌లోని 16 రాష్ట్రాల్లో ప్రస్తుతం 9 నుంచి 10 వేల మంది భారతీయులు ఉన్నట్లు జైశంకర్ వెల్లడించారు. వీరిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉండగా.. కార్మికులు, యాత్రికులు, పర్యటకులు, వ్యాపారవేత్తలు, నావికులు కూడా ఉన్నారని తెలిపారు. గగనతలం తెరిచి ఉన్నందున స్వదేశానికి రావాలనుకునే భారతీయులు వాణిజ్య విమానాలతోపాటు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించుకోవచ్చని సూచించారు.

# ఆంథ్రోపిక్ కొత్త ఏఐ టూల్‌కు మార్కెట్ భయం అతిశయోక్తి

- క్లాడ్ కోవర్క్ ప్లగిన్స్ వల్ల సాఫ్ట్‌వేర్ షేర్లు భారీ పతనం
- ఏఐ సాఫ్ట్‌వేర్‌ను మెరుగుపరుస్తుంది తప్ప భర్తీ చేయదు: సుందర్ పిచాయ్
- 285 బిలియన్ డాలర్ల నష్టం.. మార్కెట్ రియాక్షన్ ఓవర్‌బ్లోన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** ఆంథ్రోపిక్ కంపెనీ కొత్తగా విడుదల చేసిన ఏఐ టూల్ 'క్లాడ్ కోవర్క్' ప్లగిన్స్ వల్ల మార్కెట్లలో ఏర్పడిన భయాందోళనలు అతిశయోక్తి అని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. ఏఐ సాఫ్ట్‌వేర్‌ను మెరుగుపరుస్తుంది తప్ప పూర్తిగా భర్తీ చేయదని, దీనిపై మార్కెట్ రియాక్షన్ ఓవర్‌బ్లోన్ అని పేర్కొన్నారు. ఆంథ్రోపిక్ విడుదల చేసిన కొత్త ప్లగిన్స్ ఏఐని మరింత శక్తివంతం చేస్తాయని, సాఫ్ట్‌వేర్, లీగల్ టెక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ స్టాక్స్‌ను ప్రభావితం చేస్తాయన్న భయంతో ఒక్క రోజులోనే సుమారు 285 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కోత పడింది. ఈ నేపథ్యంలో పిచాయ్ స్పందిస్తూ.. ఏఐ ఓ సహాయక సాధనమేనని, ఇప్పటికే ఉన్న సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను మెరుగుపరుస్తుంది తప్ప భర్తీ చేయదని స్పష్టం చేశారు. గూగుల్ సెర్చ్, యూట్యూబ్ లాగా ఏఐ కూడా సపోర్టింగ్ టూల్ మాత్రమేనని అన్నారు.
నివిడియా సీఈవో జెన్సెన్ హువాంగ్ కూడా పిచాయ్ అభిప్రాయానికి ఏకీభావం వ్యక్తం చేశారు. ఏఐ సాఫ్ట్‌వేర్‌ను ఎన్‌హాన్స్ చేస్తుంది తప్ప రీప్లేస్ చేయదని అన్నారు. ఆంథ్రోపిక్ కొత్త టూల్ వల్ల మార్కెట్లలో ఏర్పడిన భయాన్ని ఇద్దరు టెక్ దిగ్గజాలు కొట్టిపారేశారు.
ఆంథ్రోపిక్ క్లాడ్ మోడల్‌కు జోడించిన కొత్త ప్లగిన్స్ ఏఐని మరింత సమర్థవంతంగా చేస్తాయన్న ఆందోళనలు మార్కెట్లలో వ్యాపించాయి. అయితే పిచాయ్, హువాంగ్ వ్యాఖ్యలతో మార్కెట్ కొంత ఊరట పొందినట్లు కనిపిస్తోంది. ఏఐ భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీని మార్చనున్నా ఇప్పటి రియాక్షన్ అతిశయోక్తేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పులి దాడి.. ప్రతీకార హత్యా?

- కానిస్టేబుల్‌పై పులి దాడి.. మృతదేహాన్ని తిన్న పులి
- రెండు రోజుల తర్వాత ఆడపులి బుల్లెట్ గాయాలతో మృతి

**ఇటానగర్, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** అరుణాచల్ ప్రదేశ్‌లో దారుణ ఘటనలు నమోదయ్యాయి. దిగువ దిబాంగ్ వ్యాలీ జిల్లా మయోడియా ప్రాంతంలో సోమవారం సాయంత్రం హెడ్ కానిస్టేబుల్ చిక్సెంగ్ మన్యాంగ్ బైకుపై వెళ్తుండగా పులి దాడి చేసి చంపేసింది. మంగళవారం ఉదయం అతడి మృతదేహం లభ్యమైంది. సగం మృతదేహాన్ని పులి తినేసినట్లు గుర్తించారు. ఈ దారుణానికి తీవ్రంగా ఆగ్రహించిన స్థానికులు పులిని బంధించాలని, అంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు బయటకు రావొద్దని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇదే ప్రాంతంలో గురువారం అటవీ శాఖ అధికారులు ఒక ఆడపులి మృతదేహాన్ని గుర్తించారు. బుల్లెట్ గాయాలతోనే ఆ పులి మరణించినట్లు తేలింది. కానిస్టేబుల్ మరణానికి ప్రతీకారంగా ఎవరైనా పులిని కాల్చి చంపారా అనే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాడి చేసింది ఇదే పులా లేక మరోటా అనేది కూడా స్పష్టం కాలేదు. ఏదేమైనా అటవీ అధికారుల నిర్లక్ష్యం, మనుషుల చర్యల వల్ల అటవీ జంతువులకు నివాసం కరువై మనిషి-జంతు సంఘర్షణ పెరిగిపోతోందని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఘటనపై పోలీసులు, అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. దాడి వెనుక కారణాలు, పులి మరణంపై దర్యాప్తు కొనసాగుతోంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 514 | ₹ 61.68 |
| వరంగల్ | ₹ 492 | ₹59.04 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

₹1,58,000 (24 క్యారెట్లు) | ₹1,39,650 (22 క్యారెట్లు)

చెన్నై

₹1,41,200 (22 క్యారెట్లు) | ₹1,54,841 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹2,60,000

# వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణకు 45 రోజుల సెలవు

**60 ఏళ్లు పైబడిన తల్లిదండ్రుల చూపుకోవడానికి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు సెలవులు**

**రాజ్యసభ జీరో అవర్‌లో యూపీ ఎంపీ సుమిత్ర బల్మిక్ ప్రస్తావన**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** 60 ఏళ్లు పైబడిన వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగులకు 45 రోజుల సెలవులు మంజూరు చేయాలని ఉత్తరప్రదేశ్ ఎంపీ సుమిత్ర బల్మిక్ కేంద్రాన్ని కోరారు. రాజ్యసభ జీరో అవర్‌లో ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు.
ప్రభుత్వం మహిళలు, యువతీ యువకుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని, అయితే 2026లో భారత్ అత్యధిక యువశక్తి కలిగి ఉన్నప్పటికీ వృద్ధుల సంఖ్య 14.09 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. 2036 నాటికి ఈ సంఖ్య 23 కోట్లకు మించిపోతుందని, త్వరలో ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరు వృద్ధులుంటారని తెలిపారు. వేగవంతమైన పట్టణీకరణ, ఉద్యోగ అవకాశాలతో కోట్ల మంది యువతీ యువకులు తల్లిదండ్రులను, ఇంటిని వదిలి వెళ్తున్నారని సుమిత్ర బల్మిక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో పెద్దవారికి వైద్య సహాయం అవసరమవుతుందని, వారిని దగ్గరుండి కూతురో కొడుకో చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వృత్తి బాధ్యతల నేపథ్యంలో తరచూ సెలవు తీసుకోలేని స్థితి ఉందని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 60 ఏళ్లు పైబడిన వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణకు ఉద్యోగులకు 45 రోజుల సెలవులు మంజూరు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు సుమిత్ర బల్మిక్ తెలిపారు.

# ఆప్ నేత లక్కీ ఒబ్రాయ్ హత్య

**జలంధర్‌లో గురుద్వారా వద్ద థార్ వాహనం పార్క్ చేస్తుండగా గన్ కాల్పులు**

**జలంధర్, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** ఆమ్ ఆద్మీ పార్టీ నేత లక్కీ ఒబ్రాయ్‌ను గురువారం గన్‌మెన్‌లు కాల్చి చంపారు. జలంధర్ సిటీలోని మోడల్ టౌన్ ప్రాంతంలో గురుద్వారా వద్ద ఈ దారుణ ఘటన జరిగింది. తీవ్ర గాయాలతో ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు కాపాడలేకపోయారు.
రోజువారీలా గురుద్వారాకు వెళ్లిన ఒబ్రాయ్ తన థార్ వాహనంలో చేరుకున్నారు. వాహనాన్ని పార్క్ చేస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు టూవీలర్‌పై వచ్చి అతనిపై కాల్పులు జరిపారు. ఒబ్రాయ్ రోజూ గురుద్వారాను సందర్శిస్తుంటారని జలంధర్ కంటోన్మెంట్ ఇంచార్జ్ రాజ్‌విందర్ తియారా తెలిపారు. అతని కదలికలు తెలిసిన వ్యక్తులే దాడికి ప్లాన్ చేసినట్లు అనుమానిస్తున్నారు. దాడి వెనుక కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రికవరీ ఏజెంట్ల అరాచకాలకు చెక్.. ఆర్‌బీఐ కొత్త రూల్స్

- బ్యాంకులు ఏజెంట్ల ప్రవర్తనకు నేరుగా బాధ్యత వహించాలి
- మిస్‌సెల్లింగ్, రికవరీ ఏజెంట్లపై కఠిన మార్గదర్శకాలు
- డిజిటల్ మోసాల్లో రూ.25 వేల వరకు పరిహారం
- వినియోగదారుల రక్షణే ప్రధాన లక్ష్యం



**హైదరాబాద్, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** లోన్ రికవరీ ఏజెంట్ల దురుసు ప్రవర్తన, బెదిరింపులు, బలవంతపు వసూళ్లకు అడ్డుకట్ట వేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంచలన నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకున్న వినియోగదారులకు వేధింపుల నుంచి ఉపశమనం కల్పించేలా కొత్త మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు.
దేశవ్యాప్తంగా రికవరీ ఏజెంట్ల అక్రమ పద్ధతులపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారుల రక్షణే ధ్యేయంగా ఆర్‌బీఐ ఈ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏజెంట్ల తీరుపై బ్యాంకులను నేరుగా బాధ్యులను చేస్తూ కొత్త డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్ తీసుకొస్తోంది. మూడు కీలక మార్గదర్శకాలు రూపొందించనున్న ఆర్‌బీఐ.. మొదటిది ఆర్థిక ఉత్పత్తుల మిస్‌సెల్లింగ్ అరికట్టడం. రెండోది లోన్ రికవరీ ఏజెంట్ల నియామకం, పనితీరును నియంత్రించడం. మూడోది అనధికారిక ఎలక్ట్రానిక్ లావాదేవీల వల్ల కస్టమర్లకు కలిగే నష్టాన్ని పరిమితం చేయడం. డిజిటల్ మోసాలకు గురైన సామాన్యులకు భరోసా ఇస్తూ చిన్న విలువైన మోసపూరిత లావాదేవీల్లో నష్టపోయినవారికి రూ.25 వేల వరకు పరిహారం అందించే సరికొత్త విధానాన్ని ప్రతిపాదించింది.
ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం రికవరీ ఏజెంట్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల మధ్య మాత్రమే కస్టమర్లకు ఫోన్ చేయవచ్చు లేదా కలవవచ్చు. శారీరక హింస, అసభ్య పదజాలం, ఇరుగుపొరుగు లేదా బంధువులకు లోన్ వివరాలు వెల్లడించడం పూర్తిగా నిషేధం. అయినప్పటికీ గ్రౌండ్ లెవల్‌లో ఈ రూల్స్ అమలు కాకపోవడంతో ఆర్‌బీఐ పర్యవేక్షణను మరింత కఠినతరం చేస్తోంది. ఇకపై ఏజెంట్ల ప్రవర్తనలో లోపాలుంటే అది బ్యాంక్ వైఫల్యంగానే పరిగణిస్తారు.
సీనియర్ సిటిజన్ల వంటి సున్నిత వినియోగదారులకు డిజిటల్ చెల్లింపుల భద్రత పెంచేందుకు ఎక్స్‌ట్రా అథెంటికేషన్, క్రెడిట్ ఆలస్యం వంటి అంశాలపై చర్చా పత్రం విడుదల చేయనుంది. లోన్ తీసుకున్నవారిని గౌరవప్రదంగా చూడాలని, అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆర్‌బీఐ స్పష్టం చేస్తోంది. ఈ సంస్కరణలు లక్షలాది మంది సామాన్యులకు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించడమే కాకుండా బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచనున్నాయి. ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్న సామాన్యులకు ఆర్‌బీఐ తీపి కబురు అందించింది. ఫిబ్రవరి 6న జరిగిన మానిటరీ పాలసీ సమావేశం తర్వాత ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కకీలక నిర్ణయాన్ని ప్రకటించారు. చిన్న మొత్తంలో జరిగే ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి బాధితులకు రూ.25వేల వరకు పరిహారం చెల్లించేలా కొత్త రూల్స్ తీసుకురానున్నట్లు చెప్పారు. డిజిటల్ పేమెంట్స్ భద్రతను పెంచడం, కస్టమర్ల ప్రయోజనాలను రక్షించడమే లక్ష్యంగా ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు.

## రోడ్డుపై గుంతలోపడి బ్యాంకు మేనేజర్ మృతి

**ముగ్గురు ఇంజనీర్లపై సస్పెన్షన్ వేటు**

**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో నడిరోడ్డుపై గుంతలో పడి బ్యాంకు మేనేజర్ మృతిచెందిన ఘటనలో కీలక అప్డేట్..ఈఘటనకు బాధ్యులుగా ముగ్గురు ఇంజనీర్లను సస్పెండ్ చేశారు అధికారులు. ఢిల్లీలోని జనక్ పురి ప్రాంతంలో నీటిపైపులైన్ కోసం తవ్వి వదిలేసిన గుంతలో పడి మోటరిస్ట్ (బ్యాంకుమేనేజర్)చనిపోయిన క్రమంలో ఢిల్లీ జల్ బోర్డు కు చెందిన ముగ్గురు ఇంజనీర్లను ప్రభుత్వం శుక్రవారం (ఫిబ్రవరి 6) సస్పెండ్ చేసింది. గురువారం ఉదయం ఢిల్లీలోని రోహిణి ఏరియాకు చెందిన బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న కమల్‌అనే జనక్ పురి ప్రాంతంలో నడిరోడ్డుపై తవ్వి వదిలేసిన గుంతలో పడి చనిపోయాడు. విధులు ముగించుకొని రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే తీవ్రగాయాలతో రాత్రంతా గుంతలో పడివున్న బ్యాంకు మేనేజర్ ఫిబ్రవరి 6న ఉదయం శవమై కనిపించాడు.

# డిజిటల్ విద్య అందరికీ అవసరం


- ఓయూ వీసీ ప్రొ. మొలుగురం కుమార్
- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆన్‌లైన్ విద్యపై దృష్టి సారించాలి
- ఓయూలో కోహా ఆధారిత రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆన్‌లైన్-డిజిటల్ విద్య అందరికీ అవసరమని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మొలు గురం కుమార్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ దిశగా దృష్టి సారించాలని సూచించారు. యూనివర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కోహా (ఓపెన్ సోర్స్ ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్) పేరిట రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభించారు. డాక్టర్ విజయ్ కుమార్ మిడతనపల్లి సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ ఉపకరణాలు, మొబైల్ ఫోన్లను ఓపికతో ఉపయోగించుకోవాలని, అప్పుడే అవసరమైన సమాచారం, విజ్ఞానం పొందవచ్చని ఆయన సూచించారు. సరైన, విలువైన సమాచారం పొందడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. యూనివర్సిటీలో నాణ్యమైన బోధనతోపాటు క్వాలిటీ పరిశోధన పత్రాలను ప్రపంచస్థాయి జర్నల్స్‌లో ప్రచురించుకోవాలని విద్యార్థులు, అధ్యాపకులకు సూచించారు. రీసెర్చ్ ఆర్టికల్స్‌కు వచ్చే సైటేషన్స్ యూనివర్సిటీకి, సంబంధిత వ్యక్తులకు పేరు తెచ్చిపెడతాయని వివరించారు. హెచ్ ఇండెక్స్, జి ఇండెక్స్, ఐ ఇండెక్స్, క్యూ ఇండెక్స్, ఈ ఇండెక్స్, ఎం ఇండెక్స్ వంటివి పరిశోధన పత్రాల క్వాలిటీని తెలియజేస్తాయని చెప్పారు. తమ పరిశోధనల ద్వారా పేటెంట్లు సాధించుకోవాలని సూచించారు.
ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, వర్క్‌షాప్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి. కాసిం మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యా విధానంలో వస్తున్న మార్పులకు తగినట్లు సిద్ధం కావాలని విద్యార్థులు, అధ్యాపకులకు సూచించారు. అరచేతిలో ఉన్న మొబైల్ ద్వారా అనేక అంశాలు పొందవచ్చని చెప్పారు. కళాశాలలో తరగతులు రెగ్యులర్‌గా నిర్వహిస్తూనే సదస్సులు, వివిధ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకులను ప్రోత్సహిస్తున్నా మని వివరించారు. డాక్టర్ లక్ పతి ముగింపు ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లైబ్రరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్. లక్ష్మణరావు, కార్యశాల కన్వీనర్ డాక్టర్ జె. వివేకవర్ధన్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ విజయ్ కుమార్ మిడతనపల్లి, డాక్టర్ లక్ పతి తదితర అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇష్టం లేకుండా గర్భం కొనసాగించమంటే నేరమే

- మహిళల సంతానోత్పత్తి స్వతంత్ర హక్కును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- 30 వారాల గర్భవిచ్ఛిత్తికి అనుమతి.. ముంబై హైకోర్టు ఆదేశాలు కొట్టివేత
- మైనర్‌గా గర్భవతైన యువతి కేసులో కీలక తీర్పు : సుప్రీంకోర్టు
- వైద్య నివేదిక ఆధారంగా ప్రమాదం లేదని స్పష్టం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(జనంసాక్షి) :** మహిళల సంతానోత్పత్తి స్వతంత్ర హక్కును సమర్థిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించా లని ఏ మహిళను ఒత్తిడి చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. మైనర్‌గా గర్భవతైన ఓ యువతి 30 వారాల గర్భాన్ని తొలగించేందుకు శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ముంబై హైకోర్టు నిరాకరించిన అనుమతిని జస్టిస్ బీవీ నాగరత్న సారథ్యంలోని ధర్మాసనం కొట్టివేసింది.
మహారాష్ట్రకు చెందిన ఆ బాలిక తన బాయ్‌ఫ్రెండ్‌తో సంబంధం కారణంగా కొన్ని నెలల క్రితం గర్భవతైంది. అప్పటికి ఆమె వయసు 17 ఏళ్లు. ప్రస్తుతం 18 ఏళ్లు నాలుగు నెలలు. 30 వారాల గర్భిణిగా ఉన్న ఆమె గర్భాన్ని కొనసాగించాలని కోరుకోవడం లేదంటూ ముంబై హైకోర్టును ఆశ్రయించింది. అయితే మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం గడువు మించిపోయిందంటూ హైకోర్టు ఆమె విజ్ఞప్తిని తిరస్కరించింది. దీంతో ఆ యువతి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపిస్తూ.. గర్భాన్ని కొనసాగించాలని ఒత్తిడి చేస్తే సామాజిక కళంకం తలెత్తే అవకాశం ఉండవచ్చని, దాని వల్ల ఆమె మానసిక ఆందోళనకు గురవుతుందని పేర్కొన్నారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. గర్భవిచ్ఛిత్తి నిర్ణయం ఆలస్యమైనప్పటికీ అప్పీలుదారు హక్కును తప్పనిసరిగా పరిరక్షించాలని స్పష్టం చేసింది. ఆమె ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలనడం చట్టవిరుద్ధమని పేర్కొంది. గర్భవిచ్ఛిత్తి చేయించినా ఆమెకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకున్నట్టు ధర్మాసనం తెలిపింది. యువతి నుంచి లిఖితపూర్వక అండర్‌టేకింగ్ తీసుకో వాలని, గర్భవిచ్ఛిత్తికి వైద్యులను అనుమతిస్తున్నట్టు తీర్పు వెలువరించింది.

## ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా చర్యలు

### ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినగర్‌లోని పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్సైలు, సీఐలు,ఏసీపీలు, డీసీపీతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించి అవసరమైన ఆదేశాలు,సూచనలు జారీ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని,ప్రతి ఓటరు ఎలాంటి భయం,ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించా రు. ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్సై లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యం



డాక్టర్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**రాయికల్, జనంసాక్షి :** రాయికల్ మండలం ఆలూరు,రాజ్ నగర్ గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు కాగా శుక్రవారం రోజున భూమిపూజ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్.మహిళలు ఆర్థికంగా, సామాజి కంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించా రు. గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, విద్యారంగం, వైద్య రంగం మహిళా సంక్షేమా నికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని అన్నారు.అధికార పార్టీ అండతో అభివృద్ధి సాధ్యం అవుతుంది అన్నారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.గ్రామలలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో మహిళా సంఘాల శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వానికి ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.మహిళలకు గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు సర్పంచులు నల్లాల స్వామి,భారతపు రాజేష్,ఉప సర్పంచ్‌లు సల్ల మహేష్,శ్రీనివాస్,మండల నాయకులు రవీందర్ రెడ్డి,కోల శ్రీనివాస్,మోర హనుమండ్లు, గన్నెరాజిరెడ్డి భాస్కర్ రావు సురేందర్ రెడ్డి రామ్ రెడ్డి ఆయా గ్రామ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బిఆర్ఎస్‌కు ఓటు వేస్తే మురుగు కాలువలో వేసినట్లే..

### ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ గడప గడప ప్రచారాలు నిర్వహిస్తు స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు.వేములవాడలోని కోరుట్ల బస్ స్టాండ్ ప్రాంతంలోని 12వ వార్డు రామతీర్థపు కృష్ణవేణి ,14 వ వార్డు తూము మధు, 25 వార్డు కొక్కుల బాలకృష్ణ లకు మద్దతుగా కార్నర్ మీటింగ్లో పాల్గొన్నారు.4 వార్డులో తోట రాజు,16 వార్డులో కూరగాయలు శ్రీశైలం,18 వార్డులో కొండ రాజా శేఖర్,19 వార్డులో సూగురీ లక్ష్మీ లకు మద్దతుగా గడప గడపకు ఎన్నికల ప్రచారం చేపట్టారు.అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బారి మెజారిటీతో గెలిపించండని ఓటర్లను కోరారు. బీజేపీ, బిఆర్ఎస్ కు ఓటు వేస్తే మురుగు కాలువ లో వేసినట్లే అన్నారు.మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీకి ఇవ్వాలన్నారు.గత పది సంవత్సరాలలో చేయని గాలికి వదిలేసిన పనులు మీ బిడ్డగా నేను చేస్తున్నా అన్నారు.గతంలో బీజేపీ,బిఆర్ఎస్ కు ఇస్తే వారు వేములవాడను వెనకకి నెట్టేసి అభివృద్ధి కుంటు పడేలా చేశారన్నాడు. వారు గెలిస్తే నిధులు ఎక్కడినుండి తెస్తారని అయన ప్రశ్నించారు.కేవలం ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే వారు వస్తారని,గతంలో పది సంవత్సరాలు అధికారంలో ఉండి తిప్పపూర్ బ్రిడ్జి కట్టలేదని, రాజన్న గుడినీ అభివృద్ధి చేయలేదన్నారు.ఆ రెండు పార్టీల వలన మన ప్రాంతానికి ఏం లాభం లేదన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ఓటర్లందరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అయన వెంట అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చొప్పదండిలో సీఎం సభ అట్టర్‌ఫ్లాప్

- బండి సంజయ్‌కు భయపడి కరీంనగర్‌లో సభ నిర్వహించలేదు
- ప్రసంగంలో పసలేకుండా ప్రజలు వెళ్లిపోయారు : సుంకే రవిశంకర్
- రెండేళ్లలో నియోజకవర్గానికి నిధులు గుండు సున్నా
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



**చొప్పదండి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** గుమ్లాపూర్‌లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం పేరిట నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ విమర్శించారు. చొప్పదండిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కు భయపడి ముఖ్యమంత్రి కరీంనగర్‌లో సభ నిర్వహించకుండా చొప్పదండిలో ఏర్పాటు చేశారని ఆరోపించారు. గుమ్లాపూర్ సభలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పేర్లు లేకుండా మాట్లాడి మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగానే పసలేకుండా ప్రజలు వెళ్లిపోవడం సిగ్గుచేటని అన్నారు. రెండేళ్లలో చొప్పదండి నియోజకవర్గానికి తెచ్చిన నిధులు గుండు సున్నా అని విమర్శించారు. తన హయాంలో ప్రారంభించిన పనులను ఇప్పటికీ పూర్తి చేయని ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. కొండగట్టు అభివృద్ధి, నారాయణపూర్ రిజర్వాయర్ పూర్తి కోసం స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరినా ప్రస్తావించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, రైతు భీమాను మరింత పెంచి ఇస్తానని చెప్పినా రెండేళ్లు గడుస్తున్నా ఇయ్యని రేవంత్ మోసపూరిత వాక్యాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.
మూడు నెలల క్రితం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనులనే మళ్లీ సీఎం శంకుస్థాపన చేయడం విడ్డూరమని విమర్శించారు. ఢిల్లీలో బడా బాయ్–చోటా బాయ్ ప్రేమలు, ఇక్కడ ఓట్ల కోసం తిట్టుకోవడం కాంగ్రెస్–బీజేపీలకే చెల్లుతుందని పేర్కొన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లతో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, చొప్పదండిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్–బీజేపీలు అన్నదమ్ముల్లా కలిసి బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. గుమ్లాపూర్ సభలో సీఎం 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని మోసపూరిత వాక్యాలు చెప్పడం సరికాదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో నోటిఫికేషన్‌లు వచ్చిన ఉద్యోగాలే ఇచ్చారని, కొత్త నోటిఫికేషన్ ఏమీ లేదని అన్నారు. రెండేళ్లలో ఒక్క మున్సిపాలిటీకి ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదని, స్కాములు పెరిగాయి తప్ప అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం చోట్ల బీఆర్‌ఎస్ గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.
సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఆరెళ్ల చంద్రశేఖర్ గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య–వినయ్ కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తిని సంపత్, నాయకులు నలుమాచు రామకృష్ణ, గొల్లపల్లి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీలకు మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పండి

- ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలి
- దొంగ మాటలతో మోసం చేస్తున్న కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ కేటీఆర్
- తెలంగాణకు ఏమీ చేయని బీజేపీపై తీవ్ర విమర్శలు
- బీఆర్ఎస్‌కు ఓటు వేసి పేదల గుర్తును చాటండి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. వేములవాడలో ఎన్నికల ప్రచారంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన రెండు పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ దొంగ మాటలతో అధికారంలోకి వచ్చి అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సమయంలో బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పినా ఏమీ చేయలేదని ఆ బాండ్ పేపర్‌ను ప్రజల ముందు చూపించారు.
'ఓటు వేయకుంటే చనిపోతాను' అంటూ సానుభూతి డైలాగులతో మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్ మంత్రి పదవి కోసం రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గానికి ఏమీ చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలలో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మోసాలకు అనుమతి ఇచ్చినట్లేనని, భవిష్యత్తులో హామీల అమలుపై దృష్టి పెట్టే అవకాశం ఉండదని హెచ్చరించారు. ఆసరా పెన్షన్ రూ.4 వేలు, రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం వంటి హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా తెలంగాణకు ఏమీ చేయలేదని విమర్శించారు. ప్రతి ఇంటికి రూ.15 లక్షలు ఇస్తానని చెప్పిన మోదీ హామీలను పక్కన పెట్టారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో దేవుడు, కులం, మతం పేరుతో బీజేపీ ఓట్లు వేయించుకుంటోందని విమర్శించారు. పేదల కడుపు నింపి తెలంగాణ తెచ్చిన వారిని గుర్తుచేసుకుని బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెడితేనే ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి సారిస్తుందని అన్నారు. ప్రచార కార్యక్రమంలో మున్సిపాలిటీ అభ్యర్థులు, నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐటీఐ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే విజయరమణరావు మార్నింగ్ వాక్



**పెద్దపల్లి,ఫిబ్రవరి 06(జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మార్నింగ్ వాక్ చేసిన పెద్దపల్లి శాసన సభ్యుడు చింతకుంట విజయరమణరావు అనంత రం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు (బంధంపల్లి)లో కాంగ్రెస్ అభ్యర్థి పురేళ్ల సుధాకర్, 5వ వార్డులో గుజ్జుల కుమార్‌లకు మద్దతుగా గడపగడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ప్రజలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో జరుగు మహాశివరాత్రి జాతర 2026 ఉత్సవాలకు శుక్రవారం ఎండోమెంట్ అధికారులు డివిజన్ అధికారులను, పోలీస్ అధికారులను ఆహ్వానించారు. ఈ మేరకు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణలను ఆహ్వానించారు.

## శివరాత్రికి చేస్తున్న ఏర్పాట్ల పరిశీలన

- భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు ఉండాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** వేములవాడలో ఈనెల 14,15 16వ తేదీల్లో జరగనున్నమహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో శుక్రవారం ఆమె పరిశీలించారు. ముందుగా వీఐపీ దర్శనాల కోసం చేసిన ప్రత్యేక ద్వారం,బారికేడింగ్‌ను పరిశీలించి ఆలయ ఈఈ రాజేష్‌కు పలు సూచనలు చేశారు.క్యూ లైన్లను పరిశీలించి,ఎక్కువ చోట్ల తాగునీటి పాయింట్లు పెట్టి భక్తులకు అందించాలన్నారు. బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణము వద్ద ఉన్న ఖాళీ స్థలంలో స్వామివారి ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు,మొబైల్ టాయిలెట్ల సంఖ్య మరింత పెంచాలన్నారు.మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేసి జాతరను వైభవం గా నిర్వహించాలన్నారు. పార్కింగ్ స్థలం వద్ద కోడెల టికెట్ కౌంటర్,పందిర్లు,శివార్చన స్టేజీలను పరిశీలించారు. మహా శివరాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం ఘనంగా నిర్వహించా లని ఆదేశించారు.ఆమె వెంట అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ రాధాభాయి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్,తహసీల్దార్ జయంత్ కుమార్,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## సృజనాత్మకత, దేశభక్తితో కలిసిన చోటే భవిష్యత్తు ఆవిర్భవిస్తుంది

- సృజనాత్మకత, దేశభక్తి సమన్వయంతో చిన్నారుల ప్రతిభా ప్రదర్శన
- దేశ విజయాలు, సంస్కృతి, జాతీయ చిహ్నాలపై ఆకట్టుకున్న నృత్యాలు, నాటికలు
- విద్యకు వేదికగా, ప్రతిభకు ప్రతీకగా నిలిచిన పాఠశాలగా ప్రశంసలు
- ఛైర్మన్ డా. సుధాకర్ రావు పోల్సాని నేతృత్వంలో అపూర్వ వైభవం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 06 (జనంసాక్షి):**
జగిత్యాల రోడ్డులోని వివేకానంద రెసిడెన్షియల్ (సీబీఎస్ఈ) పాఠశాల 43వ వార్షికోత్సవ వేడుకలు 'అవిష్కర్' పేరిట అపూర్వ వైభవంతో, అట్టహాసంగా జరిగాయి. సీబీఎస్ఈ గెస్ట్ ఆఫ్ హానర్ డా. రఘు రామన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఛైర్మన్ డా. సుధాకర్ రావు పోల్సాని, సెక్రటరీ రమాదేవి పోల్సాని, అకడమిక్ డైరెక్టర్ డా. టి. లలితా కుమారి నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలు విద్యార్థుల సృజనాత్మకతకు, దేశభక్తికి అద్దం పట్టాయి.
దీపప్రజ్వలన, ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. అతిథులను వేదికపైకి ఆహ్వానించి మొక్కలు అందజేశారు. ఛైర్మన్ డా. సుధాకర్ రావు, అకడమిక్ డైరెక్టర్ డా. టి. లలితా కుమారి, ప్రిన్సిపాల్ ప్రసంగాలు విద్యార్థులకు నూతన ఉత్సాహాన్ని నింపాయి. పుస్తకాలకే పరిమితం కాని విద్యే నిజమైన విద్య అని, ఇలాంటి వేడుకలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని గెస్ట్ ఆఫ్ హానర్ డా. రఘు రామన్ పాఠశాల కృషిని హృదయపూర్వకంగా ప్రశంసించారు.
విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల హృదయాలను తాకాయి. తెనాలి రామకృష్ణ, భక్త ప్రహ్లాద నాటికలు సమాజానికి చైతన్యం నూరిపోయాయి. దేశభక్తి, పండుగలు, భారతదేశ విజయాలు, జాతీయ చిహ్నాలపై నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డాండియా, జానపద గీతాలు, విద్యాదేవి సరస్వతికి అంకితమైన నృత్యాలు భారతీయ సంప్రదాయాన్ని ఆధునిక భావాలతో కలిపి చూపించాయి. ప్రతి ప్రదర్శన విద్య, సాంకేతికత, సంస్కృతి రంగాల్లో ఎదుగుతున్న భారత విజయాలను ప్రతిబింబించింది.
చిన్నారులు తమ అంతర్లీన ప్రతిభను నిర్భయంగా, నిస్సంకోచంగా ప్రదర్శించారు. వారి ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ వార్షికోత్సవం పాఠశాల ప్రతిష్ఠను మరో మెట్టు ఎత్తింది. ఇది విద్యార్థుల ప్రతిభకు వేదిక మాత్రమే కాదు, ఉపాధ్యాయుల అంకితభావం, కృషి ఫలితమని అకడమిక్ డైరెక్టర్ డా. టి. లలితా కుమారి పేర్కొన్నారు. విజయవంతం చేసిన తల్లిదండ్రులు, విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
పాఠశాల సలహాదారు డా. గంద్ర లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయురాలు రేణుక బలివాడ పాల్గొన్నారు. ఛైర్మన్, డైరెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించగా, తల్లిదండ్రులు పిల్లల ప్రతిభపై గర్వం వ్యక్తం చేశారు. సృజనాత్మకత, ఆవిష్కరణ, దేశభక్తి సమన్వయంతో నడిచిన ఈ వేడుక భవిష్యత్ భారతాన్ని నిర్మించే చిన్నారుల ప్రతిభకు అద్భుత వేదికగా నిలిచింది.

## ఆసక్తికరంగా వేములవాడ మున్సి"పోల్"ఎన్నికలు

- ప్రధాన పార్టీల హోరా హోరి ప్రచారం..
- పుర పీఠం ఎవరిని వరించేనో..!



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :**
వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయాలు రోజురోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. మూడు ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా ముమ్మర ప్రచారం కొనసాగిస్తున్నాయి. పలు వార్డుల్లో బరిలో ఉన్న ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రధాన పార్టీ అభ్యర్థులకు ధీటుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రధాన పార్టీల నుంచి టికెట్ రాని వారు రెబల్‌గా బరిలో వున్నారు. ఎలాగైనా ఎన్నికలలో గెలవాలని ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ గెలవకపోయినా తమకు టికెట్ దక్కకుండా చేసిన అభ్యర్థులను ఓడించాలనే లక్ష్యంతో బరిలో వున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ నుండి నగర పంచాయతీగా మారిన క్రమంలో మొదటిసారి బీజేపీ జెండా ఎగురవేయగా, ఆ క్రమంలో మున్సిపల్‌గా అప్ గ్రేడ్ కాగా రెండోసారి బీఆర్ఎస్ చైర్పర్సన్ దక్కించుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన అధికార పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టు నిలుపు కోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. కాగా వేములవాడ ఓటర్లు ఎవరు వైపు మొగ్గు చూపుతారో ఈనెల 13 వరకు వేచి చూడాల్సిందే.

**అభివృద్ధి, సంక్షేమంతో అధికార పార్టీ..**
మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకొని మున్సిపల్ కార్యాలయంపై మొదటి సారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గడప గడపకు తిరుగుతూ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పట్టణంతో పాటు రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రచార అస్త్రంగా మలుచుకున్నారు. దీంతో పాటు పట్టణంలో చేస్తున్న అభివృద్ధి పనులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ఓటర్లకు వివరిస్తున్నారు.కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కొరకు తన వంతు కృషి చేస్తున్నారు. టికెట్ రాని వారితో మాట్లాడుతూ రానున్న రోజులలో అవకాశాలు వుంటాయని చెపుతూ అందరి సహకారంతో మున్సిపల్ జెండా ఎగుర వేసేందుకు పక్క ప్రణాళికలతో ప్రచారం చేస్తున్నారు.

**పట్టు నిలుపుకునేందుకు బీఆర్ఎస్ ఆరాటం..**
మున్సిపల్ ఎన్నికల్లో రెండో సారి పీఠం కైవసం చేసుకోని పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్ ఆరాట పడుతుంది.మరోసారి మున్సిపల్‌లో జెండా ఎగుర వేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. అధికార పార్టీలో,ఇతర పార్టీలలో టికెట్ ఆశించి నిరాశ పడిన వారిని మచ్చిక చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.పదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

**ఆధిపత్య పోరే అడ్డంకా..**
వేములవాడ బాజపాలో నాయకుల మధ్య గ్రూపు తగదాలు,వర్గ పోరుతో క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీలోని ఇద్దరు కీలక నాయకులు వికాస్ రావు, ప్రతాప రామకృష్ణల మధ్య గ్రూప్ తగదాలు కొనసాగుతున్నయి.దీనికితోడు జిల్లా అధ్యక్ష ఎన్నిక తోడైంది అని కార్యకర్తలు చర్చించు కుంటున్నారు.వీరి మధ్య వర్గ పోరు తారా స్థాయికి చేరడంతో నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందు తున్నారు.ఎన్నికల నోటిఫికేషన్ ముందు వరకు ఎవరికి వారే అన్నట్టుగా ఉన్నప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో నాయకులు ఏకతాటి పైకి వచ్చారు. అయినప్పటికీ సమస్య సమసి పోలేదని కార్యకర్తలు మాట్లాడుకుంటున్నారు. అధ్యాత్మిక క్షేత్రంలో గ్రామ పంచాయతీ నుండి నగర పంచాయతి,మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయ్యేంత వరకు బాజపాకు గట్టి పట్టు ఉండేది.గ్రామ పంచాయతి నుండి నగర పంచాయతీగా మారిన క్రమంలో జరిగిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను సాధించి వేములవాడ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలో ఎక్కడ కూడ బిజెపి లేకపోయినా వేములవాడలో మాత్రం పటిష్ఠంగా ఉందని నిరూపించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ మాత్రం వేములవాడ మున్సిపల్ కైవసం చేసుకోవాలని గట్టి పట్టుతో వున్నారు. నాయకులు సమన్వయంతో పనిచేసి కార్యకర్తలకు బరోసా ఇస్తే బీజేపీ గట్టి పోటీ ఇస్తుంది.



## నిజాం షుగర్స్ విషయంలో మాట తప్పిన బీఆర్ఎస్, కాంగ్రెస్

### బోధన్ మున్సిపల్ ఎన్నికలలో ఎంఐఎం విజయం : ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

**బోధన్, ఫిబ్రవరి 6 ( జనంసాక్షి ) :** బోధన్ నిజాం షుగర్స్ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ లు మాట తప్పడంతో పాటు ఫ్యాక్టరీ కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. శుక్రవారం బోధన్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎంఐఎం అభ్యర్థుల విజయానికి పట్టణంలోని వార్డులలో ప్రచారం నిర్వహించడంతో పాటు రాత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోధన్ పట్టణంలో అనేక సమస్యలు నెలకొన్నాయని సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యాలు చెందాయన్నారు. మరి ముఖ్యంగా ఆసియా ఖండంలోని ప్రసిద్ధిగాంచిన బోధన్ చక్కెర ఫ్యాక్టరీ విషయంలో గత ప్రభుత్వాలు కార్మికులతో పాటు రైతులను సైతం మోసం చేశాయన్నారు. అయితే మున్సిపల్ ఎన్నికలలో తాము బరిలో ఉన్న అన్ని వార్డులను గెలుచుకొని బోధన్ మున్సిపాలిటిపై ఎంఐఎం జెండాను ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో నెలకొన్న ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, రోడ్లు డ్రైనేజీలపై ఎంఐఎం అభ్యర్థులు విజయం సాధించిన తర్వాత వాటిని సాధిస్తారని అయితే ప్రజలు అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అసదుద్దీన్ ఓవైసీ కోరారు. ఈ కార్యక్రమంలో బోధన పట్టణ ఎంఐఎం అధ్యక్షులు మీర్ ఇలియాస్ అలీ, ఎంఐఎం అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాల్లో 90 శాతం వైద్య సేవలు

- ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ
- మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రి ని రీజినల్ క్యాన్సర్ కేర్ హబ్ గా తీర్చిదిద్దబోతున్నాం
- మున్సిపాలిటీలలో ఏ వార్డుకు వెళ్లిన ప్రజల నుంచి మంచి స్పందన ఉంది
- షాద్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి



**షాద్‌నగర్ (జనంసాక్షి):** షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలతో మంత్రి దామోదర్ రాజనర్సింహ కలసి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టమన్నారు. అదే మున్సిపాలిటీకి విజయం అందిస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. శుక్రవారం షాద్ నగర్ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి ఎన్నికలపై మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 75 నుంచి 80% సీట్లు కాంగ్రెస్ అందుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మహిళా సాధికారికత కోసం వడ్డీ లేని రుణాలు, విద్యా, వైద్య రంగాల్లో పెను మార్పులు, ఉచిత బస్సు, గృహలక్ష్మి పథకాలు. పాలమూరు లాంటి వెనుకబడిన జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలలు, ట్రిబుల్ ఐటీ కళాశాల, ఏకీకృత పాఠశాలల నిర్మాణాలు, రేషన్ కార్డులు, ఉద్యోగాల నియామకాలు ఇలా అన్ని రంగాలలోనూ తమ ప్రభుత్వం సత్తా చాటిందన్నారు.

**వైద్య రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నాం**

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాం.. భవిష్యత్తులో అందరికీ అందుబాటులో ఉచిత వైద్యం ఉండేలా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. షాద్ నగర్ పట్టణంలో 14వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అందెమోహన్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా లక్ష్యంగా వైద్య రంగాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. బాధితులు వైద్యం కోసం వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు రాకుండా జిల్లా కేంద్రాల్లోనే వైద్యం అందుబాటులో ఉండేలా ఆస్పత్రులను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్యానికి సంబంధించి రీజినల్ క్యాన్సర్ కేర్ సౌత్ సెంట్రల్ హబ్ గా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎవరికి వైద్యం అవసరమైన మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేలా వైద్యాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. అదేవిధంగా కంటి పరీక్షలకు సంబంధించి ప్రత్యేక కేంద్రం, 80 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఎనిమిదో నిమిషంలో అంబులెన్సులు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్సలు ఏర్పాటు చేసేలా శివారు ప్రాంతాలలో 200 పడకలతో ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఉస్మానియా, గాంధీ హాస్పిటల్ తరహాలోనే 32 డిపార్ట్మెంట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 90% చికిత్సలు ఈ ఆసుపత్రిలోనే జరుగుతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా గ్రామీణ వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి డయాలాసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.

# నగరంలో ఆక్రమణలపై హైడ్రా చర్యలు

- బోరబండలో మూడున్నర ఎకరాలు కాపాడిన హైడ్రా
- సుమారుకుంట చెరువులో ఆక్రమ కట్టడాల తొలగింపు
- 1365 గజాల శివాలయం భూమిని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, (జనంసాక్షి):** నగరంలో పలు చోట్ల ఆక్రమణల ను, అక్రమ కట్టడాలను శుక్రవారం హైడ్రా తొలగించింది. బోరబండలోని 3.20 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దూలపల్లి విలేజ్‌లోని సుమారుకుంట చెరువు ఎఫ్‌టీ ఎల్ పరిధిలో 11 ఎకరాల మేర అక్రమ కట్ట డాలను తొలగించింది. నాగారం, రామ కృష్ణానగర్‌లో 1365 గజాల శివాలయం భూమిని హైడ్రా కాపాడింది. ఇలా మూడు చోట్ల హైడ్రా చర్యల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ కట్టడాలు తొలగింపు**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా దుండిగల్ - గండిమైసమ్మ మండలం దూలపల్లి విలేజ్‌లోని సుమారుకుంటలో అక్రమ కట్టడాలను హైడ్రా శుక్రవారం తొలగించింది. దాదాపు 42 ఎకరాల పరిధిలో ఈ చెరువు విస్తరించి ఉంది. శిఖం పట్టా ఉందంటూ ఎఫ్‌టీ ఎల్ పరిధిలో మట్టి నింపడం, పలు నిర్మాణాలు చేపట్టడం, ప్రహరీలు నిర్మించడం చేయడంతో పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు ఉల్లంఘించి.. పలు స్క్రాప్ దుకాణాలు, తాత్కాలిక షెడ్డుల్లో హోటళ్లు, కంటైనర్ల తయారీ షాపులు, వెల్డింగ్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇలా 11 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. వర్షాల సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని ఆ నిర్మాణాలను తొలగించినట్టు హైడ్రా అధికారులు పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీ ఎల్ పరిధిలోని శిఖం పట్టా భూముల్లో నీళ్లు లేనప్పుడు వ్యవసాయం మాత్రమే చేసుకోవాలి కాని.. నిబంధనలను అతిక్రమించి మట్టి నింపడం, ప్రహరీలు నిర్మించడం, షెడ్డులు వేయడం వంటి పనులు చేయరాదని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.

**3.20 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం**

ఖైరతాబాద్ మండలం యూసుఫ్ గూడ గ్రామంలోని సర్వే నంబరు 128/1 లోని మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. గతంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌కింద భూయజమానుల నుంచి ప్రభుత్వం తీసుకున్న భూమిలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలను హైడ్రా అడ్డుకుంది. యూఎల్‌సీ ల్యాండ్ ప్రభుత్వం క్లియర్‌చేసినట్టు తప్పుడు పత్రాలతో 3600ల గజాల స్థలాన్ని కొట్టేయాలని ప్రయత్నించిన షరీఫ్ ఖాన్ మీద బోరబండ పోలీసు స్టేషన్లో




హైడ్రా కేసు కూడా పెట్టింది. ఈ భూమితో కలిపి మొత్తం 3.20ఎకరాల భూమిలో ఇసుక వ్యాపారాలు, వ్యాపారాలతో పాటు.. వెలసిన తాత్కాలిక షెడ్డులను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది.

**గుడి భూమిని కాపాడిన హైడ్రా**

మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, నాగారం రామకృష్ణ నగర్ కాలనీ ( లేఔట్)లోని శివాలయానికి చెందిన 1365 గజాలను హైడ్రా కాపాడింది. 2017లో 400 గజాల్లో శివాలయం నిర్మించగా.. మిగిలిన భూమి ఖాళీగా ఉంది. అయితే అక్కడ కొంతమంది స్థానికులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రామకృష్ణానగర్ కాలనీ నివాసితులు హైడ్రా కు ఫిర్యాదు చేశారు. గుడికి కేటాయించిన భూమి అన్యాక్రాం తం అవ్వకుండా కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు హైడ్రా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో విచారించి దేవాలయానికి కేటాయించిన భూమిగా నిర్ధారిం చుకుంది. 1365 గజాల స్థలం దేవాలయనాకి చెందినదిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

# ఎల్వీ ప్రసాద్‌లో చెక్ రిపబ్లిక్ శిశువుకు పునర్జన్మ

**అరుదైన కంటి శస్త్రచికిత్స విజయవంతం**

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి):** పుట్టుకతో రెండు కళ్లు కనిపించని పసివాడికి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులు వెలుగులు పంచారు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన మూడు నెలల బాలుడు ఇమాద్ 'పీటర్స్ అనోమలీ' అనే అరుదైన కంటి సమస్యతో బాధపడుతుండగా నగరంలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కల్లం అంజిరెడ్డి క్యాంపస్ వైద్యులు రెండు కళ్లకు నల్లగుడ్డు మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహిం చారు. ఈ సమస్య కారణంగా కనుపాపలు పూర్తిగా తెల్లగా ఉండి, చూపు లేకుండా పోయింది. బాలుడి రెండు కళ్లను పరిశీలించిన వైద్యులు రెండు కళ్లకు 'కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్' (నల్లగుడ్డు మార్పిడి శస్త్రచికిత్స) నిర్వహించారు. ఎడమ కన్ను మరింత క్లిష్టంగా ఉండటంతో అందులో గ్లాకోమా (కంటి ఒత్తిడి) సమస్య కూడా ఉంది. దీనిని అదుపు చేసేందుకు 'ట్రాన్స్‌స్క్లెరల్ సైక్లోఫోటోకోగ్యులేషన్' అనే పద్ధతిని, మందులను ఉపయోగించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉన్న శిశువులో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. బాలుడు వస్తువులను గుర్తుపట్టడం, చూపును స్థిరంగా ఉంచడం వంటి సానుకూల లక్షణాలు కనిపిస్తున్నాయి. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు చెందిన పీడియాట్రిక్ కార్నియా నిపుణులు డాక్టర్ మురళీధర్ రామప్ప మాట్లాడుతూ పీటర్స్ అనోమలీ వంటి క్లిష్టమైన సమస్యల్లో ఫలితాలను కచ్చితంగా చెప్పలేమన్నారు. సరైన సమయంలో శస్త్రచికిత్స చేయడం, నిరంతర పర్యవేక్షణ ద్వారా చూపు వచ్చే అవకాశాలు మెరుగుపడ తాయని తెలిపారు.



శిశువు ఎదుగుదలలో చూపు మెరుగుపడటానికి ఇది ఎంతో కీలకమైన సమయం అన్నారు. బాలుడి తల్లిదండ్రులు తమ ఆనందాన్ని పంచుకుంటూ.. 'మా బిడ్డ మొదటిసారి మిమ్మల్ని చూస్తూ కళ్లలోకి కళ్లు పెట్టి నవ్వినప్పుడు కలిగే ఆ అనుభూతిని మాటల్లో వర్ణించలేం. ఈ ప్రయాణంలో ప్రతి అడుగులోనూ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్య పరంగానే కాకుండా, మానసిక ధైర్యం కూడా ఇచ్చిందన్నారు.

# గుప్త నిధుల మోసగాళ్ల గుట్టురట్టు

- నకిలీ బాబా అతని గ్యాంగ్ సహా ఏడుగురు అరెస్ట్
- ఆదిలాబాద్ జిల్లాలో 12 కేసులు నమోదు : ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి) :** గుప్త నిధుల పేరుతో జిల్లాలో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నకిలీ బాబాతో పాటు అతనికి సహకరిస్తున్న ఏడుగురు సభ్యుల మోసగాళ్లను పట్టుకుని గుట్టు రట్టు చేశారు జిల్లా పోలీసులు. ఈ మేరకు ఎస్పి అఖిల్ మహాజన్ పోలీసుల పనితీరును అభినందించారు. స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ భీంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పలకోటి గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు దర్శనల రాజ్ కుమార్ అను వ్యక్తి గత మూడు సంవత్సరాల క్రితం తనకు దేవర వస్తుందని, తనకు మంత్ర శక్తి ఉందని చుట్టూ పక్కల గ్రామాల వారిని నమ్మించినాడు. ప్రజలు అతనిని నమ్మి అతని వద్ద వచ్చి తమ బాదలను, కష్ట సుఖలను చెప్పేవారు, వారికి తన మంత్ర శక్తి ద్వారా కష్టాలను దూరం చేస్తానని నమ్మించడం తో చాలామం ది పరిచయం అయ్యారు. అదే క్రమంలో కొంతమందితో అతను, నేను మంత్ర శక్తి ద్వారా బంగారం తవ్విస్తాను, అని నమ్మించి వారినుండి ఇష్టం వచ్చినట్టు డబ్బులు తీసుకొని అతని బావ మహేందర్ మరియు మిత్రులు నవీన్, అరుణ్, శ్యామ్, అఖిల్ మరియు కిరణ్ లతో కలిసి పథకం ప్రకారం గుప్త నిధులు ఉన్నాయంటూ చెప్పిన వారి ఇంటికి వెళ్ళి అతని మిత్రుల సాయంతో గుంతను తవ్వించి అందులో నుండి తనతో ముందుగా తీసుకొచ్చిన కుండలో మట్టి మరియు ఆన్లైన్ ఫ్లిప్కార్ట్ కార్డ్ ద్వారా ఆర్డర్ చేసిన నకిలీ నాణేలు కుండలో పెట్టి, ఆ కుండను తవ్వకం లో వెళ్ళినట్టు సృష్టించి దూరం నుండి నకిలీ నాణేలు చూపెట్టి, నమ్మించి తర్వాత ఒక ఎర్రని బట్టతో అట్టి కుండను చుట్టి దానికి 41 రోజులు దాన్ని ముట్టకుండా, పూజలు చేయాలని తర్వాతా అతను వచ్చి తీసిస్తానీ చెప్పి నమ్మించి డబ్బులు తీస్కొని పారిపోయేవాడు. ముందే పూజ చేసిన బిందెతీస్తే తీసిన వారు చనిపోతారని భయపెట్టి వెళ్తారు ఆ విదంగా నేరస్థుడు దర్శనల రాజు తన మిత్రులైన నవీన్, అరుణ్, శ్యామ్ అఖిల్ మరియు కిరణ్ మరియు బావ మహేందర్ లతో కలిసి మొత్తం 26 మంది వద్ద నుండి రూ.1,03,80,000 (ఒక కోటి మూడు లక్షల ఎనబై వేలు) తీసుకొని మోసాగించినదాని ఇప్పుడు వరకు చేసిన దర్యాప్తులో తేలింది. ఇప్పటికీ వీరిపై జిల్లాలోని బీంపూర్ పోలీస్ స్టేషన్ లో 6, మావల పోలీస్ స్టేషన్లో ఒకటి, నేరడిగొండ పోలీస్ స్టేషన్లో ఒకటి,బోథ్ పోలీస్ స్టేషన్ రెండు, రూరల్ పోలీస్ స్టేషన్ ఒకటి, జైనథ్ పోలీస్ స్టేషన్ ఒకటి, మొత్తం 12 కేసులు నమోదయ్యాయి. ఇంకా దర్యాప్తు కొనసాగు తుందని వీరి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. డబ్బులు ఊరికే రావని ఇలాంటి నకిలీ బాబాలను నమ్మి ప్రజలు డబ్బులను వేచించకూడదని సూచించారు. నిందితుల వద్ద నుండి ఒక షిఫ్ట్ డిజైర్ కారు, ఒక బైకు, 7 మొబైల్ ఫోన్లను, గుప్త నిధుల పేరుతో మోసం చేసిన నకిలీ బంగారు నాణాలు కుండలు పలు బట్టలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన జైనథ్ సిఐ, బీంపూర్ ఎస్సై , సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు జి శ్రావణ్, కె ఫణిదర్, చంద్రశేఖం, సిబ్బందిపాల్గొన్నారు.

# దిగజారుడు రాజకీయాలు ఇకనైనా మానుకో

- ఓడిపోయినా నీ తీరు మారద అని ఆగ్రహం
- మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పై మండి పడ్డ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**ముధోల్, (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్‌లకు నేను నిధులు తెచ్చాను అని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి చెప్పటం, సిగ్గుచేటని ఇకనైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. ఇలాంటి నీచ రాజకీయాలు ఏ మాజీ ఎమ్మెల్యేలు చేయలేదని, ఓడిపోయిన అధికారం ఉందన్న భ్రమలో విఠల్ రెడ్డి గడుపుతున్నారని, ఇలాంటి రాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నియోజకవర్గంలో 16 కోట్ల 45 లక్షల రూపాయలు నిధులతో 164 మహిళా సమైక్య భవనాల నిర్మాణం, షెడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే చెప్పుకోవడానికి నీకెవరు అధికారం ఇచ్చారని అన్నారు. ప్రజలు తనకు ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, నియోజకవర్గంలో ఏ అభివృద్ధి జరిగినా అది



తాను చేసినట్టేనని చెప్పారు. పది సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి ఏం చేయకుండా జిరాక్స్ కాపీలను పట్టుకొని ప్రజలను మభ్యపెడితే సహించేది లేదన్నారు. అధికారం పోగానే, అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరి చిల్లర రాజకీయాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి తగిన శాస్తి చెబుతామన్నారు. ప్రజాక్షేత్రంలో ఓడిపోయిన వారికి కాస్త ఓపిక సహనం ఉండాలన్నారు. దమ్ముంటే ప్రాజెక్టులకు నిధులు తేవాలని సూచించారు.

# పోలింగ్‌కు ముందు మద్యం, కల్లు దుకాణాలు మూసివేతకు ఆదేశాలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొ రేషన్ల సాధారణ ఎన్నికలు--2026లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోని మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఈ నెల 11న పోలింగ్, 13న కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా మున్సి పాలిటీ పరిధిలో మద్యం, కల్లు దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. ఈ నెల 11న పోలింగ్, 13న కౌంటింగ్ ఉండడంతో ఎన్నికలు ముగియడానికి నిర్ణయిం చిన సమయానికి 48 గంటల ముందు పోలింగ్ ప్రాంతాల్లో మద్యం, కల్లు దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత యాజమాన్యాలకు సూచించారు. స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

# పురపాలక ఎన్నికల భద్రతకు కట్టుదిట్టు చర్యలు

- జిల్లాలో 4 చెక్‌పోస్టులు.. 10 స్పెషల్ టీమ్స్ ఏర్పాటు
- గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల నడిగడ్డ, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, తెలిపారు. పురపాలక ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు, మద్యం,ఇతర నిషేధిత వస్తువుల తరలింపును అరికట్టే లక్ష్యంతో జిల్లాలో మొత్తం 04 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇందులో మూడు ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, ఒకటి ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్ట్ ఉన్నట్లు తెలిపారు. బల్గేరా, సుంకేసుల డ్యామ్ చెక్‌పోస్టులు పురపాలక ప్రాంతాలకు దూరంగా ఉండటంతో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అలాగే పురపాలక ప్రాంతాలకు అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకునే ఉద్దేశంతో క్లోజ్ మానిటరింగ్ కోసం వీటిని పురపాలక ప్రాంతాలకు సమీపంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. బల్గేరా చెక్‌పోస్ట్, గట్టు పోలీస్ స్టేషన్ పరిధి ప్రస్తుతం తుపత్రాల వద్ద, అయిజ పోలీస్ స్టేషన్ పరిధిలో,సుంకేసుల డ్యామ్ చెక్‌పోస్ట్,రాజోలి పోలీస్ స్టేషన్ పరిధి ప్రస్తుతం వడ్డేపల్లి శివారులోని పట్టణ ప్రకృతి వనం వద్ద, శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ర్యాలంపాడు చెక్‌పోస్ట్,అలంపూర్ పోలీస్ స్టేషన్



పరిధి, జూరాల డ్యాం చెక్‌పోస్ట్ ధరూర్ పోలీస్ స్టేషన్ పరిధి.అదేవిధంగా జిల్లాలో మొత్తం 10 స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీటిలో 04 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 06 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ఉన్నాయి. ఈ టీమ్స్ చెక్‌పోస్టుల వద్దతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనల మేరకు వాహనాలపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుమానాస్పద వస్తువులు,అక్రమ నగదు తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. పురపాలక పరిధుల వారీగా గద్వాలలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, రెండు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, అయిజలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, రెండు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, వడ్డేపల్లిలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్,ఒక స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్, అలంపూర్‌లో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, ఒక స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గద్వాల పురపాలక పరిధిలోని స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమావత్ ముని నాయక్, ఆర్‌ఎస్ఐ వెంకటేష్, సివిల్ పీసీ గోవిందులు చురుకుగా విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు చేస్తున్న తీరును ఎస్పీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పూర్తిగా అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు,అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎన్నికల సమయంలో చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురపాలక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమములో జిల్లా ఎస్పీతో పాటు గద్వాలడి ఎస్పీ మొగిలయ్య, , గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# రైతు అజమాయిషీలోనే విత్తనాల పరిరక్షణ

- రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- హైబ్రిడ్ విత్తన వ్యాపారానికి చెక్ పెట్టాలని పిలుపు

**హైదరాబాద్, (జనంసాక్షి):** అంతరించిపోతున్న దేశీయ, సాంప్రదాయ విత్తనాలను కాపాడుకుంటూ వాటి నిర్వహణను కంపెనీలు, కార్పొరేట్ల గుప్పిట్ల నుంచి రైతు అజమాయిషీలోకి తీసుకురావాలని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి పిలుపునిచ్చారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అది రైతు హక్కు అని తెలిపారు. బహుళ జాతి కంపెనీలు హైబ్రిడ్ విత్తన వ్యాపారంతో రాష్ట్ర ప్రభుత్వాలను శాసిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాంప్రదాయ విత్తనాలతోనే వాటికి చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాసుపల్లిలోని ఎర్త్ సెంటర్‌లో సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్-సీజీఆర్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ మూడురోజుల పాటు నిర్వహిస్తోన్న తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండ రెడ్డి మాట్లాడుతూ.. బహుళజాతి కంపెనీలు దేశంలో వేల కోట్ల రూపాయలు సంపాదిస్తూ కూడా ఐటీ, మార్కెట్ ఫీజు మినహాయింపు పొందుతున్నాయన్నారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను కూడా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాయని విమర్శించారు. కలుపు మందులు చాలా విషపూరితమని, అయినా ఎరువుల దుకాణాలలో దొరకడం శోచనీయం అన్నారు. మనకు వనరులు, అవకాశం ఉన్నప్పటికీ సాంప్రదాయ విత్తనాలను పండించడం లేదని, ఇప్పటికయినా మేల్కొనకపోతే ఒకవంక వాతావరణ మార్పుల దుష్ప్రభావం, మరో వంక బహుళ జాతి కంపెనీల చేతిలో ఇబ్బందుల పాలవుతామని కోదండరెడ్డి హెచ్చరించారు. సాంప్రదాయ విత్తనాల వినియో గానికి, రైతుల హక్కులు కాపాడడానికి కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. వ్యవసాయ రంగానికి ప్రభు త్వం అన్ని రకాల సహకారం అందిస్తుందన్నారు కోదండ రెడ్డి. అనంతరం విత్తన స్టాళ్లను ఆయన ప్రారంభిం చి, సందర్శించారు. ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి ప్రసంగిస్తూ.. ఆహారంలోనే ఆరోగ్యం ఉందని, దురదృష్టవశాత్తు ఆ ఆహారం కల్తీ అయ్యి ందన్నారు. రాబోయే తరాల కోసం సాంప్రదాయ విత్తనాలను రక్షిద్దామని పిలుపు నిచ్చారు. వైస్ ప్రెసిడెంట్, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ... మానవ సమాజానికి రైతు చేస్తున్న సేవలో విత్తన పండుగ కూడా ఒకటని అన్నారు. గత ఏడాది నిర్వహించిన విత్తన పండుగ లో 50 స్టాళ్లు ఏర్పాటు చేయగా, ఈసారి 75 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆహార వ్యవస్థలో తీవ్ర మైన మార్పులు వచ్చి ప్రపంచ వ్యాప్తంగా జన్యు సంపద ప్రమాదంలో పడిందని, వాటిని కాపాడటమే విత్తన పండుగ ప్రధాన ఉద్దేశమని పర్యావరణ వేత్త, కార్యక్రమ కన్వీనర్ దొంతి నర్సింహారెడ్డి తెలిపారు. రైతు కమిషన్ సభ్యుడు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కల్తీ మందులు, విత్తనాలతో పక్షి జాతులు అంతరించి పోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ... సమస్య చాలా తీవ్రంగా ఉందని, జీవ వైవిధ్యం నశించి పోతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వాలు తలవంచుతున్నాయని విమర్శించారు. 'నాబార్ధ' చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని 13 జిల్లాలలోని 180 స్కూళ్ళలో ట్రెడిషనల్ గార్డెన్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు సాంప్రదాయ వ్యవసాయం పై అవగాహన కల్పిస్తున్న సీజీఆర్ కార్యక్రమం 'వైఇఎల్పీ' కి నాబార్డు మద్దతిస్తున్నట్టు చెప్పారు. సాంప్రదాయ విత్తనాల చేస్తున్న కృషిని కొనియాడారు. సహకారం ఉంటుం దన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీ గంగుల ప్రతాప్ రెడ్డి, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ కన్వీనర్ జాకోబ్, జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ పాల్గొని ప్రసంగించారు.



# వాచ్‌మెన్‌కు మత్తుమందు ఇచ్చి చోరీ

- జూబ్లీహిల్స్‌లో ఘరానా దొంగతనం



హైదరాబాద్, ఫిబ్రవరి6 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఆ ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. రూ.20 లక్షలు విలువ చేసే బంగారం, డైమండ్స్ దోచుకెళ్లారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను పోలీసులు ఏర్పాటు చేశారు. నందగిరి హిల్స్ నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ వరకు సీసీ టీవీలను పరిశీలించారు. మొదటగా.. ఆ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉన్న వాచ్‌మన్‌కు మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆ తర్వాత ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేశారు. వాచ్‌మన్ మత్తులోకి జారుకోగానే దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి లాకర్‌లోని బంగారు ఆభరణాలు మొత్తం ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసులో నలుగురు నేపాలీలను ప్రధాన అనుమానితులుగా భావిస్తున్నారు పోలీసులు. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దొంగల కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దొంగలు నగరం విడిచి వెళ్లకుండా విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఈ తరహా నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల జాబితాను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నగరంలో నేపాలీ గ్యాంగ్‌ల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పని మనుషులు, వాచ్‌మెన్‌లను నియమించే సమయంలో వారి ఆధార్ కార్డులు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# పన్నుల భారం మోపినా ఓటేద్దామా?

- జిన్నారంను మున్సిపాలిటీ చేసి భారం మోపిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకుల బాగుపడతాయి
- మున్సిపల్ ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు



సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపిందని, ఇప్పుడు ఎవరికి ఓటేద్దాం..? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు ఓటర్లను ప్రశ్నించారు. మనల్ని మంచిగా చూసుకున్న వాళ్ళకు, మన భారాన్ని తగ్గించే వాళ్ళకే ఓటేద్దామని అన్నారు. హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు. జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామ పంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపామని చెప్పారు. కానీ కేసీఆర్ రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీలో చంద్రబాబు రూ.4000 ఇస్తానని చెప్పి ఇస్తున్నాడు కదా? మరి ఇక్కడ రేవంత్ రెడ్డికి ఎందుకు చేతులు రావడం లేదు..? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని హరీష్‌రావు విమర్శించారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60,000 చొప్పున బాకీ పడిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మకు ప్రతి మహిళకు చీర ఇచ్చేదని, రేవంత్ రెడ్డి వచ్చాక చీర లేదు, గాజులు లేవని చెప్పారు. ఏదో గ్రూపులో ఉన్న కొద్దిమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని అన్నారు. ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్లకు టికెట్ రేట్ డబుల్ చేశాడని తెలిపారు. ఆడోళ్ళకు సీటు దొరక్క తిప్పలు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక 5 పంటలు వస్తే.. రెండింటికి ఇచ్చి మూడింటికి రైతుబంధు ఎగ్గొట్టాడని విమర్శించారు. నాటేసిన వాళ్లకే రైతుబంధు ఇస్తా, శాటిలైట్‌లో చూసి ఇస్తా అని కొత్త నిబంధనలు పెట్టి రైతులను గోస పెడుతున్నాడని రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు మండిపడ్డారు. దేవుడి మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఏ ఊర్లో చూసినా సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మీరు కారు గుర్తుకు ఓటు గుద్దితే.. రేవంత్ రెడ్డికి గూబ గుయ్యిమనాలె అని పిలుపునిచ్చారు. అప్పుడే భయపడి హామీలైనా అమలు చేస్తాడని అన్నారు. ఓటుకు 5 వేలు ఇస్తామంటారని, అవి తీసుకొని మోసపోవద్దని హెచ్చరించారు. మహిళలకు రావాల్సిన రూ.60,000, అవ్వ తాతలకు రూ.4000 పెన్షన్ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలని అన్నారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే లాగుల తొండలు ఇడిసిపెడతా అంటాడని, మహిళలు హామీల గురించి అడిగితే మెడలో పేగులు వేసుకుంటా అంటాడని, తులం బంగారం ఏదని అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని హరీష్‌రావు సీఎంను విమర్శించారు. ప్రశ్నిస్తే కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి సీఎం అహంకారాన్ని దించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లు ఓపిక పట్టాలని, వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. జిన్నారం సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, కాబట్టి అందరూ ఏకమై కారు గుర్తు అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# ఏడుపాయలలో శివరాత్రి జాతర

- 15 నుంచి 17 వరకు నిర్వహణ

మెదక్, ఫిబ్రవరి6 (జనంసాక్షి) : అత్యంత వైభవంగా జరిగే రెండో అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవాని మాత మహాజాతరకు ముహూర్తం ఖరారైంది. ఏడు పాయల మధ్య వెలిసిన ఆ వనదుర్గమ్మ కు శివరాత్రి సందర్భంగా జాతర నిర్వహిస్తారు. ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం , ఆలయ కమిటీ సర్వ సిద్ధం చేస్తోంది. మంజీరా నది ఏడు పాయలుగా విడిపోయి, అమ్మవారి పాదాల చెంత నుంచి ప్రవహించే ఈ పవిత్ర క్షేత్రానికి ఏటా కోట్లాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా జాతరలో భాగంగా మొదటి రోజు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకోనున్నారు. రెండో రోజైన ఫిబ్రవరి 16న జాతరలోనే ప్రధాన ఘట్టమైన 'బండ్ల ఉత్సవం' అత్యంత కోలాహలంగా సాగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తమ ఎడ్లబండ్లను రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదర్శనగా తిరుగుతూ మొక్కులు తీర్చుకుంటారు. ఆఖరి రోజైన ఫిబ్రవరి 17న రథోత్సవంతో ఈ మహా క్రతువు ముగుస్తుంది. ఈ జాతరకు కేవలం మెదక్ జిల్లా నుంచే కాకుండా సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ , పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుండి కూడా సుమారు 15 లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ భారీ జనసమూహానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు స్నానాల సమయంలో ఇబ్బంది కలగకుండా మంజీరా నదిలోకి నీటిని విడుదల చేయడంతో పాటు, ఘాట్ రోడ్ల మరమ్మతులు, బారికేడ్ల నిర్మాణం , తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా సౌకర్యం కోసం తెలంగాణ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను నడపనుంది. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, భారీ పోలీస్ బందోబస్తును కూడా మోహరిస్తున్నారు. వనదుర్గమ్మ ఆశీస్సుల కోసం వచ్చే భక్తులందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# పులి జాడ కోసం వెతుకులాట

- కెమెరా ట్రాప్స్.. థర్మల్ డ్రోన్‌లతో పరిశీలన
- నిడిగొండ వైపు వెళ్లినట్లు అధికారుల వెల్లడి



జనగామ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి బయలుదేరిన మగ పులి లింగాలఘణపురం మండలం కుందారం శివారుకు చేరుకున్నట్లు అటవీశాఖాధికారులు గుర్తించారు. బుధవారం రాత్రి కుందారం శివారులో సంచరించినట్లు స్థానిక రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ వణ్యప్రాణుల సంరక్షణా విభాగానికి సమాచారాన్ని చేరవేశారు. దీంతో గురువారం నాడు కుందారం చేరుకున్న అటవీశాఖాధికారులు పులి తిరిగిన ప్రదేశాన్ని పాదముద్రల (పగ్ మార్క్స్) ఆధారంగా పరిశీలించి పులి సంచరిస్తున్నట్లు నిర్ధారించారు. పదిరోజులుగా యాదాద్రిభువనగిరి, సిద్దిపేట జిల్లాలో సంచరించిన పులి.. తాజాగా రెండు రోజుల కిందట జనగామ జిల్లాలోకి ప్ర వేశించింది. మొదట బచ్చన్నపేట మండలంలోకి ప్రవేశించి తిరిగి యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు, శారాజీపేట మీదుగా జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం జీడికల్ నుంచి బుధవారం నాటికి కుందారం శివారులోకి ప్రవేశించింది. అప్పటికే పగ్‌మార్క్స్ ద్వారా పులి ట్రాకర్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కచ్చితమైన కదలికలను తెలుసుకునేందుకు కెమెరా ట్రాప్స్, థర్మల్ డ్రోన్స్‌తో అన్వేషిస్తుండటం గమనార్హం. కాగా, పులి సంచారం నేపథ్యంలో జిల్లా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పులి ఎక్కడి నుంచి ఎటు వైపు వెళ్తుందో అర్థంకాక బావుల వద్ద ఉన్న డెయిరీ ఫామ్‌లు, పాడిగేదెలతో పాటుగా ఇతర ప శువులను కాపాడుకునేందుకు రైతులు కంటిమీద కును కు లేకుండా అష్టకష్టాలు పడుతున్నారు. అయితే కుందారం మీదుగా రఘునాథపల్లి మండలం నిడిగొండ వైపుకు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొండల్‌రెడ్డి నిర్ధారించారు. మరోవైపు పులికి ఎలాంటి హాని కలగకుండా ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోకుండా సురక్షితంగా పులిని బంధించేందుకు అటవీశాఖాధికారులు శ్రమిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా నిడిగొండ, శ్రీమన్నారాయణపురం, బానాజీపేట, రఘునాథపల్లి, కన్నాయిపల్లి, గబ్బెట గ్రామాల్లో టాంటాం వేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు సయ్యద్ ఇజాజ్ అహ్మద్, రమేశ్, లింగాలఘణపురం బీట్ ఆఫీసర్ రమేశ్, సెక్షన్ ఆఫీసర్ శోభారాణితో పాటుగా టైగర్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

# తెలంగాణలో పవన్ ప్రచారం రద్దు



నల్లగొండ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : తెలంగాణలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయ్యింది.. ఆదివారం నల్గొండలో బీజేపీ తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని ముందే ప్రకటించింది తెలంగాణ బీజేపీ.. అయితే, తాజాగా పవన్ పర్యటన రద్దు అయినట్టు వెల్లడించింది.. ఏపీలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు.. వ్యక్తిగత కారణాలతో పవన్ పర్యటన రద్దయ్యిందని ప్రకటించింది బీజేపీ.. ఇక, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 336 వార్డుల్లో జనసేన పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.. ఈ నెల 11వ తేదీన జరగనున్న తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 336 వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్నట్టు పార్టీ ప్రకటించింది.. ఇందుకు సంబంధించి పార్టీ అభ్యర్థుల ఫారమ్‌లు దాఖలు చేయగా, స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను ఆమోదించారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు గాజు గ్లాస్ గుర్తుపై పోటీ చేయనున్నారని పార్టీ వెల్లడించింది..

# మిర్చిరైతులకు మంచి రోజులు

- వరుసగా పెరుగుతున్న ధరలతో ఆనందం



వరంగల్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : మిర్చి రైతులకు చాలాకాలం తరవాత మంచిరోజులు వచ్చాయి. పంటలకు గణనీయంగా ధరలు పలుకుతున్నాయి. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు ఘాటెక్కుతున్నాయి. గత రికార్డులను బ్రేక్ చేస్తూ వండర్‌హాట్ రకం మిర్చి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.38వేల ధర పలికి రికార్డు సృష్టించింది. ఏనుమాముల మార్కెట్‌కు మిర్చి రాబడులు గణనీయంగా తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కాగా, బుధవారం వండర్‌హాట్ మిర్చి రూ.37,100 ధర పలికి ఆల్‌టైం రికార్డు సృష్టించగా, ఒక్క రోజు వ్యవధిలోనే రూ.900 పెరిగి రూ.38వేలు పలకడం విశేషం. వరుసగా రెండు రోజుల నుంచి మిర్చి ధరలు రికార్డు స్థాయికి చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వండర్‌హాట్, 341 రకాలను సాగు చేసిన రైతులకు మంచి లాభాలు వస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే యూఎస్ 341 రకం మిర్చికి రూ. 26,700, దీపిక రకం మిర్చికి రూ.27వేలు, తేజ రకం మిర్చికి రూ.19,500, పత్తికి రూ.7,630, మినుములకు రూ.8,602, పెసర్లకు రూ.8,352 గరిష్ఠంగా ధరలు పలికాయి. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. బుధవారం రూ.7,700 ఉండగా ఒక్క రోజులో క్వింటాల్‌కు రూ.70 తగ్గి రూ.7,630కి పడిపోయింది. దీంతో ధరలో స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది.

# పార్టీలో నా వర్గాన్ని దూరం పెట్టారు

- రాజకీయంగా దెబ్బకొట్టేందుకు యత్నాలు
- కాంగ్రెస్ తీరుపై జీవన్ రెడ్డి ఆవేదన



జగిత్యాల, ఫిబ్రవరి6 (జనంసాక్షి) : జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా తన మెడ నరకడానికి కాంగ్రెస్ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన భుజాలుగా ఉన్న వ్యక్తులను తనకు దూరం చేశారని చెప్పారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టమని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రచారం సందర్భంగా పార్టీకి చెందిన మహిళలు, కార్యకర్తలతో ఆయన తన బాధను చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో వారు జీవన్‌రెడ్డిని ఓదార్చారు. మున్సిపాలిటీలో తాము మీ వర్గాన్ని గెలిపించి తీరుతామని చెప్పారు. కాగా చట్టసభలకు ఏ పార్టీ తరఫున గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని గతంలో రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ఆయన పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పారని, కానీ ఆయనే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వేరే పార్టీల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వాళ్లను ఓటుతో కొట్టాలని తాను అంటున్నానని చెప్పారు. తన వర్గం వారికి కాంగ్రెస్ సీట్లు నిరాకరించడంతో కొన్ని వార్డుల్లో స్వతంత్ర్యులుగా బరిలో దిగిన తన వర్గం వారి తరఫున జీవన్‌రెడ్డి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వర్గాన్ని పక్కనపెట్టి.. తనతోపాటు బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్నారని, కానీ కాంగ్రెస్ జెండా పట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నా అంటూ సంజయ్ కాంగ్రెస్ జెండాను ఎత్తుకుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడ్డారని వ్యాఖ్యానించారు.


# వికసిత భారత్ నిర్మాణ లక్ష్యంగా బడ్జెట్

- బడ్జెట్‌పై ఏర్పాటైన కార్యక్రమంలో ప్రహ్లాద్ జోషి

హైదరాబాద్, ఫిబ్రవరి6 (జనంసాక్షి) : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2047వరకు వికసిత భారత్ నిర్మాణ లక్ష్యంగా ఉందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.. తాజాగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే భారత్ ను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మోడీ కృషి చేస్తున్నారని చెప్పారు.. ఏఐ జనరేషన్ నడుస్తున్న పరిస్థితుల్లో కొత్త సంస్కరణలు తీసుకు వస్తున్నామని స్పష్టం చేశారు.. స్వాతంత్య్రం సిద్ధించాక కాంగ్రెస్ సుదీర్ఘ కాలం దేశాన్ని పరిపాలించింది.. ప్రపంచంలోనే భారత్ మూడోవ ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు.. ఇది భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశిరచుకుని రూపొందించిన బడ్జెట్ అని.. ఇందులో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేశామని చెప్పారు.. కొంత మంది వ్యక్తులు బడ్జెట్ ను విమర్శిస్తున్నారని.. తెలంగాణకు ఏమీ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు.. 5 వేల కిలో మీటర్ల జాతీయ రహదారులు ఇచ్చామని చెప్పారు..పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు నిధులతో పాటు గ్రాంట్లు ఇచ్చామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.. ఆత్మ నిర్భర భారత్ కింద తెలంగాణలోని 42 రైల్వే స్టేషన్లు ఆధునికీకరించాం.. ఏడు హై స్పీడ్ రైల్ కారిడార్లలో.. మూడు హైదరాబాద్ కే కేంద్రం ఇచ్చింది.. కొన్ని పార్టీల నాయకులు తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. తెలంగాణ ప్రజల పట్ల మోడీకి ప్రేమ ఉంది.. మోడీపైన తెలంగాణ ప్రజలకు ప్రేమ ఉంది.. వీబీ జీ రామ్ జీ వల్ల ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేశారని తప్పుడు ప్రచారం చేశారు.. వీబీ జీ రామ్ జీకి బ్జడెట్లో గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించడం జరిగిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

# జగన్ పర్యటనలో అపశ్రుతి

- ఇద్దరు వ్యక్తులు దుర్మరణం



విజయవాడ, ఫిబ్రవరి6 (జనంసాక్షి) : వైకాపా అధినేత జగన్ పర్యటన సందర్భంగా అపశ్రుతి చోటు చేసుంది. మాజీ మంత్రి జోగి రమేష్‌ను పరామర్శించేందుకు తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నం బయల్దేరారు. ఈ క్రమంలో జోగి రమేష్ ఇంటి సమీపంలో వైకాపా నేత ఒకరు మృతి చెందారు. జగన్ పర్యటన దృష్ట్యా జోగి రమేష్ ఇంటికి వెళ్తున్న వైకాపా చిల్లకల్లు గ్రామ అధ్యక్షుడు డి.రాంబాబు పల్స్ పడిపోయి కుప్పకూలారు. సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఇబ్రహీంపట్నం లో బైక్‌పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బార్ గేట్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. మృతుడు ఇబ్రహీంపట్నం కొత్తగేట్‌కు చెందిన భార్గవ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వైకాపా కార్యకర్తలు రెచ్చిపోయారు. జన సమీకరణతో గుంపులు గుంపులుగా రోడ్లపైకి చేరుకుని ప్రజలను అవస్థలకు గురిచేశారు. ఇబ్రహీంపట్నం రింగు, తదితర ప్రాంతాల్లో బైక్‌లతో స్టంట్‌లు చేస్తూ అలజడి సృష్టించారు. జోగి రమేశ్ సహా పలువురు వైకాపా నేతలు అక్కడే ఉన్నా వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదు. పరామర్శ పేరుతో ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్నారు. మొన్న అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించిన జగన్.. ఇప్పుడు జోగి రమేశ్ ని పరామర్శించేందుకు విజయవాడ ఇబ్రహీంపట్నానికి చేరుకున్నారు. అయితే, ఉదయం నుంచీ జగన్ కోసం ఎదురు చూస్తూ ఓ కార్యకర్త, బైక్ స్టంట్ చేస్తూ మరో అభిమాని జగన్ యాత్రలో ప్రాణాలు కోల్పోయారు. తాడేపల్లిలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరిన జగన్.. నాలుగు గంటలైనా ఇబ్రహీంపట్నం చేరలేదు. ఉదయం నుంచీ జగన్ కోసం పడిగాపులు కాసిన వైసీపీ కార్యకర్త రాంబాబు పల్స్ డౌన్ కావడంతో.. ఇబ్రహీంపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద పడిపోయారు. వెంటనే గొల్లపూడి ఆంధ్రా హాస్పిటల్‌కు తరలించగా.. చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. అలాగే, ఇబ్రహీంపట్నం కొత్తగేట్‌కు చెందిన భార్గవ్ అనే యువకుడు బైక్‌పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బారికేట్‌ను గుద్దుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ కన్నుమూశాడు. భార్గవ్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు. కాగా, గతేడాది జూన్ లోనూ ఇలాంటి ఘటనే గుంటూరు జిల్లాలో చోటుచేసుకుంది. సత్తెనపల్లిలో పర్యటించిన జగన్ కారు కిందపడి సింగయ్య అనే వైసీపీ కార్యకర్త మృతిచెందాడు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి జగన్ పర్యటనకు వచ్చిన ప్రతిసారీ భారీగా జనాన్ని సమీకరించి వారి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ఆ పార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు. మరోవైపు ట్రాఫిక్, పోలీసు ఆంక్షలు విస్మరిస్తూ లా అండ్ ఆర్డర్ సమస్యలు తెస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370